ఆంధ్రపత్రిక


సచిత్రవారపత్రిక



పండుగ ముస్తాబు

30-3-49 ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY వెల **4** అణాలు

వార్తాచిత్రాలు




భారత రాజ్యాంగపరిషత్ అధ్యక్షుడు డా. రాజేంద్రప్రసాదుగారు బొంబయి ప్రభుత్వ "క్షీరకేంద్రానికి" ప్రారంభోత్సవం జరుపుతున్న దృశ్యం.



న్యూఢిల్లీలోని లేడీ ఇర్విన్ కాలేజి స్థాపన దినోత్సవ సందర్భంలో ప్రధానామాత్యుడు పండిట్ నెహ్రూ, కాలేజి విద్యార్థినుల గౌరవ వందనము స్వీకరించిన దృశ్యం.




భారతదేశంలో భారతరాయబారి సర్ మాంగ్ గ్యి, తన అనుచరవర్గంతో మార్చి 22-న రాజఘాట్‌లో మహాత్మాగాంధి సమాధివద్ద భక్తితాత్పర్యాలతో పుష్పగుచ్ఛము లుంచి, ప్రార్థనచేసిన దృశ్యం.



నెహ్రూ అభినందన గ్రంథం తయారుచేయడానికి ఏర్పాటైన ఉపసంఘం ఇటీవల ఢిల్లీలో రాజేన్‌బాబు అధ్యక్షతను సమావేశమైంది.



జమ్మూలో భారతసైనిక ప్రదర్శనము: ఇటీవల జమ్ములో పశ్చిమ సైనికశాఖ సేనాని లెఫ్టనెంటు జనరల్ శ్రీ నగేష్ భారత సైనిక ప్రదర్శనను పరిశీలించుచుండగా తీసిన ఛాయాచిత్రం.



మౌంట్‌బాటెన్ సతి ఈ నెల 22 న బొంబయిలోని పసిపిల్లలకు పక్షవాతం వస్తే నయంచేసే ఆస్పత్రిని సందర్శించి, అచ్చట చికిత్స పొందుతున్న ఒక బాలుని యోగక్షేమం విచారిస్తున్న దృశ్యం.

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా రు. 12-0-0

విడిపత్రిక అణాలు 0-4-0

ప్రతి బుధవారమున ప్రకటింపబడును

ఒరు లేయవి యొనరించిన నరవర ! యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్.(మహాభారతము)

సంపుటము 41

సంచిక 28

Founder : K. NAGESWARA RAO

విరోధి సంవత్సర చైత్ర శుద్ధ పాడ్యమి బుధవారము



శ్రీ ద్వారం వేంకటస్వామినాయుడుగారు

(మార్చి 26 న మద్రాసుగవర్నరుగారి అధ్యక్షతను రాజాజీహాలులో, సంగీతరత్నాకర, సంగీతకళానిధి ద్వారం వేంకటస్వామినాయుడుగారిని సన్మానించటానికి ప్రత్యేకసన్మానసభ జరిగినది.)



ఆంధ్రపత్రిక

1949-వ సం॥ మార్చినెల 30-వ తేది బుధవారము

చీకటిబజార్ల చట్టము

మద్రాసుప్రభుత్వము చీకటిబజారు నిర్మూలనమునకై ప్రవేశపెట్టనున్న ఒక తీవ్రమైన చట్టమును ప్రకటించినది. ఇట్టి చట్టము ప్రవేశపెట్టుటకు ముఖ్య కారణములను నివేదించుచు, అధికారు లెంత అప్రమత్తులై కృషిచేయుచున్నను ప్రజల సహకారము సరిగా లేనందున "బ్లాక్‌మార్కెటీర్ల"ను పూర్తిగా నిరోధించుట కవకాశము దొరకుట లేదనియు, తత్కారణముగా ఇంత తీవ్రమైన చట్టమును ప్రవేశపెట్టుట అవసరమైనదనియు ప్రభుత్వ మంత్రి తెలిపికొనెను.

బ్లాక్‌మార్కెటును నిర్మూలించుటయున్న సర్వులకు సంతోషదాయకమైన విషయమే. దానికై, ధర్మయుతముగ ప్రభుత్వ మెంత తీవ్రముగ వ్యవహరించినను ప్రజ దానికి హర్షింపక తప్పదు.

కాని, చట్టము సంపూర్ణముగ ధర్మయుతమే ననియు, తద్వ్యతిరేకముగ వ్యవహరించియుండుటయు, తత్ఫలితముగ తగు శిక్ష ననుభవించుటయు, తన దోషఫలితము తప్ప, చట్టములోని దోషములవలనమాత్రము కాదన్న నమ్మకము, సామాన్యలోకజ్ఞానముగల ప్రతిపౌరునికి,—కొంత యాలోచించుకొనినపిమ్మటనైనను—స్ఫురించునట్టిదిగ నుండుట, ప్రతిచట్టమునకు ప్రాతిపదిక ధర్మము. ఆపద్ధర్మములుగ ప్రభుత్వ మవలంబించిన చట్టములయందుకూడ ఈ ధర్మసూత్రము ప్రాతిపదికగా నుండుట యత్యవసరము. ధర్మసంస్థాపనార్థమై ప్రభుత్వ మవలంబించు శిక్షాస్మృతిలో, సంస్థాపకులగు ఉద్యోగులపట్ల, స్పర్ధ, విద్వేషములను, పెంచు అవకాశములను, అవకాశచ్ఛాయలనుగూడ ఏమాత్రము చొరనీయకుండ, చట్టములను నిర్మించుట ప్రభుత్వశాసనసభల విధి. ఈ చట్టములో, దోషిపట్ల ప్రభుత్వము తీసికొనదలచిన చర్యలు, సామాన్యశిక్షావిధానమునకు మించి, దోషిని నిరంతర అవమానముతోను, ద్వేషముతోను, సంఘముపట్ల విద్వేషముతోను వ్యవహరించునట్లు మార్చునవిగ నున్నవి.

అసలు బ్లాక్‌మార్కెట్ అనునది ఎక్కడ నున్నదో, ఎట్లు జరుగుచున్నదో ప్రతివారికీ తెలిసీ తెలియని నిగూఢముగు రహస్యము. నేటి దుస్థితిలో, ఆలుబిడ్డల కన్నము లేక, చీకటిబజారులో బియ్య మెక్కువ కొన్నవాని మొదలు, లక్షలాదిటన్నుల ముడిసరకులను తన అధీనములో బిగించుకొని, బాహాటముగా తను కోరిన ధర యిచ్చిన తప్ప సరకు విడుదలచేయునది లేదని ప్రభుత్వమును బెదిరించి, తన కామితమును నెరవేర్చుకొను కోటీశ్వరునివరకు అందరూ బ్లాక్ మార్కెటులో భాగస్వాములే యగుచున్నారు.

అధిక లాభముల చట్టములనాటి శిక్షలలో, ముక్కానీ అగ్గిపెట్టెను అణాకాని కమ్మినవా రెవ్వరో ఒకరు మచ్చునకు నాల్గునెలలు ఖైదు, జుల్మానాల ననుభవించుటయే ప్రజకు గోచరమైనదితప్ప, అక్రమలాభములను నిర్మూలించుటకు ప్రభుత్వము నిజముగా పూనుకొనిన-దనిగానీ, అక్రమలాభములు ఎంతమాత్రము అపేక్షణీయములు కావనిగానీ, ప్రజల నుద్బోధింపలేకపోయినది. ఆనాటి చట్టమునకు ఇంత తీవ్రత లేకపోయినను తగుమాత్రము శిక్షల కవకాశము పూర్తిగనే యున్నది. లోపము శిక్షాస్మృతిలో లేదు. ఉద్యోగుల ఆచరణలో నున్నది. ప్రతి చట్ట అతిక్రమణను పెద్ద పిన్న తారతమ్యములను, స్వజన పరజన విచక్షణలను పాటించక-ప్రభుత్వఉద్యోగులు, బాహిరపరచి శిక్షించుటకు కంకణబద్ధులై యున్నారన్న విశ్వాసమును, భయమును, ధైర్యమునుగూడ, ప్రభుత్వము ప్రజలలో కల్పించగల్గియుండిన, ఈనాడు ప్రజల సహకారము సరిగ లేదని, ప్రభుత్వము వాపోవలసిన యవసర ముండెడిది గాదు.

ప్రజల సహకారము లేమి, చట్టము తీవ్రముగ లేకుండుటవలన గాదు. పైపెచ్చు చట్టము తీవ్రమైనకొలదియు, సుజనుని పట్లనైనను, కుజనునిపట్లనైనను, తాత్కాలికమగు కరుణచేతను, జాలిచేతను ప్రేరితులయి, అతని నేరమును కప్పిపుచ్చుటకే ప్రయత్నించుట సామాన్యమానవస్వభావము! కాంగ్రెసువారి కందరకది అనుభవైకవేద్యము. ఈ కరుణ అప్రశస్తమైన తరుణములను సామాన్యప్రజకు విశదీకరించుట ప్రభుత్వధర్మము. ప్రభుత్వము ధర్మనిష్ఠమైయున్నదన్న గాఢవిశ్వాసము ప్రజలలో రేకెత్తించలేనంతకాలము, ప్రజలనుండి ఈ సహకారము ప్రభుత్వమునకు లభించదు. ప్రభుత్వము ధర్మనిష్ఠమైయున్నదని నిరూపించుకొనుట, నిర్వాహకులగు ఉద్యోగుల దైనందినఆచరణము మూలముననే సాధ్యము. చట్టములో, ప్రభుత్వము, బ్లాక్‌మార్కెటును నిర్మూలించుట కిచ్చు శిక్షల తీవ్రతను వివరించినది కాని, నిర్మూలించుటకు ప్రభుత్వోద్యోగులు అనుసరించు కార్యక్రమ మేదో—ఏయే విషయములలో ప్రజల నెంతవరకు సహకరించమన్నదో, సహకారస్వరూప మెట్టిదో, ఆ సహకారమునకు, తాను యీయగల విలువ యెంతో, ప్రజ ఎవరైన ధర్మనిష్ఠతో, బ్లాక్‌మార్కెటు విషయములను ప్రభుత్వఉద్యోగులకు వివరించుకొనిన, స్వపరభేదములు లేక ఉద్యోగులు, ఆ బ్లాక్‌మార్కెటీర్లను పట్టి యీయవలసిన బాధ్యత ఎట్టిదో, పట్టి యీయకున్న ఉద్యోగులపై ప్రభుత్వము తీసికొను చర్య ఎట్టిదో, విద్వేషములతో పార్టీలవారు ఒకరిపై నొకరు చేసికొనగల పరస్పరమిథ్యారోపణలలో సత్యమును నిరూపించుటకు ప్రభుత్వము గైకొను చర్యలెట్టివో, మిథ్యారోపణలపై శిక్ష యెట్టిదో—ఇవి యేవియు నింతవరకు ప్రజకు ప్రభుత్వము సుబోధక మొనర్చలేదు.

బ్లాక్‌మార్కెటు శిక్ష నొందినవారు, లెటర్ హెడ్డులలో తమ శిక్షలను వివరించుకొనవలె నని చట్టము శాసించినది. వారికి లెటరుహెడ్డు లుండితీరవలె నని ఇంకను శాసించినట్లులేదు.

ఇట్టి చర్యవలన, నేరస్థుని సక్రమమార్గమున పెట్టుటకంటె, అవమానిత క్రోధముతో, దుర్మార్గమున కొడిగట్ట చేయుటకే త్రోవతీయును. ప్రభుత్వధర్మములో, నేరమునకు శిక్ష తప్ప, నేరస్థుని పట్ల ద్వేషముతో, అవమానించి, సాధింపబూనుటకు ఎంతమాత్రమును ఆస్కార ముండ వీలులేదు.

పత్రికలలో ప్రభుత్వచర్య లన్నిటికి విరివిగా ప్రచురణ మిచ్చితీరవలెననుటలో, ప్రభుత్వము, అవాంఛితముగ జరుగు విషయమును, అధికారధూర్వహత్వముగ మార్చి, ఒక విషయమునకై ప్రయత్నించబోయి, అనాలోచితముగ మరొక హక్కుకై పత్రికానిర్వాహకులతో స్పర్ధను పురిగొల్పినది. అనవసరముగ వారి కొక అస్వతంత్రస్థితిచ్ఛాయను కల్పించి, మరొక చిక్కు సమస్యను ప్రభుత్వము సృష్టించుకొనుట యగును. ఒకచో ముందు కోర్టులలో దోషిగా శిక్షనొందినవాడు నిర్దోషియని పై తీర్పులలో తేలి, ప్రభుత్వముపై నాతడు చర్యతీసికొనుటకేమాత్రము అవకాశము లున్నను, ప్రభుత్వాజ్ఞపై అట్టి ప్రకటనలు చేసిన పత్రికలుకూడ అతనికి మాననష్టపరిహారము లిచ్చుకొనవలసిన యవసర ముండునో లేదో కూడ, ప్రభుత్వ మాలోచించుకొనవలసియుండును.

శ్రీనాయుడుగారు

భారతీయ గానకళా ప్రపంచమున శ్రీ ద్వారం వెంకటస్వామినాయుడు గారి పేరు వినని వారుండరు. ఆంధ్రదేశమందలి సంగీతకళాభిమానులలో శ్రీ నాయుడుగారి వాద్యములు విని ఆనందింపనివారు అరుదు అని చెప్పవచ్చును. అతిమార్దవమైన గాత్రము కలిగి, మధురమైన గీతముల గానము చేసి ప్రజానీకమును రంజింపజేయుట సులభము. అట్టి గానమును ఆనందించుట కూడ శ్రోతలకు సులభము సంగీతశాస్త్ర పాండిత్యముతోగాని, రాగముల ఆరోహణావరోహణల పరిజ్ఞానముతోగాని నిమిత్తము లేకనే గాత్రసంగీతమును ఆనందింప సాధ్యము గావచ్చును.

వాద్యసంగీతముద్వారా ప్రజల రంజింపజేయుట, సామాన్య ప్రజలు అట్టి వాద్యమును ఆనందించుట, అంత సులభము గాదు. అందును "ప్రజాసాహిత్యము, ప్రజాసంగీతము," అను నినాదములు ప్రతిధ్వనించుచున్న ఈ యుగమున వాద్యసంగీతము ప్రజాదరణను, ప్రజల మన్ననలను పొందునట్లు చేయుటకు అసాధారణ ప్రతిభా విశేషములు కావలసియుండును. అట్టి ప్రతిభావిశేషము లున్నందుననే శ్రీ నాయుడుగారి ఫిడేలువాద్యము పండిత, పామరరంజకమైనది. కళకుగల విశిష్టత పండితులకు ఒక ప్రమాణములో, పామరులకు ఒక ప్రమాణములో వుండదని శ్రీ నాయుడుగారు ఋజువుచేసిరని చెప్పవచ్చును.

నాల్గు సంవత్సరముల క్రితము శ్రీ రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ గారు నాయుడుగారి కచేరిగురించి వ్రాయుచు "ఫిడేలు వంటి నిరాధారవాద్యమునందు నాయుడుగారు సాధించిన సిద్ధి మహాతపస్సుఫలిత" మని తెల్పిరి. యథార్థమే. కర్ణాటక సంగీతమునకు మూలపురుషులు ఆంధ్ర వాగ్గేయకారకులే అయినను కర్ణాటకసంగీత సరస్వతి ఆంధ్రులను వదలె నను విమర్శగలదు. అట్టి విమర్శ నిర్హేతుకమని చెప్పి నాయుడుగారు ఆంధ్రుల పూర్వపు ఔన్నత్యమును పునరుద్ధరించిరి. అంతియే కాక సంగీతముల ఎన్ని బాణీలు ఉన్నప్పటికిని సంగీతకళ ఒక్కటే నని, కర్ణాటక, ఔత్తరాహిక, పాశ్చాత్య రీతులలో వారు సాధన చేసి, సిద్ధి పొంది, ఋజువు చేసిరి. దాక్షిణాత్యులు, ఆంధ్రగానకళాభిజ్ఞులు అట్టి గానకళావిశారదుని సన్మానించి కృతార్థులైరి.

మనరాష్ట్రం: మనదేశం:

వేపపువ్వు, మామిడిపిందెలు, బెల్లం: ప్రధాని ఎన్నిక, ఆంధ్రరాష్ట్రం

ఉగాది:

ఈరోజున—అంటే మార్చి 30 బుధవారం నాడు తెలుగువారికే, మహారాష్ట్రులకే, కర్ణాట దేశస్థులకే ఉగాది. మనరాష్ట్రంలో ఇవాళ ఉదయాన్నే వేపపువ్వు, మామిడిపిందెలు, బెల్లం చింతపండురసం కలిపి పుచ్చుకుంటాం—సుఖ దుఃఖాలు, షడ్రసాలు సంవత్సరం పొడుగునా సమంగా అనుభవిస్తున్నట్లు. నూతనసంవత్సరం దేశానికి ప్రజలకి గ్రహనక్షత్రాలు ఏమి ప్రసాదిస్తాయో రాత్రి కూచుని పంచాంగశ్రవణం చేస్తాం. అన్నీ విని లేచి తువ్వాలు దులుపుకుని ఇంటికివెళ్లి నిద్రపోతాం.

ఉగాదికానుకగా విశాఖజిల్లాను విభజించి జిల్లా వాసులకోర్కె తీర్చవలసిందని శ్రీ తెన్నేటి విశ్వనాథంగారు మద్రాసుప్రభుత్వాన్ని అర్థించారు. సర్దార్ పటేల్, పండిట్ నెహ్రూగార్లు డా॥ పట్టాభిగారితో కమిటీగా సమావేశమై పట్టాభిగారికి ఏదో రీతిగా ఆంధ్రరాష్ట్రం బహూకరిస్తే ఆంధ్రదేశానికి ఉగాది పండుగ నిజంగా పండుగే అవుతుంది. ఈ ముగ్గురూ చేరిన కమిటీ ఇవాళే ఏదో ఒక నిర్ణయానికి వస్తుంది. ఈ నిర్ణయాన్ని కాంగ్రెస్ కార్యవర్గం ఏప్రిల్ 5 వ తేదీని ప్రథమవిషయంగా చర్చిస్తుంది. రెండు రోజుల్లో నిర్ణయం ప్రకటిత మవుతుంది. ఆలిండియా కాంగ్రెస్ కమిటీ ఆదోనిలో జరగదని ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ కార్యాలయానికి ఢిల్లీలోని అధినాయకులు వ్రాశారట.

ఫిడేలు నాయుడుగారు

ఫిడేలు నాయుడుగారని ప్రసిద్ధి చెందిన సంగీతకళానిధి, సంగీతరత్నాకర, వాయులీనాచార్య శ్రీ ద్వారం వెంకటస్వామినాయుడుగారిని చెన్నరాష్ట్రం శనివారంనాడు సన్మానించింది. నాగస్వరం పరిసరాలంతా ప్రతిధ్వనించగా రాజాజీపురమందిరంలో సన్మానం వైభవంగా జరిగింది. గవర్నరు భావనగర మహారాజాగారి రాజఠీవి సభావేదిక అలంకారానికి తోడయింది. న్యాయమూర్తులు, మంత్రులు, శాసనసభ్యులు పురప్రముఖులతో రాజాజీపుర మందిరం కిటకిట లాడిపోయింది. ఈనాటికి ఆంధ్రుల్లో ఒకరిని సన్మానించడానికి చెన్నపురి పౌరులు ఇంతమంది కదలివచ్చారని ఆంధ్రులు గర్వించారు. ఫిడేలు వాద్యం ద్వారంవారి కుటుంబవారసత్వం. గాంధర్వాంశ కలిగిన నాయుడుగారు ఫిడేలువాద్యంలో అపూర్వరసానుభూతి నివ్వగలరు. శృతిలో, ఆలాపనలో, రాగ సంచారంలో క్రొత్త రీతులు అనుసరించి ఫిడేలుకు క్రొత్తవాణిని, (అచ్చంగా తెనుగువాణి) వినిపించారు. నాయుడుగారి ఫిడేలు పలుకుతుంది. ముగ్ధవలె సున్నితంగా నాజూకుగా నృత్యం చేస్తుంది. వాద్య సంగీత తరంగాలలో శ్రోతలహృదయ చాలనం విలీనమైపోతుంది. నాయుడుగారు రససిద్ధులు. మహాతపస్సిద్ధులు. వీరి కిచ్చిన రు 35 వేలు ప్రజల ఆదరసూచనమాత్రమే కాని రససిద్ధుల్ని సన్మానించడం ఎవరితరం!

ప్రధాని ఎన్నిక

మళ్లీ చెన్నరాష్ట్ర కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నాయకుని ఎన్నిక, అంటే కాంగ్రెస్ శాసనసభ్యులచే రాష్ట్రప్రధాని ఎన్నిక, సాలుసంబరంలా ఇట్టే తిరిగివచ్చింది.

పార్లమెంటరీ విధానం అమలులో ఉన్న దేశాల్లో ఏ దేశంలోనూ ఈ వింత పద్ధతి ఇప్పుడు లేదు. బ్రిటన్‌లో సాలీనా పార్టీ సమావేశం [illegible]ర్గకార్యవిధానంపట్ల ఆమోదమో, నిరసనో తీర్మానాలద్వారా ప్రకటిస్తుందే గాని, ఎవరు ప్రధానిగా ఉండాలో నిర్ణయించడానికి సాలీనా శాసనసభ పార్టీ సమావేశం చెయ్యదు. పోనీ భారతదేశంలో పరిస్థితి గమనిస్తే ఇతర రాష్ట్రాల్లోకూడా మన పద్ధతే అమలులో ఉంది. కాని సాలీనా ప్రధానిని పదవినుంచి తొలగించే ప్రయత్నాలు జరగడంలేదు. ఈ నాటకం సింధు రాష్ట్రం సొమ్ము. మన రాష్ట్రం పుణికి పుచ్చుకుంది.

సాలుసాలుకి శాసనసభలో ఈ కల్లోలంవల్ల పరిపాలన సవ్యంగా కొనసాగడంలేదు. రేపు అధికారంలో ఉంటారో ఉండరో, శాసన సభ్యుల వైఖరి ఎలా ఉంటుందో అనే బెంగతోనే మంత్రులూ, ప్రధానీ కాలం గడపవలసివస్తోంది. దీనివల్ల మంత్రులు నిత్యం శాసనసభ్యుల ప్రాపుకోసం, శాసనసభ్యులు మంత్రుల ప్రాపకం కోసం పాటుపడుతున్నారు.

ఆయా నియోజకవర్గాల్లో ప్రజల అవసరాల్ని పరిస్థితుల్ని గురించి శాసనసభ్యులు ప్రభుత్వానికి నివేదించడానికి శాసనసభారంగం ఉంది. అది కాక సెంట్‌జార్జికోటలో మంత్రుల గదుల్లో ఇవి నివేదింపబడితే, ప్రజల కనుమరుగున చేస్తున్నట్లు అర్థం అవుతుంది. బాధ్యతాయుత పరిపాలన అంటే పరిపాలనాకార్యాలన్నిటికీ మంత్రులు బాధ్యత వహించాలి. మంత్రులు తమ బాధ్యతల నిర్వహణగురించి సంజాయిషీ చెప్పవలసింది శాసనసభకు, తద్వారా ప్రజలకు. వారు ప్రజాభిప్రాయాన్ని ప్రజల కష్టసుఖాల్ని అవసరాల్ని తెలుసుకోవలసింది శాసనసభద్వారానే. శాసనసభ్యులద్వారా కాదు. శాసనసభ్యులు ప్రజలపక్షాన వాదించేది శాసనసభల్లో కాని మంత్రుల గదుల్లో మంత్రాంగంలో కాదు. రెండోపక్షంలో వ్యవహారాలు జరుగుతున్నప్పుడు శాసనసభ్యులు సదుద్దేశంతో నడిపినా, దురుద్దేశంతో నడిపినా, వానిని మంత్రులు మన్నిస్తే పక్షపాతం అనిపించుకుంటుంది. మంత్రులు, శాసనసభ్యులు పక్షపాతబుద్ధితో వర్తించకపోయినా, బహిరంగంగా ప్రజలందరికీ తెలిసేవిధంగా నిర్వహించవలసిన కార్యాల్ని పరోక్షంగా నిర్వహిస్తున్నందువల్ల, వారెంత జాగ్రత్తవహించినా, ప్రజల స్థితిగతుల్ని సమగ్రంగా గ్రహించే అవకాశం ఉండదు. ఇది కాక పరోక్షంలో వ్యవహరించినందువల్ల పక్షపాతం లేకుండా వ్యవహరించడం ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెసువాదులైనప్పటికీ, ఏ కొద్దిమందికో తప్ప అందరికీ సాధ్యంకాదు.

పక్షపాతానికీ, బంధుమిత్రవాత్సల్యాలకీ పరోక్షవ్యవహారాల్లో అవకాశాలు అపారంగా చిక్కుతున్నందువల్లనే భారతదేశంలో అన్ని రాష్ట్రాలలోనూ రాష్ట్రప్రభుత్వాలపట్ల అసంతృప్తి, పదవులపట్ల వ్యామోహం ప్రబలంగా వ్యాపించాయి. అయితే 'అన్నిరాష్ట్రాలలోనూ మనరాష్ట్రం మాదిరిగా సాలుసాలుకీ మంత్రివర్గంలో భూకంపం పుట్టడం లేదు. దానికి కారణం మనరాష్ట్రంలో ఉన్నన్ని గ్రూప్‌లు, గ్రూప్‌రాజకీయాలు తూర్పు పంజాబ్ మినహా మిగతా రాష్ట్రాల్లో లేకపోవడమే.

ఏరాష్ట్రంలోనైనా గ్రూప్‌రాజకీయాలు వ్యక్తిగతమైనవే. అన్యరాష్ట్రాల్లో రెండుమూడు గ్రూప్‌లలో మంత్రివర్గపు గ్రూప్‌లు బలీయమైనవిగా ఉన్నందువల్ల అక్కడ మంత్రివర్గాలు మారలేదు.

మనరాష్ట్రంలో గ్రూప్ రాజకీయాలు వ్యక్తిగత విద్వేషాలపైనే గాక ప్రాంతీయభేదాలపైన కూడా ఆధారపడిఉన్నాయి. ఆంధ్ర తమిళ వర్గాలు ముఖ్యమైనవి. మళయాళ, కన్నడ వర్గాలు రెండేసి లేక మూడేసి గ్రూప్‌లుగా చీలిపోయి ఆంధ్ర, తమిళవర్గాలతో చేరాయి. తమిళ సభ్యుల్లో బ్రాహ్మణ బ్రాహ్మణేతర వర్గభేదాలుకూడా ఉన్నాయి. తెలుగువారిలో ఏ కొద్దిమందో తప్ప కులభేదాల్ని ఈ విషయంలో పాటించరు. కొందరు భావిస్తున్నట్లు గ్రూప్ రాజకీయాలకు మూలం కేవలం స్వార్థం, పదవీవ్యామోహం మాత్రమే నను కోవడం పొరపాటు.

పై వర్గాల్లో ఏఒక్కవర్గం బలీయంగా లేదు. ప్రతిఒక్కవర్గం ఇతర వర్గాలలో ఒకటి రెండింటిపైన ఆధారపడిఉంటుంది.

తెలుగువారిలో ఎవ్వరినీ ప్రధాని కానివ్వరాదనే నిశ్చయంలో తమిళులంతా ఏకమే. తెలుగువారిలో "ప్రధాని పదవి మా కివ్వకపోయినా పరవా లేదు. మా వర్గంవారిలో ఫలాని ఫలాని వారికి మంత్రిపదవులిస్తే చాలు, మీ వర్గంతో కలుస్తాం" అని ఎవరైతే అంటారో, అటువంటివారిని శ్రీ కామరాజనాడార్ ఆదరిస్తారు.

తెలుగు అరవ గ్రూప్‌లు ఎన్నిఉన్నాయో వెతికితే అవి చాలావరకు వ్యక్తిగతమైనవే నని తెలుస్తుంది. ఏ వ్యక్తికి పాతికమంది శాసనసభ్యుల అండ ఉంటే, ఆ వ్యక్తి, తనకి మంత్రిపదవి నిచ్చే అన్యవర్గాలతో చేరడానికి ఒప్పుకుంటాడు. ఈరీతిగా నాడార్‌గారితో చేరగల "మంత్రులు," వారి అనుయాయులు కలిసి ఆ సంవత్సరానికి ఒక గ్రూప్‌గా ఏర్పడుతుంది.

ఆ "మంత్రుల" అనుయాయుల సంఖ్య తరుచు మారుతూ ఉంటుంది. మంత్రులు కాలేకపోయినవారు మంత్రివర్గానికి ఎదురుతిరుగుతారు. సాలుసరి ఎన్నిక తేదీ రాబోతున్న దంటే ఆ మంత్రులు" తమ తమ బలగాలు పెంచుకోడానికి యత్నిస్తూ ఉంటారు.

[ఇక్కడ మంత్రు లంటే మంత్రులొక్కరే కాదు. మంత్రిపదవులు కావాలని కోరి బలగం పెంచుకోడానికి యత్నించేవారికి కూడా "మంత్రులు" అనే వాడబడింది.]

ఉన్న గ్రూప్‌లన్నిటిలోకీ శ్రీ కామరాజ నాడార్‌గారి గ్రూప్ పెద్దది. అందువల్ల వారి గ్రూప్‌తో మైత్రి, సహకారాలకు, ఎవరంగీకరిస్తారో వారికి మంత్రిపదవులు లభిస్తాయి. నాడార్‌గారికి కూడా తెలుగువారిలో ఏదో ఒక గ్రూప్ సహాయపడితే గాని వారు కోరినవారు ప్రధాని కాలేరు.

వీనివల్ల ప్రతిసంవత్సరం నాడార్‌గారితో సఖ్యానికి బలగం వెంట వేసుకుని వ్యక్తులు తాపత్రయపడుతున్నారని స్పష్టపడుతుంది. ఈ గ్రూప్‌లు ఏర్పరుచుకొని మంత్రిపదవులు కోరేవారికి స్వార్థం ఒక్కటే ఉందని చెప్పటానికి వీలులేదు. ఆయా ప్రాంతీయవిషయాల పట్లకూడా శ్రద్ధ ఉంది.

తమిళవర్గాలవారి దృష్టిలో ఆంధ్రరాష్ట్రం, చెన్నపట్నం, రామపాదసాగరం, విద్యుచ్ఛక్తి సరఫరా లుంటాయి. ఈ విషయాల్లో ఆశ్ పట్టించుకోనివారికీ, తమిళులో తగవులు పెట్టుకోనివారికీ నాడార్‌గారితో సఖ్యం కుదురుతుంది.

వీటినిబట్టి చూస్తే ఆంధ్రరాష్ట్ర సమస్య తమిళగ్రూప్ రాజకీయాల్లో ప్రధానమైనదనీ, చివరకు సంవత్సరం పొడుగునా పరిపాలనలో ఇదే ద్యోతకం అవుతున్న దనీ తెలుసుకోవచ్చును. ఆంధ్రదేశానికి అపకారం కలుగుతున్న దంటే ఇదే కారణ మనికూడా తెలుసుకోవచ్చును.

ఈ పరిస్థితుల్ని చక్కబరిచి దేశంలో స్వపరిపాలన సుపరిపాలనగా సార్థకం చేయాలంటే మూడు ముఖ్యావసరాలున్నాయి. 1. ఆంధ్రరాష్ట్రం ప్రత్యేకించబడాలి. 2. శాసన సభ్యులు మంత్రులమధ్య వ్యవహారాల పద్ధతి మారాలి. 3 సాలీనా పార్టీనాయకుని ఎన్నుకొనే పద్ధతిమానాలి. బాధ్యతాయుత పరిపాలన సార్థకం కావాలంటే, ఆరంభంలో సూచించినట్లు, దేశరక్షణ దేశహితానికి సంబంధించిన ఏ కొద్ది విషయాల్లోనో తప్ప, ఇతరవ్యవహారాల్లో మంత్రులు శాసనసభ్యులమధ్య నడిచే తతంగమంతా ప్రజాప్రాతినిధ్య పరిపాలనా విధానానికి (పార్లమెంటరీ గవర్నమెంట్) అనుగుణ్యంగా, ప్రజల కన్నుకప్పకుండా బహిరంగంగా జరగాలి.

ఆంధ్రరాష్ట్ర విభజన జరిగితే గాని సుస్థిరమైన మంత్రివర్గస్థాపనకు గ్రూప్‌రాజకీయాలు అవకాశ మివ్వవు.

శాసనసభ్యుల హక్కులు

ఈ సందర్భంలో మరొక విషయం చెప్పాలి. శ్రీమతి వల్లభనేని సీతామహాలక్ష్మమ్మగారిని ప్రధాని రామస్వామిరెడ్డిగారు మందలించినందుకు శాసనసభలో అన్ని వర్గాలవారూ అసంతృప్తి చెందినట్లు ఈవారం శాసనసభ్యుల ప్రశ్నలవల్ల స్పష్టమయింది. శాసనసభ్యులు కొందరు పరిపాలనా వ్యవహారాలలో ప్రభుత్వానికి సహాయపడుతున్నామని అపోహపడి జోక్యం చేసుకుంటున్నారు. దీన్ని ప్రభుత్వోద్యోగులు నిరసిస్తున్నారు. ఉదాహరణకి కృష్ణాపురంలో (కృష్ణాజిల్లా) ధాన్యసేకరణసందర్భంలో శ్రీమతి సీతామహాలక్ష్మమ్మగారు "అనవసరజోక్యం" కలుగచేసుకుంటున్నారని కృష్ణాకలెక్టరుగారు ప్రభుత్వానికి నివేదించారు. ధాన్యసేకరణవంటి వ్యవహారంలో సహాయపడుతుండగా కలెక్టరుగారు సహించడం లేదని శ్రీమతి సీతామహాలక్ష్మమ్మగారు అభిప్రాయపడ్డారు. ప్రధాని రామస్వామి రెడ్డిగారు ఉద్యోగులపక్షం అవలంబించి శాసనసభ్యురాలిని మందలించడం న్యాయం కాదల శాసనసభ్యులు అభిప్రాయపడ్డారు. ధాన్యసేకరణ విషయంలో ప్రభుత్వోద్యోగుల్తో పోటీచేసి పరపతికోసం శాసనసభ్యులు ప్రాకులాడుతున్నారని ప్రజ లనుకున్నారు.

శాసనసభ్యుల చర్యలు ప్రజల్లో ప్రభుత్వోద్యోగుల అధికారంపట్ల నిర్లక్ష్యం, అగౌరవం రేకెత్తిస్తున్నాయని ప్రభుత్వోద్యోగులు అనుకుంటున్నారంటే, అందులో నిజానిజాలు శాసనసభ్యులు ఆలోచించలేదు. కేవలం ప్రధాని పట్ల నిరసన తెలిపారు. శాసనసభ్యులు సదుద్దేశంతో వర్తించినప్పటికీ, హద్దులు తెలుసుకోకపోయినట్లయితే ప్రజల్లో అరాచకప్రవృత్తిని రెచ్చగొట్టినవారౌతారు. ప్రభుత్వోద్యోగులుకూడా శాసనసభ్యుల్తో వ్యవహారాల్లో హద్దులుమీరి సన్నిహితులై వర్తిస్తే ప్రజలకి లోకువ కావడమే కాక ప్రజల్లో పరిపాలకులపట్ల గౌరవం విశ్వాసం నశిస్తాయి. శాసనసభ్యుల్తో వ్యవహారాలు తగుమాత్రంగానే ఉండాలి. ఈ ప్రశ్నల సందర్భంలో శ్రీ గోపాలరెడ్డిగా రిచ్చిన సమాధానాలు కూడా, శాసనసభ్యులు తమ హద్దుల్ని వర్తించాలన్న విషయానికి ప్రాధాన్యమిచ్చినట్లు లేదు. సభ్యులలో అసంతృప్తిని ఏమాత్రం తగ్గించ గలిగినట్లు లేదు.

బ్లాక్‌మార్కెట్

దేశంలో బ్లాక్‌మార్కెటింగ్ (చాటుగా అక్రమంగా అధికధరలకి అమ్మే వ్యాపారం) అణిచివేయాలనే ఉద్దేశంతో మద్రాసుప్రభుత్వం ఒక శాసనం తలపెట్టింది. ఇదివరలో శాసనసభలో ఆహారశాఖామంత్రి డా॥ రాజన్‌గారే చెప్పినట్లు ఇది కరిచే కుక్కో, ఊరికే మొరిగే కుక్కో తెలియదు. ఫలాని వర్తకుడు అక్రమ వ్యాపారం చేస్తున్నాడని నిరూపిస్తే కఠినమైన శిక్షలు విధించడానికీ, నలుగురిలోనూ ఆ వర్తకుడిని కించపరచడానికీ ఈ శాసనంలో నియమాలు విధించబడినాయి. అయితే అక్రమ వ్యాపారం సాగిస్తున్నవారిని పట్టుకోవడం ఒక ఎత్తు, పట్టుకున్నవారిపైన నేరం నిరూపించడం మరొక ఎత్తు అసాధ్యమైనవి. ప్రజలు ప్రభుత్వానికి తోడ్పడాలనుకున్నా ఫలించని పరిస్థితులున్నాయి.

అడ్మిరల్ నిమిట్జ్:

కాశ్మీరంలో జనవాక్యనిర్ధారణకాండ నిర్వహించేటందుకుగాను అడ్మిరల్ చెస్టర్ నిమిట్జ్ నియమించబడ్డాడు. రెండు ప్రభుత్వాల మధ్య యుద్ధకారణమైన సమస్యను పరిష్కరించడం ఎంత కష్టమో పాలస్తీనాచరిత్ర తెలుపుతోంది. అక్కడ ఒక మధ్యవర్తి బలైనాడు. రెండోమధ్యవర్తికి కృతార్థవ్యవస్థ అవుతోంది.

(21-వ పేజీ చూడుడు)

అనపోతు

శ్రీ వి. డి. ప్రసాదరావు

[గంగమ్మ-అనపోతు తల్లి, వితంతువు. అనపోతు_20 ఏళ్ల మొద్దబ్బాయి.]

[అనపోతుగుఱ్ఱు వినపడుతుంది]

గం : ఒరేయ్, అనపోతూ, అబ్బాయ్, ఒరేయ్ నిద్ర లేవరా. బారెడు ప్రొద్దెక్కింది. ఇంకా ఏం నిద్రరా, ఒరేయ్. (తల్లి నిద్ర లేపుతుంది.)

అన (గుఱ్ఱు కొడుతూ) ఆ, హుూ హూ, ఊఁ, (అంటూ గుఱ్ఱుకొడుతూ అటూ ఇటూ దొర్లినట్లు మూల్గుతాడు)

గం : ఒరేయ్. లేవరా, ఒరేయ్. (కోడిపుంజు రెక్కలు తపతప లాడిస్తూ కొక్కొరోకో, కొక్కొక్కొ అంటూ, ఆవిడ కాళ్ల పడుతుంది. గంగమ్మ దాన్ని తప్పించుకొంటూ గంతులేస్తూ) ఛీ. ఛీ పాడుకోళ్లు. మైలకొంపచేస్తున్నావు కాదురా. నిద్రలోకూడా ఓటిని మంచంకోడికి కట్టుకేడవాలీ?

అటు వద్దామంటే ఆవైపు గుఱ్ఱుమంటూ ఆ పొట్టేలు, ఇటు పాడుకోడి దాపరించాయి. (కొక్కొరోకో అని గట్టిగా కోడి కూస్తుంది!)

అబ్బ పాడుకూత చెవులు గింగురెత్తేయ్; దీని మొహానికి యిప్పుడే తెల్లారినట్లుంది. దీని తాడు తెంచితేనే గాని పీడ విరగడౌదు. దీన్ని నే నెల్లా ముట్టుకుచచ్చేది. ఒరేయ్, ఓ బండకుంకా, లేవరా.

అన : ఆ. ఊఁ. (అంటూ ఆవలింతగా గొంణుగుతూనే) అబ్బో అబ్బో, అమ్మోవ్, ఈ రెక్క లాగకే. నెప్పెట్లో లాగుకుపోతోందే అమ్మా. (అని మళ్లీ పడుకొని గుఱ్ఱు కొట్టాడు.)

గం : నన్ను చంపుకుతినక లేవరా నాయనా.

అన ఉస్, అబ్బా, అమ్మా. (అంటూ గట్టిగా ఆవలిస్తూ - కాళ్లు చేతులు మెటికలు పటపటమని విరుచుకొంటూ లేచి కూర్చుంటాడు. కోడి మళ్లీ కొక్కొరోకో అంటుంది. గంగమ్మకాళ్లలోకి ఎగురుతుంది.)

గం : ఛీ. దీని దుంపతెగా, నా ఆచారమంతా నట్టేట కలిపి పారేస్తుందికదరా. ఈ తాడు విప్పి తోలేస్తాను, దీన్ని.

అన : (ఆదుర్దా) అమ్మోవ్, అమ్మోవ్, నా కోడిని వదలకేవ్. (కోడిపుంజును ఒళ్లోకి తీసుకొని) నా పుంజు కదే, నా కోడిపుంజు కదే, నా రత్నం పుంజు కదే. మా అమ్మే. మా బాబే. అమ్మమ్మ నిన్ను తిట్టిందిరా నాయనా?

గం : వెధవ సంతానంలాగే ఉంది. దానికి నేను అమ్మమ్మని అడివమ్మనీని. నీ వరసలు పాడుగాను. ముందు దానిని వదిలి లేచి మొహం ఏడవరా. అబ్బబ్బబ్బ. (కోడిపుంజు క్లక్క్లక్ క్లక్ అంటూంటుంది.)

అన: బువ్వ తినలేదురా నాన్నా. అమ్మోయ్, వీడికి ఒక తవుడుముద్ద తెచ్చిపెట్టవే.

గం : ఛీ. ఛీ. మడికట్టుకోపోతో ఇప్పుడీ మైలపనులన్నీ నన్ను పెట్టుకోమంటావురా? ముందు లే.

అన : (మారాం చేస్తూ ఊఁ. నేను లేవను నా పుంజుకు తౌడుముద్దలు పెట్టితేనేగాని నేను లేవను. ఊఁ. ఊఁ.

గం: ఎక్కడి చావొచ్చిందిరా! అల్లాగే తగలేసి స్నానం ఏడుస్తాలే. ముందు లే. పాచి అన్నా తెములకుండా ఇదెక్కడి సంత.

(అనపోతుస్నేహితులు నరసింహమూ, నారాయడూ, బాలిరెడ్డీ దూరంనుంచే కేకలేస్తారు.)

బాలి · ఒరేయ్ దున్నపోతూ, బొంగరాల పందెం కింకా రావేరా. ఒరేయ్ పెరికిపోతూ, పెరికి పోతూ, గొఱ్ఱెపొట్టేలు ఏమైందిరా?

గం : ఎవర్రా, నోరు సరిగ్గా తిరగదూ? పాడు పిలుపుల్లూ మీరూను. గడుగ్గాయలు. చదువూ లేదు, సంధ్యా లేదు. బొంగరాలూ, గొఱ్ఱెపొట్టేళ్లూ పెట్టుకు ఊరేగటానికి అప్పుడే తెల్లవారిందే, చద్దికూళ్లైనా ఏడవకుండా.

పిల్లలు · (ముగ్గురూ) ఓసి, గంగమ్మ లేచే ఉందిరోయ్. (అనుకొంటూ ఊహుహు అనుకొంటూ ముసిముసినవ్వు నవ్వుకొంటూంటారు.)

నారా : (నవ్వుతూ) అదికాదు గంగమ్మ బామ్మా అనపోతు ఇంకా లేవలే?

అన : ఒరే నారిగా, నా బొంగరం నిన్న ఎక్కడ పారేశావురా?

గం ముందు పాచిమొహం కడుక్కొని చద్ది కూడు ఏడవ్వోయ్. బొంగరాలూ, గంగరాలూనూ. ఒరేయ్ బాలిరెడ్డీ, నారిగా, మీరు కూళ్లు ఏడ్చారా?

బాలి. లేదు గంగంబామ్మా, నాకూడా ఇక్కడే వణ్ణం పెట్టవ్? జొన్నగాని, బామ్మా, అవకాయ పెరుగేసి నీ చేత్తో పెడ్తే తినాలని ఉంది.

నారా జొన్నాను. గంగం బామ్మోయ్, మాకూడా పెట్టవ్, పెట్టవ్? (అంటూ గంగమ్మచేతులు పట్టుకొని గంతులేస్తాడు.)

గం ఛా. ఏమిటా గంతులు అబ్బ చెయ్యి వదల్రా వెట్టానులే. మైల పడేస్తివి. ఇప్పుడెల్లా చచ్చేది.

నార (నవ్వుతో) నేను నీళ్లు తోడిపోత్తాను గాని, తానమాడుదుగాని, పదా.

గంగ · ఏడిశావ్. వెధవ... ... ఉద్ధరింప్రా నువ్వూను. ఒరేయ్ అనపోతూ, త్వరగా లేచి స్నానం ఏడు. ఉండండిరా, అందరికీ ఒకసారి కూడు పడేస్తానుండండి. ఎక్కడి సంతపోగయార్రా (అవతలకి పోతుంది).

నార. ఒరేయ్ పోతూ. మీ అమ్మ వచ్చే లోపలే త్వరగా బయల్దేర్రా. మళ్లీ వచ్చిందంటే చీపురుకట్ట పుచ్చుకొని అందర్నీ బజాయిస్తుంది.

అన : ఒరేయ్, పోదాం పదండి. మా అమ్మ వస్తే నన్ను మళ్లీ కదలనీయదు.

బాలి నాకు గంగమ్మ పెరుగన్నం పెడ్తే తినాలని ఉందిరా.

నర ఏడిశారు ముందు పదండోయ్. (గంగమ్మ తడిబట్టతో గోవిందనామాలు చదువుతో వస్తోంది.)

నారా : గంగమ్మోయ్, నీ కోపాట నేర్పుతా వింటావా?

పున్నమ వెన్నెల కాసెగా
పొన్నపై కోయిల కూసెగా.

గంగ · బాగుందిరా నీపాట కాస్త మా అనపోతుకుకూడా నేర్పమూ, వాడికీ కాస్త కవిత్వం వస్తుంది.

నారా · కాదు గంగమ్మోయ్. తర్వాతపాట విన్నావా?(అని చెయ్యి పట్టుకొని మొహంమీద మొహం బెట్టి)

అంగట్లో సగ్గిళ్లు పోసెగా
గంగమ్మ నీముండ మోసెగా

గంగ : ఆరి కుంకా! మళ్లీ మైల పడేశావేమిరా.

(ముగ్గురూ పకాపకా నవ్వుతారు. అనపోతు కూడా నవ్వుతాడు).

గంగ. (కోపంతో చేద క్రింద పడేసి) ఆరి మీ మొహం ఈడ్వా. ఉండండి, చీపురు తెస్తే గాని మీ రోగం కుదరదు.

బాలి: పిల్లీ వచ్చే దండాకోర్! పరుగెత్తండ్రా. నారిగా, పొట్టేలును లాక్కుపదా. నేను పుంజు తెస్తున్నా.

అన పరిగెత్తండ్రా పదండి.

నారి, నర · ఎక్కడి దొంగ లక్కడే గప్ చిప్! (పరుగెత్తుతూ పోతారు.)

గం. ఏడి ఒక్కడూ లేడే. ఒరేయ్, అనపోతూ, బాలిరెడ్డీ, (చీపురు క్రింద పడేసి) కొట్టనులే రండిరా. తిళ్లు తిని పొండిరా. ఒరేయ్ నారిగా, నాయనా రండిరా.

2

[సబ్బాయి, ఇంటి ముంగర నించుని అనపోతు.]

అన (దీర్ఘాలుగా కేకలేస్తూ) బాలచంద్ర మహారాజులుంగారూ. ఓ బాలచంద్రయ నాయుడుగారూ, ఒరేయ్ బాలుడూ.

(సబ్బాయి మేడమీద తలుపులు తెరచుకొంటూ పైనుండి కుతుకంతోనే కోపం నటిస్తూ—)

సబ్బాయి: ఉస్! ఏమిటా గొడవా? ఏమిటి అనపోతూ, సంసారు లింటికొచ్చి పొద్దున్నే ఈ గావు కేకలేంటి దున్నపోతులాగా. బాలుడేమిటి? ఇక్కడె బాలుడెవరూ లేరు బాలచంద్ర నాయుడుగా రిక్కడెందుకుంటారు? వాళ్లింటికి వెళ్లి, కేకలెయ్యి. పొద్దున్నే సంసారులింటి ముందు ఏమిటి కేకలు?

(తక్కిన ముగ్గురు స్నేహితులు విరగబడి నవ్వుతూ)

సంసారుల యిల్లటరోయ్. సబ్బాయి సంసారి అయిం దెటరోయ్. ఆహ్హహ్హా!

అన. ఒరేయ్. ఒరేయ్, అల్లరి చెయ్యకండ్రా. బాలుడు వింటే కోపమొస్తుంది. మంచి దానివిగాని సబ్బాయ్, బొంగరాల పందెముంది; బాల్నోసారి త్వరగా పంపెంము.

సబ్బా. ఆ ఆడే లేడు అక్కడే ఆడింకె, నేనూ చూన్నా.

అన ఓయ్ నాకు ఆశే రాదనుకొన్నావా? ఇదుగో చూడు. అరే, బొంగరంతాడు మర్చిపోయొచ్చాను.

బాలి. సబ్బాయ్, నీ పరికిణి బందు ఒకటి పారెయ్ బొంగరం జాలితాడుగాను.

సబ్బా (నవ్వుతూ) గూబలు వాయిస్తా బాలిగా. పరికిణీ బొందులతో ఆడుతావట్ట ఆట.

అన : ఛీ. ఛీ. పరికిణీ బొందు ఎందుకురా! ఇదుగో నా జందెం ఉందిగా. (పుటిక్కిన జందెం తెంపుతాడు.)

సబ్బా : (విరగబడి నవ్వుతూ) అయ్యో, అయ్యో! నీ బ్రాహ్మణ్యం కాలిపోనూ! అదేం పనయ్యా బ్రాహ్మడా? (నవ్వుతూంటుంది.)

అన : ఆ. నీవు గోక్కొనేందుకే గా. ఇప్పుడు దురదట్టం లేదులే. మా అమ్మ చీపురు తెస్తే పెట్టుంది. అన్నట్టు మా అమ్మ వస్తోందేమో రోయ్ త్వరగా పదండి. బాలుడూ!

బాలచంద్రుడు · (లోపల్నించి బయటికి వస్తూ) అనపోతూ, ఏమిటయ్యా గోల చేస్తున్నావ్?

సబ్బా : (నెమ్మదిగా బాలచంద్రుడితో) ఏమిటి అల్లా బైటికి వచ్చేశారు. నేను వాళ్లతో మీ రిక్కడ లేరంటూంటె. (గట్టిగా ఆశ్చర్యం నటిస్తూ) ఇదేమిటి. బాలచంద్రుడునాయుడుగారిల్లా ఎప్పుడొచ్చారు? చూడనే లేదే. ఎంత గొప్పవారైనా ఏమిటి ఇల్లా విరగబడటం.

బాలు: (నవ్వుతూ సబ్బాయిబుగ్గని చిటికేసి, నోరు మూస్తూ నెమ్మదిగా)ఓస్ ఏం పరవాలేదు లేవోయ్. అనపోతూ పైకి రండిరా.

సబ్బా : (గారాబంగా గునుస్తూ) ఊఁ. అల్లరి చాలు. ఇక్కడికూడా ఎందుకు వాళ్లు, పొద్దున్నే! పంపించేయండి వాళ్లందర్నీ—

అన · బాలుడూ, త్వరగా రావోయ్, పందెంవేళ మించిపోతోంది. సబ్బాయ్ నీకు పుణ్యం ఉంటుందిగాని త్వరగా బాలుణ్ణి పంపిద్దూ.

సబ్బా: బాగుంది సరసం? ఆయ నెవరో, మీ రెవరో నా కేం తెలుసూ. పొద్దున్నే తిలో దోవనూ వచ్చి ఇక్కడ అల్లరిమొదలెట్టారు. (నెమ్మదిగా) వెళ్లకండి, ఉండండి.

బాలు : (నెమ్మదిగా) మళ్లీ ఇప్పుడే వచ్చేస్తానోయ్. (గట్టిగా) వస్తూన్నా పదండ్రా, బతిమీద కల్లి ఆడుకొందాం.

సబ్బా:(చిఱుకోపంతో) ఇప్పుడెళ్లారంటే ఇంక మీ మొహం చూచేదిలేదు. (గిరుక్కున వెనక్కు మట్లెలు చప్పుడుచేస్తూ అంగ లేస్తుంది)

బాలు : (బెల్లింపుగా) ఇప్పుడే వచ్చేస్తాగాదోయ్. ఒరేయ్. బాలి క్రిందికి ఉరుకుతున్నా పట్టుకోండ్రా.

సబ్బా అయ్యో, అదేం అఘాయిత్యం.

అన : అమ్మో, ఉరక్కు, బాలుడోయ్, నామీదపడితే చస్తాను. (అని తప్పుకొంటాడు తక్కినవాళ్లు)

బాలు : కాయండి కాయండి. (దూకును)

ఓరి పెరికిపోతూ అనపోతూ! కాయలేవేం? (అని నవ్వుతూ బాలుడు దూకుతూంటే అందుకొంటారు)

అన. (సర్దుకొని నిల్చుని) అయ్, నేను పెరికి వెధవనట్రా, మొహం పగలగొట్టుకుంటె ధైర్యమూ, లేకపోతే పిరికితనమూనా?

తక్కిన : ఒరేయ్, పిరికిపోతూ వాగక.

అన : అల్లా అంటే నేను మీతో రానే రాను.

బాలు : కాదులే అనపోతూ, నీధైర్యం నాకు తెలుసుగా, దా పోదాం.

అన · అదీ మాట! పదండి. సబ్బాయ్, వెళ్లి వస్తాం.

బాలుడు. సబ్బాయ్. (గాలిలోకి ముద్దు వదుల్తాడు.)

3

(ఊరిబెలుపల స్త్రీల శిబిరం దిక్కు దాటి చిట్టడవి మొదట్లో, ఒక మఱ్ఱిచెట్టుదగ్గరగా, బాలచంద్రా, బాలచంద్రా అని కేక వేస్తూ అనపోతు ప్రవేశం.)

అన అరే. వచ్చేదాకా ఉంటానని కనిపించకుండా పోయాడే! బాలుడూ, బాలిరెడ్డీ, నారాయణా, అరెరె. ఒక్కళ్లూ లేరే. యుద్ధానికి నన్ను తీసికెళ్లకుండా వెళ్లిపోయారే? ఇదేమిటి ఈ చెట్టుమీద ఏదో రాశాడు! (చదువుతూ.)

'అన్నా, అనపోతూ - నిన్ను విడిచి వెళ్తున్నాం. ఈ తప్పు కాయి. నీకు కత్తులూ, కటారులూ అలవాటు లేదు. యుద్ధం ఎరగవు. మాతో వద్దామని ఉత్సాహం ఉన్నా, యుద్ధం చెయ్యలేవు. నువ్వు చెప్తే వినవని - అందుచేతనే మిమ పెట్టి నిన్ను వెనక్కి పంపించాను. మళ్లీ కలుసుకొందాం. ఈ మఱ్ఱిచెట్టు దాటి నువ్వు కదలి రావద్దు. నామీద ఆన. నమస్కారం.

బాలచంద్రుడు.'

(దిగులుగా) కింద మళ్లీ ఏదో రాశాడే?

నువ్వు పిరికిపందవి కావు. అందుకు వదలి వెళ్లటం లేదు. నీ సాహసం నాకు తెలుసు. నా మాట పాటించు. నామీద ఆన.

బాలచంద్రుడు.'

ప్పు! ఎన్నిమాట లంటే యేం? పిరికిపంద ననే వదలివెళ్లాడు. అందరూ ఎప్పుడూ పిరికిపంద ననే అనేవారు. నిజంగాకూడా పిరికిపందనే. ఇంతే. ఒక్కొక్కడి బ్రతుకు ఇంతే. తిండికీ తిరుగుడుకూ స్నేహితుణ్ణిగాని అవసరానికీ, యుద్ధానికీ స్నేహితుణ్ణి కాను. ఛీ వెధవ బ్రతుకు;! (నిట్టూరుస్తూ కూర్చుంటాడు.)

(మాడచి హడావిడిగా అడవిలోంచి ప్రవేశిస్తూ,) అనపోతూ, ఇక్కడ కూర్చున్నావేం? బాలుడెక్కడ? పని ఉంది. తొందరగా చెప్పు.

అన (ఏడుపుస్వరంతో) బాలుడు యుద్ధానికెళ్లాడు. వాళ్లంతా వెళ్లారు. పిరికిపంద నని నన్నిక్కడ వదిలి వెళ్లారు. నేను ఈ చెట్టు దాటి వెళ్లకూడదని ఆనకూడా పెట్టాడు.

మాడచి యుద్ధాని కెళ్లటం ఏమిటి? ఇందాక బొంగరా లాడ్తుండెనే. అయ్యయ్యో ఆడవాళ్ల రక్షకని బ్రహ్మనాయుడుగా రిక్కడ నిలిపితే, అది తెలుసుకోకుండా, యుద్ధం అంటూ ఎక్కడికి పరుగెత్తాడు? ఎప్పుడు వెళ్లాడు. నిజమేనా!

అన : నిజమే బొంగరా లాడుతుంటే, బొంగరం కోమటి ఆవిడ కాలుకు గుచ్చుకొని, ఆవిడ తిట్టింది—మగ బిడ్డలైతే యుద్ధం చెయ్యాలిగాని, ఇంటికాడ బొంగరాలాడుతూ గడుగ్గాయి తిరుగుళ్లా అని. నిజమే అని ఆవిడకు నమస్కారం పెట్టి, అందరం బయలుదేరాము. పిరికిపంద నని నన్ను వెనక్కి వెళ్లిపొమ్మన్నారు. నేను బయలుదేరుతే మాంచాలకు కబురు చెప్పమని వెనక్కి పంపించాడు. తీరా ఇక్కడికి వస్తే కదలి రావద్దని ఆన పెట్టాడు. మాడచీ, పిరికిపోతునై బతికాను. పిరికిపోతు ననే వెనక్కి తరిమారు. ఎందుకు బతుకూ? ఈ కత్తితో పొడుచుకొని చస్తాను.

మాడచి: ఆగు, ఆగు, అనపోతూ. యుద్ధానికి నువ్వెక్కడికో వెళ్లక్కర్లే. ఇక్కడే నీ దగ్గరకే వచ్చి పడుతూంది.

(22-వ పేజి చూడుడు)

చెన్నపట్నంలో తెలుగు బాలబాలికలకు విద్యాసౌకర్యాల లోపం గురించి వెంకటస్వామినాయుడు కమిటీ నివేదిక

[చెన్నపట్నం పాఠశాలల్లో తెలుగుతరగతుల్ని క్రమక్రమంగా తీసి వేస్తున్నారన్న విషయం అందరికీ తెలిసిందే. తెలుగువారు ఆందోళన చేయగా చేయగా, మంత్రి అవినాశలింగంగారు 1948 మార్చిలో శ్రీ కె. వెంకటస్వామి .నాయుడుగారి అధ్యక్షతక్రింద, శ్రీ గాడిచర్ల హరి సర్వోత్తమరావుగారు, శ్రీ పట్టాభిరామారావుగారు సభ్యులుగా ఒక విచారణసంఘాన్ని నియమించారు. తరువాత రెండు మాసాలకు మీనాక్షిసుందరం పిళ్లై అనువారిని ఈ సంఘానికి సమావేశకర్తగానూ, సభ్యులుగానూ నియమించారు. ఈ సంఘం తమ నివేదికను 1948 సెప్టెంబరు 16వ తేదీని ప్రభుత్వానికి అందచేసింది. ఈ నివేదికను మంత్రిగారు పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్ డైరెక్టరుగారికి పంపి పరిశీలించి వారి అభిప్రాయములను తెలుపవలెనని ఉత్తరు విచ్చారు. అ దెప్పుడా రీతిగా పంపారో, వా రింకా వారి అభిప్రాయాన్ని ఎందుకు తెలియపరచలేదో, ఇంత జాప్యానికి హేతు వేమో తెలియదు. బహుశా 1949 జూన్, జూలై మాసాల్లో పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పూర్తి అయ్యేవరకూ వారి అభిప్రాయం మంత్రిగారికి తెలపడంగాని, మంత్రిగారు నివేదికలోని సిఫార్సులను అమలుజరపడమో జరపకపోవడమో ఒక నిశ్చయానికి రావడంగాని సంభవించకపోవడం తథ్య మనిపిస్తున్నది. శ్రీ మీనాక్షి సుందరం పిళ్లెగారు కమిటీనివేదికతో అంగీకరించక భిన్నాభిప్రాయం ప్రకటించా రని కూడా తెల్లుస్తున్నది. ఈ సందర్భంలో శాసనసభలో ప్రశ్నల కాలంలో మంత్రిగారి సమాధానాలుకూడా గమనించదగినవై యున్నందువల్ల నివేదికలోని ముఖ్యవివరాలనూ, శాసనసభలో మంత్రిగారి సమాధానాలనూ ఇక్కడ ప్రచురిస్తున్నాము.]

ప్రస్తుత లోపాలు

ప్రస్తుత పరిస్థితి ఒక్కసారిగా ఈ రెండు మూడుసంవత్సరములలో మాత్రమే పెంపొందినది కాదు. నేటి యీ దుస్థితి పెంపొందుటకు అనేక కారణములు ఉన్నవి. ఉన్న స్థితిగతులు అర్థము చేయుటకు 1931, 1941 జనాభా లెక్కలను ఆధారము చేసుకొని ఈ దిగువ అంకెల నొసంగుచున్నాము.

చెన్నపట్టణపు జనాభాలో, ఆంధ్రుల జనాభా సగమువరకూ లేదని—కనీసము అరవవారి జనాభాతో సరిసమానముగా కలదని గుర్తింపవలెను.

సం॥రము	అరవలు	ఆంధ్రులు	మొత్తం జ॥
1931	4,11,823	1,24,649	6,46,586
1941	(వివరములు దొరకలేదు)		7,76,779

కనీసం 1931 లెక్కలనుబట్టి ఉన్న మొత్తం జనాభాలో తెలుగువారు నూటికి 20 చొప్పున కలరని తేలుచున్నది. కార్పొరేషన్ అంకెలను బట్టి నేటిమొత్తం జనాభా 9,13,087. అంటే—ఈ యేడు సంవత్సరాలనుంచి జరిగిన హెచ్చుతగ్గులు సరిచూడకపోయినా. ఇందులో, నూటికి 20 సర్రాసరిని, తెలుగు జనాభా 1,96,617 దాకా ఉండితీరాలి. ఈ జనాభాలో, నూటికి 14 చొ॥ బడికివెళ్లే పిల్లలు ఉంటారని అంచనావేస్తే ఈ సంఖ్య 27,526 దాకా తేలుతుంది. కాని 1946-47 లో, కచ్చితంగా చెన్నపట్నం బళ్లలో చదివిన పిల్లల సంఖ్య చూస్తే 6,914 మాత్రమే వుంది. మొత్తం విద్యార్థుల సంఖ్య 92,750 దాకా వుంది. 1947-48 94,912 మొత్తం సంఖ్యలో 7,682 మంది మాత్రమే తెలుగుబిడ్డ లున్నారు. అంటే మొత్తం విద్యార్థులలో 13 : 1 చొ॥ న వున్నారన్నమాట.

1946-47 లో బడికిపోవలసిన తెలుగుపిల్లలు 18,000 వుంటే బళ్ళలో 7,000 కనుపిస్తున్నారు. 1947-48 లో 19,000 లకూ 7,600 కనుపిస్తున్నారు. కార్పొరేషన్ అంకెలనుబట్టి చూస్తే ఉన్న బిడ్డలో 4 వంతుకూడా బళ్లలో లేరని తేలుతోంది. తక్కిన బిడ్డలందరూ, చదువు సంస్థలు లేక పాడౌతున్నారన్నమాట. లేదా ఇందులో కొంతమందిని బలవంతాన అరవతరగతుల్లోకి యీడుస్తున్నారన్నమాట.

సెకండరీ తరగతుల్లో స్థితిగతులు ఇంతకన్నా మరేమీ బాగులేవు. అసలు ఆడపిల్లల విద్యాసౌకర్యాలు మరీ అధ్వాన్నంగా ఉన్నయ్.

చదువుకుంటున్న తెలుగు బిడ్డల సంఖ్యనూ అరవబిడ్డల సంఖ్యనూ పోల్చి చూస్తే తెలుగుబిడ్డల సంఖ్య నామమాత్రంగా కనుపిస్తుంది

చెన్నపట్నంలో ఉన్న 43 పాఠశాలల్లోనూ, 17 పాఠశాలల్లో మాత్రం తెలుగులో విద్యాబోధ చేసే అవకాశా లున్నయ్. ఇందులో ఒకదాంట్లో తెలుగు రెండవభాషగా మాత్రం చెబుతున్నారు. 4 పాఠశాలల్లో శిశుతరగతులలో మాత్రం తెలుగున్నది. రెండింటిలో 1 వ ఫారములమధ్య తెలుగు చెబుతారు. తొమ్మిదింట్లో I ఫారంనుంచి VI ఫారంవరకూ చెబుతారు.

ఆడపిల్లల పాఠశాలలు 20 వుంటే, 11 పాఠశాలల్లో మాత్రం తెలుగున్నది ఆరవ ఫారం దాకా తెలుగులో బోధచేసే పాఠశాల ఇంతవరకూ ఒక్కటికూడా లేదు.

ప్రభుత్వమూ, విద్యాకేంద్రాలూ, తల్లి దండ్రులూ కూడా తెలుగుబిడ్డల విద్యావిషయం చాలా అధ్వాన్నమైన స్థితిలో వుంచారనటం కంటే, మరోటి చెప్పవలసిం దేమీ లేదు.

కొన్ని పాఠశాలల్లో కొన్ని తరగతులలో, ఒకే కాలమందు అరవ తెలుగు బిడ్డల కిరువురికి కలిసి అదో ద్వంద్వ భాషలో విద్య గరపుతున్నారు. ఇంతకంటే హాస్యాస్పదమై అధ్వాన్న స్థితి మరొకటి వుండదు.

చింతాద్రిపేట మొదలైన ప్రముఖ స్థానాల్లో మరీ ప్రాథమికదశలో మాత్రం ఈ ద్వంద్వభాషా తరగతులుండేవి. ఒంటి రెండు తరగతులు జరగగానే హఠాత్తుగా మితవ్యయం కారణంగా యీ తరగతులు ఎత్తివేయబడి అరవతరగతుల క్రింద మారిపోతై. ప్రస్తుతం చెన్నపట్నంలో తెలుగు బిడ్డల విద్యా విషయకమైన స్థితిగతులు ఈ రకంగా వున్నయ్.

సిఫార్సులు

కమిటీ యీ క్రిందరీతిగా తమ నివేదికలో సిఫార్సు చేసెను :

(1) రెండు భాషలలోను పాఠములను బోధించుటకేర్పడిన తరగతులను రద్దుచేయవలెను.

ఇప్పుడు మాతృభాషలోనే విద్యాబోధన జరగవలెనని రాష్ట్రీయప్రభుత్వమున్ను ఇండియా ప్రభుత్వమున్ను కోరుచు మాతృభాషకే ప్రాధాన్యము నొసంగినందువల్ల ఒకే తరగతిలో రెండు భాషలందును పాఠములను బోధించు పద్ధతిని రద్దు చేయవలెను. అట్టి తరగతిలోని విద్యార్థులను తమిళ సెక్షను తెలుగు సెక్షను అను రెండు భాగాలుగా విభజింపవలెను. తెలుగు సెక్షనులో వుండే విద్యార్థుల సంఖ్య ఎంత వుండినప్పటికీ ఎయిడెడ్ స్కూళ్లలోను గవర్నమెంటు స్కూళ్లలోను 3 సం॥ వరకు అట్టి తెలుగు సెక్షనులను ప్రత్యేకముగా ఉంచవలెను. యీ లోపుగా జనులు అవసరమైన సర్దుబాట్లు చేసికొనగలరు.

(2) తెలుగు పిల్లల నిమిత్తము ఎక్కువ సౌకర్యములను కలిగించుటకు యీ క్రింది చర్యలను అమలు జరుపవలెను.

గవర్నమెంటుగాని కార్పొరేషనుగాని నిర్వహించుచున్న ఎలిమెంటరి స్కూలులోనైనను లేదా హైస్కూలుకు అనుబంధితమైయున్న ప్రయిమరీ తరగతుల్లోగాని తెలుగు పిల్లలకై ప్రత్యేక సెక్షనులను ఏర్పాటు చేయవలెను. తెలుగువారు అత్యల్పసంఖ్యగా నివసించుచున్న ప్రాంతములలో తప్ప తదితర ప్రాంతములలో పై రీతిగా ప్రత్యేక సెక్షనులను ఏర్పాటు చేయవలెను. ఏ ప్రాంతములోనైనను నూటికి 10 మంది మాత్రమే తెలుగువారు ఉన్నయెడల ఆ ప్రాంతంలో తెనుగువారు "అత్యల్ప సంఖ్యాకు"లని భావింపవలెను, అట్టి ప్రాంతమందుగల పాఠశాలలలో ఏ పాఠశాలయందు తెనుగుపిల్లలకు తెలుగు తరగతులను ఏర్పాటు చేయవలెనో విద్యాశాఖవారు నిర్ణయించవచ్చును. తెలుగుపిల్లల సెక్షనులు ఏ పాఠశాలలో ఏర్పాటు చేయబడెనో ఆ విషయమును ప్రతి సంవత్సరము బాగా వెల్లడిచేయవలెను.

(బి) సైదాపేటలోని టీచర్సు కాలేజీలోని అన్నితరగతులకు అన్ని ఫారములకు తెలుగు పిల్లల సెక్షనులను ప్రత్యేకంగా ఏర్పాటుచేయవలెను. రాయపేటలోని వెస్లీహైస్కూలులో 3 సంవత్సరములబాటు పరీక్షార్థముగా తెలుగు సెక్షనులను ఏర్పాటుచేయవలెనని సదరు హైస్కూలు అధికారులను ప్రోత్సహించవలెను.

మద్రాసు నగరములోని సెకండరీ స్కూళ్ళ విషయములో కొన్ని ప్రాంతములందు తెలుగువారి అవసరమునకు తగినట్లుగా ఆయా సెకండరీ స్కూళ్ళలో తెలుగు సెక్షనులు ఏర్పాటు చేయబడియున్నవి. లేదా ఏర్పాటుచేయబడుచున్నవి సైదాపేటలోను రాయపేటలోను మాత్రమే యీ సౌకర్యము తెలుగువారికి లేదు. సైదాపేటలోని టీచర్ల కాలేజీకి అనుబంధముగా ఒక హైస్కూలు ఉన్నది. కాని అక్కడ తెలుగులో విద్య బోధించెడి తరగతులు లేకపోవుట ఆశాభంగకరముగానున్నది. కనుక గవర్నమెంటు ఇప్పుడైనను అచట తెలుగు సెక్షనులను వెంటనే ఏర్పాటుచేయవలెను. తెలుగు విద్యార్థులు ఎందరు ఆ సెక్షనులలో చేరినప్పటికి, ఆ సెక్షనులను ఏర్పాటు చేయుటకు ఎంత ఖర్చు అయినప్పటికి, ఆ విషయములను లెక్కింపక తెలుగు సెక్షనులను అక్కడ ఏర్పాటు చేయవలెను. మదరాసు నగర దక్షిణ పరిసర ప్రాంతములలోని తెలుగు పిల్లల కందరికిని యీ సైదాపేట హైస్కూలు అక్కరకు రాగలదు.

(సి) తెలుగులో విద్యబోధించెడి రెండు హైస్కూళ్ళను ఆడపిల్లలకొరకై ఒకటి పెరంబూరులోను, రెండవది మదరాసునగర ఉత్తర ప్రాంతములోను ఏర్పాటు చేయవలెను.

మద్రాసునగర ఉత్తరభాగములో తెలుగువారు అధికంగా నివసించుచున్నారు.

పెరంబూరులోకూడా అధికంగా ఉన్నారు. ఈ ప్రాంతములోని తెలుగుబాలికలకు హైస్కూళ్లు లేవు. పెరంబూరులో రావుబహదూర్ కలవల కన్నయ్యచెట్టి హైస్కూలులో ఒకప్పుడు ఆడపిల్లలను చేర్చుకొనుచుండిరి. కాని యిప్పుడు చేర్చుకొనుటలేదు.

బాలుర విషయములోకంటె బాలికల విషయములో పాఠశాలల దూరాభారము ఎక్కువ ముఖ్యముగా గమనింపవలసిన విషయము.

(డి) బాలికలకొరకైన సెకండరీ స్కూళ్ళలో గాని బాలురకొరకైన సెకండరీ స్కూళ్ళలో గాని ఇప్పుడు ఏర్పాటుచేయబడియున్న తెలుగు సెక్షనులు రద్దుచేయబడకుండునట్లుగాను క్రమేణ ఎక్కువ సెక్షనులు ఏర్పాటు చేయబడునట్లుగాను 3 సంవత్సరములవరకు చాలా శ్రద్ధగా మెలకువతో కనిపెట్టి చూచుచుండుట అవసరము.

(ఇ) పూర్తిగా తెలుగు పిల్లల కొరకైన పాఠశాలలు కానటువంటి పాఠశాలలన్నింటియందును తెలుగుభాషను రెండవ భాషగా (అనుబంధభాషగా) చదువుకొనుటకు అవకాశములను కల్పించుట అవసరము. ఎందువల్లననగా, అట్టి పాఠశాలలందు చాలామంది తెలుగు విద్యార్థులు తమిళభాషలోనే విద్య నభ్యసించుచున్నారు.

(3) మద్రాసులోని ట్రెయినింగు పాఠశాలలందు తెలుగు టీచర్లకు శిక్షణ యొసంగు నిమిత్తము ఏర్పాట్లు చేయవలెను.

పైరీతిగా మేము కొన్ని మార్పులు జరుగవలెనని సూచించియుండుటవల్లను మాతృభాషలోనే విద్యాబోధన జరుగవలెనని ప్రభుత్వము నిర్ణయించియుండుటవల్లను తెలుగు టీచర్ల ట్రెయినింగు అత్యంతావశ్యక మగుచున్నది.

(4) పాఠశాలలలోనికి చేరదలంచి దరఖాస్తులు పంపుకొన్నవారందరి దరఖాస్తులను చేర్చుకొనెడి రిజిస్టరు ఒకటి ఉంచవలెను. దరఖాస్తుదారు యొక్క మాతృభాష ఏదో ఆ రిజిస్టరులో నమోదు చేయవలెను.

(5) ప్రతిగవర్నమెంటు సెకండరీ స్కూలుకు అనుబంధముగా ప్రయిమరి తరగతులుగల పాఠశాల కూడా ఉండవలెను.

(6) ఏ ప్రాంతములోనైనను ఒక విద్యాశాలకు అనుబంధముగానున్నటువంటి క్రింది తరగతులను ఎత్తివేయుటకు ఆ పాఠశాలాధికారులు సంకల్పించినయెడల ఆ ప్రాంతములో తెలుగు విద్యార్థుల కక్కరకు వచ్చెడి చిన్నతరగతులుగల పాఠశాలలు తగినంతగా ఉన్నవని గవర్నమెంటుకు తృప్తికరముగా తోచినపిమ్మటనే అట్టి చిన్నతరగతులను ఎత్తివేయుటకు ఏ పాఠశాలాధికారులకైనను గవర్నమెంటు అనుమతి నీయవలెను.

(7) విద్యాశాఖవారి పంచవర్ష పరిపాలనా నివేదికను తయారుచేయునప్పుడు జిల్లావారీగా ఆయా భాషాభేదములను అనుసరించి విద్యార్థుల లెక్క వివరములను ప్రకటింపవలెను.

గవర్నమెంటువారి సాలుసరి రిపోర్టులందు భాషాప్రయుక్త వివరములు క్రోడీకరింపబడుచునే యున్నవి. కాని, యీ లెక్క వివరములు పంచవర్షనివేదికయందు ఇంగ్లీషు విషయములో తప్ప మిగిలిన భాషాభేదముల విషయములో ప్రకటింపబడుటలేదు. సాలుసరి లెక్కల రిపోర్టులు ఏటేట నాశనము చేయబడుచుండుటవల్ల భాషా విభేదము ననుసరించిన లెక్కవివరములు మాకు లభింపలేదు.

శాసనసభలో మంత్రిగారి సమాధానాలు

చెన్నపట్నం, మార్చి 17 : చిత్తూరులో 99 తెనుగు పాఠశాలలు ఎత్తివేయబడిన వనియూ, చెన్నపట్నంలో 2 ప్రాథమికపాఠశాలలు, ఒక సెకండరీపాఠశాలను, తీసివేసినా రనియు విద్యా మంత్రి అవినాశలింగంగారు 1946 ఏప్రెలు నుంచీ ద్విభాషామండలాలలో ఎత్తివేసిన పాఠశాలలగూర్చి అల్లూరి సత్యనారాయణరాజు [illegible] రడిగిన ప్రశ్నకు నేడు మద్రాసు అసెంబ్లీ [illegible] సమాధాన మిచ్చిరి. వెంకటస్వామినాయుడు [illegible] దిక సిఫార్సులు సభ్యుల కిదివరకె అంద [illegible] బడిన వనిరి.

సెకండరీ విద్య నూత్న విధానమునందు ద్విభాషాప్రాంతములందునూ బహుభాషా ప్రాంతములందునూ మాతృభాషకు ఇచ్చిన స్థానమేది అని అల్లూరి సత్యనారాయణ రాజుగారడిగిన ప్రశ్నకు సమాధానముగా విద్యామంత్రి

(16-వ పేజీ చూడుడు)

గానకళావిశారద

ద్వారం వెంకటస్వామి నాయుడుగారు

శ్రీ కోన వెంకట్రాయ శర్మ

శ్రీ నాయుడుగారు గౌరవోన్నతులు గల తెలగ కుటుంబంలో జనించారు. వారి పితృ పితామహులు, సైన్యంలో ఉన్న తాధికారాలు వహించారు. ఆయన 1893 లో బెంగుళూరు కంటోన్మెంటులో జన్మించారు. అప్పట్లో ఆయన తండ్రి, తాత లిద్దరూ, అక్కడవున్న సైనిక దళాలకు అధిపత్యం వహించి కంటోన్‌మెంట్‌లోనే ఆవాసంగా వున్నారు. తరువాత ద్వారం వారికుటుంబం కాశింకోటకు మారారు. తరువాత కొన్నాళ్ళకు ఆకుటుంబంలో కొంతమంది పౌర పరిపాలనా శాఖలో ఉద్యోగాలు స్వీకరించి విశాఖపట్టణంలో ఆవాసంగా నిలిచిపోయారు.

ద్వారంవారి కుటుంబానికి, సంగీతం దైనందినాహారంలో ఒకభాగం. ఆయన తండ్రి తాత లిద్దరూకూడా పెద్దవిద్వాంసులు; వాయులీనంలో మహత్తరమైన ప్రతిభ సంపాదించారు.

ప్రారంభ సాధన:— వెంకటస్వామి నాయుడుగారి అన్నగారు కృష్ణయ్య నాయుడుగారు. వీరు, పిఠాపురం ఆస్థానవిద్వాంసులు. వీణాచార్యులు శ్రీ తుమురాడ సంగమేశ్వర శాస్త్రిగారి వద్ద కొంతకాలము గురుకులవాసం చేసి సంగీత విద్యలో చక్కని శిక్షణ పొందారు. అందరికిమల్లేనే, వెంకటస్వామి నాయుడు గారినికూడ, బళ్ళోచదవేశారు. అక్షరాలు, అంకెలు ఆరాతకోతల నిరుత్సాహ విద్య ఆయనకు వచ్చిందికాదు. ఆయన అనురాగమంతా గానకళవేపే మొగ్గనారంభించింది. వారి యింట దైనం దినం జరుగుతుండే భజనపాళీలలో ఎక్కువ శ్రద్ధ చూపటం ప్రారంభించారు.

తన స్వంత ఊహతో, శృతి, లయలలో అనేక నూతన సౌందర్యాలు అన్వేషించి, వాటిని ప్రదర్శిస్తూ తక్కిన వారందరికి ఆశ్చర్యాన్ని కల్గించుతూ వుండే వారు. అన్నగారు కృష్ణయ్యనాయుడుగారు పిల్లవాణ్ణి తన చేతిక్రిందికి తీసుకుని, పిడేలు చేతికిచ్చి, దినదినం యెంతో జాగ్రత్తగా సాధన చేయిస్తూ వచ్చారు. తమ్ముడంటే కృష్ణయ్య నాయుడుగారికి ఎంతో అమితానురాగం.


ఆ బాల్య దశలోనే, సంగమేశ్వర శాస్త్రిగారు, తిరుకోడికావల్ కృష్ణయ్యర్ గోవిందస్వామిపిళ్ళె, కోనరాజపురం వైద్యనాథయ్యర్, అనంతరామ భాగవతార్, నందిగామ వెంకన్న పంతులు మొదలైన మహావిద్వాంసులను వినే మహాభాగ్యం నాయుడుగారికి లభించింది. సంగీత తృష్ణ;

గాంధర్వాంశంలో పుట్టిన మహాపురుషుడు కావటం చేత సంగీతకళ యందు తీరని తృష్ణగలవారు కావటం చేత అనతి కాలంలోనే, చకచకా పైకివచ్చి, ఆ బాల్యదేశలోనే అనుపైన సమర్థతి సంపాదించారు. అన్నగారి ద్వారా వైణిక శిఖామణి మైసూరు శేషన్నగారు మొదలైన సుప్రసిద్ధ విద్వాంసుల పరిచయ భాగ్యమూ, ఆశీస్సులూ కూడా నాయుడుగారు సంపాదించుకున్నారు.

దివాన్ బహదూర్ కొమ్మిరెడ్డి సూర్య నారాయణమూర్తి నాయుడుగారు, కాకినాడలో సరస్వతీ గానసభ తరఫున యేటేటా గానసభలు యేర్పాటు చేయించుతూ వుండటంచేత, ఆయా ఔత్తరాహ, దాక్షిణాత్య సంగీత విద్వాంసుల కచేరలను వినే అవకాశం నాయుడుగారికి లభించింది. విద్యాతృష్ణగల ఆయువకుని ఇదియెంతో సదవకాశమేననాలి.

ఆగాంధర్వకళకు తనజీవితాన్ని అంకితం చేసివెయ్యటానికి నాయుడు కృతనిశ్చయులయ్యారు. తదాదీ యెడనెడా చక్కటి కచేరీలు చేయటం ప్రారంభించారు. ప్రథమ సువర్ణపతక బహుమానం, కవులు-వేదాంతులు-విద్యాసాగర బిరుదాంకితులు, జయపూర్ మహారాజా, శ్రీరాజా విక్రమ దేవ వర్మగారివల్ల స్వీకరించారు.

1919 లో విజయనగరం మహారాజా వారు నాయుడుగారి వాయు వీనం విని ఎంతో సంతోషించారు. ఆకాలదినాళ్ళ క్రితమే తాము స్థాపించిన సంగీత కళాశాలలో వాయులీనశాఖకు ఆచార్యులుగా నియమించారు. తదాదీ ఆసంస్థలోనే పనిచేస్తూ, శ్రీ ఆదిభట్ల నారాయణ దాసుగారి, ఉద్యోగ విరమణానంతరం, ఆకళాశాలకు ప్రధానాచార్యులైనారు. ఆచార్యులుగానూ, ప్రధానాచార్యులు గానూ కూడా, గానకళాభిలాషగల ఎందరో ఆంధ్రయువకుల జీవితాలకు ఆయన వెలుగు చూపించి అభివృద్ధికి తెచ్చారు.



శ్రీ ద్వారం వెంకటస్వామినాయుడుగారి చిత్రపటం

చిత్రకారుడు: వైద్యనాథ్

1924 అక్టోబర్‌లో విజయ నగర మహారాజావారు నాయుడుగారికి 'గాంధర్వ విద్యాభూషణి, అనే బిరుదును ప్రసాదించారు. 929 మేలో జరిగిన ప్రథమాంధ్ర సంగీత పరిషత్ వారు 'గానకళావిశారద' అని బిరుదు నిచ్చారు. 1931 సంవత్సరం సెప్టెంబర్ 5 వ తేదీన, అప్పట్లో ఆంధ్ర విశ్వవిద్యాలయానికి వైస్ చాన్సెలర్‌గా వుంటున్న సర్. యస్. రాధాకృష్ణన్‌గారి అధ్వర్యాన విశాఖపట్నంలో పౌరసన్మానం జరిగింది. రు 800 ఖరీదు గల ఒక పిడేలు, రు 500 ఖరీదు గల ఒక రత్నాంగుళీయమూ బహూకరించారు. 1933 సెప్టెంబర్ 6 వ తేదీన, కాకినాడ సరస్వతీ గానసభాధ్యక్షులు దివాన్ బహదూర్ కొమ్మిరెడ్డి సూర్య నారాయణమూర్తి నాయుడుగారు 'స్వర్ణకంకణం' బహూకరించారు.

1935 సం॥ అక్టోబర్ 9 వ తేదీన జయపూర్ సంస్థానాధిపతి శ్రీ విక్రమదేవవర్మగారు మరొక స్వర్ణకంకణం బహూకరించారు.

దక్షిణాది గ్విజయ యాత్ర:—

ఆయన గానకళారంగమున అడుగుపెట్టి 1927 వ సంవత్సరమున మహావిజయమును సాధించి, సంగీత కళలోని మహా విద్వాంసులలో స్థానము సంపాదించు కొన్నారు. నాడు, జాతీయ వార సందర్భమున, మద్రాసులో యేర్పాటు చేయబడిన అఖిలభారత సంగీతసమావేశమునందు శ్రీ నాయుడు ప్రదర్శించిన కళా వైభవంతో సదస్యులు విస్తుపోయారు. ఆనాటినుంచీ సుప్రసిద్ధ విద్వాంసు లందరికీ చేరిలకు సహాకార వాద్య విన్యాసానికి ఆహ్వానాలు రావటం మొదలైంది. నాటినుంచీ, మైలాపూర్ గానసభ, పార్థసారథిసభ, ట్రిప్లికేన్‌సభ, రసికరంజనీసభ మొదలైన అనేక ప్రాంతాలలో ఆయన 'సోలో' కచేరీలుచేశారు. సంగీతరత్నాకర అరైకుడి రామానుజఅయ్యంగార్, చెంబై వైద్యనాథఅయ్యర్, కంజీవరం సుబ్రహ్మణ్యపిళ్లె ఫ్లూట్ సంజీవరావు, ముసిరి సుబ్రహ్మణ్య అయ్యర్, గాయక సార్వభౌమ పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగారు—ఇత్యాది దక్షిణ భారత మహావిద్వాంసు లందరికీ సహాకారవాద్యం నెరపి సెబా సనిపించుకున్నారు. దక్షిణామూర్తిపిళ్లే, అలగనంబిపిళ్లే మొదలైన ప్రసిద్ధ మార్దంగిక శిఖామణులంతా, నాయుడుగారికి ప్రక్కవాయిద్యం వాయించినవారే.

కీ॥ శే॥ లు తిరుచునాపల్లి గోవిందస్వామి పిళ్లెగారంటే నాయుడుగారికి ఎంతోగౌరవం. వారికికూడా నాయుడు గారంటే ఎంతో మెచ్చుకోలు. అన్నామలై విశ్వవిద్యాలయం ప్రారంభమైనప్పుడు ఆసంస్థకుసంగీతాచార్యులుకావలసివస్తే, సర్వవిధాలా ఆ స్థానాన్ని ఆక్రమించటానికిస మర్థులు శ్రీ నాయుడు గారొక్కరేనని గోవిందస్వామి పిళ్లెగారు సిఫారసు చేశారు. 1929 లో, మంచివేతనంమీద నాయుడుగార్ని ఆహోదాలో నియమిస్తూ, విశ్వవిద్యాలయంవారు ఆహ్వానము పంపించారు. ఎంతో పురోభివృద్ధిని కూడా వాగ్దానం చేశారు. కాని విజయనగరంరాజావారిపట్ల నాయుడుగారికున్న రాజభక్తి, వారి ఆశ్రయంలో ఇంత కాలం సుఖంగావుండి, పైకి రాగలిగామనే విశ్వాసం కారణంగానూ, ఇంకా ఇతర గృహచ్ఛిద్రాలవల్లనూ, ఆ ఉద్యోగాన్ని స్వీకరించారు కారు.

నాయుడుగారు 1939 జనవరి 26 వ తేదీన, తిరువాన్కూర్ కచేరిలలో పాల్గొన్నారు. అదే సంవత్సరం మార్చి 21 తేదీన గ్రామఫోను కంపెనీవారు రికార్డు తీసుకున్నారు. అదే మార్చి 7, 13 తేదీలల్లో మైసూరు సంస్థానంలో 'సోలో' కచేరీలు జరిగినై. 1941 డిశంబర్ 28 వ తేదీన మద్రాసులో జరిగిన 'ఆంధ్ర సంగీత పరిషత్' సభలకు ఆయన అధ్యక్షత వహించారు. ఆలిండియారేడియో ప్రారంభమైన తదాదీ, ఎడనెడా, యేర్పాటు చేయబడు తున్న ఆయన వాద్యప్రసారాలు లక్షలాది శ్రోతలను తన్మయులను చేస్తున్నయ్.

కన్నడ, జేహాగ్, మాల్‌కోష్ మొదలైన రాగాల్లో హిందూస్థానీ బాణీలోని తిలానాలూ, ఠుమ్రీలు, గజల్, టపాలూ మొదలైన స్వరకల్పనలు, పాశ్చాత్య సంప్రదాయం తాలూకు మెన్‌డెల్‌షన్, బాక్, రోజినీ మొదలైన ప్రసిద్ధ కల్పనాచార్యుల బాణీలు, నాయుడుగారు వాయించటం వింటే యేవిధమైన సంగీత సాంప్రదాయాన్నైనా ఆయన కర్ణాట బాణీలోకి ఎంత ప్రతిభావంతంగా బదిగించుకో గలుగుతారో ద్యోతమాన మౌతుంది.

వాస్తవంగా, మనరాష్ట్రంలో వున్న మహా విద్వాంసులలో నాయుడుగారు ప్రథమ శ్రేణిలో ఒకరు. వీరి అఖిలభారత కీర్తి కూడాఅనుదిన ప్రవర్ధమానమౌతున్నది. శ్రీ నాయుడుగారి భవిష్యత్తు, కడచిన దినాలకంటే పదింతలు సుహో జ్వలంగా వుండే శుభ చిహ్నాలు కనుపించుతున్నయ్.

సన్మానము

సంగీతరత్నాకర, సంగీతకళానిధి, శ్రీ ద్వారం వెంకటస్వామి నాయుడుగారికి మద్రాసు ప్రముఖులు, మార్చి 26 వ తారీఖు సాయంత్రం మద్రాసు రాజాజీ హాలులో సన్మానసభ జరిపిరి. మద్రాసు గవర్నరు భావనగర రాజాగారు సభకు అధ్యక్షత వహించిరి. సభలో సన్మాన సంఘం తరఫున మద్రాసు గవర్నరుగారు, నాయుడుగారి, గాన విశారదత్వమును అభినందిస్తూ, ఒక రజతపేటికను 35,000, రూపాయలకు చెక్కును నాయుడు గారికి బహూకరించిరి. మంత్రులు, ఉద్యోగులు, గాన కళా వేత్తలు మొదలగువా రనేకులతో సభ క్రిక్కిరిసిపోయినది.

నేటిప్రపంచం :

అట్లాంటిక్ ఒడంబడిక గురించి బహువిధాభిప్రాయాలు

యుద్ధ ప్రకటనకు నాంది :

బ్రిటిష్, అమెరికన్ పాలకవర్గాల దురాక్రమణ విధానానికి అట్లాంటిక్ ఒడంబడిక పరికరమని మాస్కో రేడియో విమర్శించింది. యుద్ధనీతిపరులకీ, యుద్ధాన్ని ప్రతిఘటించే ప్రజాకోటికీ మధ్యగల అభిప్రాయభేదాల్ని పరమ శత్రుత్వంగా మారుస్తున్నదని చెప్పింది.

యుద్ధనీతిపరులు యుద్ధప్రకటన చేయడానికి అట్లాంటిక్ ఒడంబడిక నాంది అని మాస్కో రేడియో వ్యాఖ్యాత డా॥ లెమిన్ అన్నాడు. ఇటలీలో ఈ ఒడంబడికలో చేరకూడదని కమ్యూనిస్టులు చేసిన ఆందోళనను తార్కాణంగా చూపుతూ, ప్రపంచంలో శాంతికాములైన ప్రజాకోటి ఇప్పుడే యుద్ధనీతిపరుల్ని ప్రతిఘటిస్తున్నదన్నాడు.

టాస్ అనే రష్యన్ వార్తాసంస్థ, రష్యన్ పత్రికలు, తూర్పు యూరోపియన్ పత్రికలు ఈ ఒడంబడికకు అప్రధానమైన స్థానాన్ని ఇచ్చాయి. ప్రాంతీయ రాజ్యకూటాల సమిష్టి చర్యలు ఐక్యరాజ్యసమితి ఆదర్శాల కనుగుణ్యమైనవే అయినప్పటికీ, అట్లాంటిక్ ఒడంబడిక మిలిటరీ ఒడంబడిక అయినందువలన ఆ ఆదర్శాలకు విరుద్ధమైనదని టాస్ వార్తాసంస్థ వ్యాఖ్యానించింది. అమెరికన్ బ్రిటిష్ దురాక్రమణపరులు పశ్చిమ యూరప్ ప్రాంత దేశాలను రణరంగాలుగా నిర్మించి యుద్ధం జరపాలనే ఉద్దేశంలో ఈ ఒడంబడిక తెచ్చిపెట్టారని చెప్పింది.

సమితిని బలపరుస్తుంది :

ఐక్యరాజ్యసమితిని అట్లాంటిక్ ఒడంబడిక బలపరుస్తుందని అమెరికా అధ్యక్షుడు ట్రూమన్ అన్నాడు.

ఒడంబడిక ఫలితంగా ఆయాదేశాలు దేశరక్షణ శాఖలనిమిత్తం ఖర్చులు బాగా పెంచి వెయ్యవలసి వస్తుందని ఫ్రెంచి విదేశాంగ మంత్రి షూమన్ అన్నాడు. ఆయుధాలు వగైరా అమెరికాయే ఈ దేశాలకు సప్లై చేస్తుంది.

కొత్తగా అరువుకాలు పద్ధతిపైన పశ్చిమ యూరప్‌కు అమెరికా మిలిటరీ అవసరాలను తీరుస్తుందని వాషింగ్టన్‌లో అనుకుంటున్నారు. ఈ విషయమై త్వరలో వాషింగ్టన్‌నుంచి ఒక ప్రకటన రావచ్చును.

బ్రిటిష్ విదేశాంగ మంత్రి బెవిన్ ఇది కేవలం దేశరక్షణకు సంబంధించినదే నన్నాడు. దురాక్రమణ వాంఛలేని ఏదేశమూ ఈ ఒడంబడికను చూసి భీతిచెందవలసిన పనిలేదన్నాడు.

శాంతి సాధనకు ఉత్తమ సాధనం

"ఇది చరిత్రాత్మకమైన ఘట్టం. ప్రథమ ప్రపంచ సంగ్రామానంతరం ప్రపంచంలో శాంతిని సాధించడానికి ఇంత ఘనమైన కార్యం ఇంతవరకూ ఎవరూ చెయ్యలేదు" అన్నాడు బెవిన్. ఈ ఒడంబడికతో వివిధదేశాల చరిత్రలో సహకార స్నేహాల అధ్యాయం ప్రారంభమౌతుందన్నాడు. అట్లాంటిక్ మహాసాగర తీరదేశాల్లో ప్రజలను యుద్ధభీతినుంచి కాపాడి, శాంతి భద్రత అభ్యుదయాల సాధించాలని యత్నించేవారందరికీ ఈ ఒడంబడిక నీడనిస్తుందన్నాడు.

"ప్రజల్లోనూ, ప్రభుత్వాలలోనూ విశ్వాసం తిపుగొల్పి భీతినిపోగొట్టి, ఆర్థిక పునర్నిర్మాణానికి అవకాశం ఇస్తుంది.

"అయితే ఈ ఒడంబడికకు సంబంధించని దేశాలపట్ల బ్రిటన్‌గాని తదితర దేశాలుగాని తమ బాధ్యతలను విడిచి కేవలం అట్లాంటిక్ ప్రాంత రక్షణకే లక్ష్యంచేస్తారని ఎవరూ భావించకూడదు. ఈ సందర్భంలో ఇతరదేశాలపట్ల బాధ్యతలంటే కామన్వెల్తు దేశాలపట్లనూ ఐక్యరాజ్య సమితి ఆదేశాలపట్లనూ బ్రసెల్స్‌పాక్ట్ పట్లనూ, బ్రిటన్ బాధ్యత అని బెవిన్ వివరించాడు. ఈ ఒడంబడిక ప్రపంచానికంతకీ వర్తించకపోయినా, గ్రీస్‌నుంచి పర్షియావరకూ గల దేశాలకన్నింటికీ బ్రిటన్‌కు ప్రధానమైనవే నన్నాడు.

సమిష్టి రక్షణభావాన్ని బహుదేశవ్యాప్తంగా ఆచరణలో పెట్టడమే ఈ ఒడంబడిక ప్రధాన లక్ష్యం. క్రమంగా ఇది ప్రపంచవ్యాప్తం కాగలదని బెవిన్ సదాశయాన్ని ప్రకటించాడు.

అమెరికా సహాయంలేకుండా పశ్చిమ యూరప్ దేశాలు దురాక్రమణనుంచి రక్షించుకోలేవనీ, యూరప్‌పట్ల ఇప్పుడు అమెరికా ఇంత శ్రద్ధవహించడం అమెరికా చరిత్రలో ప్రధానమైన ఘట్టమనీ బెల్జియం ప్రధాని పాల్ హెన్రీ స్పాక్ అన్నాడు.

ఫ్రాన్స్ దేశానికి ఎన్నడూ దురాక్రమణోద్దేశం లేదనీ ఇట్టి ప్రచారం అన్యాయమనీ చెప్తూ 1939 లో బ్రిటన్ ఫ్రాన్స్‌దేశాలు సర్వంగా సమిష్టి దేశరక్షణ కార్యక్రమం నిర్వహించి ఉన్నట్లయితే, అమెరికా దీనికి సహాయపడితే రెండో ప్రపంచ యుద్ధమే రాకపోయేదని ఫ్రెంచి దేశరక్షణ శాఖామంత్రి పాల్ రమాందీర్ అన్నాడు.

స్వీడన్ ఏకాకిగా రష్యా పంచనుండిపోయిందని స్టాక్‌హోమ్ రేడియో విలపించింది.

ఇటలీలో ముష్టియుద్ధాలు

ఇటలీ పార్లమెంట్ అట్లాంటిక్ ఒడంబడికలో చేరడానికి ఆమోదించింది. పార్లమెంట్‌లో చర్చ సందర్భంలో శాసనసభ్యులు ముష్టియుద్ధం చేశారు. డస్కులు విరక్కొట్టారు. కుర్చీల్తో కొట్టుకున్నారు. శాసనసభా మందిరంలో కమ్యూనిస్టుసభ్యులు, కమ్యూనిస్టు వ్యతిరేక పక్షసభ్యులు స్వేచ్ఛగా తన్నుకున్నారు. చివరికి ఒడంబడికలో చేరడానికి అనుకూలంగా 342 మంది ప్రతికూలంగా 170 మంది వోటు చేశారని స్పీకర్ ప్రకటన. లొత్తులుపడిన కళ్ళతోనూ, నెత్తుటిముక్కులు, గాయపడిన పెదవులతోనూ చేతులకి మెడలకి కట్లుకట్టించుకొని వెళ్ళిపోయారు. శాసనసభ మందిరం బయట పోలీసులు నిలిచిఉన్నారు.

జర్మనీ బలైపోతుంది

రష్యా అమెరికా వివాదాల్లో అట్లాంటిక్ ఒడంబడికక్తు జర్మనీ బలైపోతుందని జర్మనీ కమ్యూనిస్టుపార్టీవారి న్యూడాష్‌లండ్ అనే పత్రిక వ్రాసింది.

బ్రిటిష్ కమ్యూనిస్టు నాయకుడు హారీపాలిట్ ఈ ఒడంబడిక" యూరప్ ప్రజానీకంపై యుద్ధప్రకటనే" అన్నాడు. అమెరికన్ ప్రాబల్య విస్తరణ వాంఛాపరులు తమ పన్నాగాలకి బ్రిటనునుకూడా బంధించివేశారన్నాడు. మరొక ప్రపంచయుద్ధమే 'సంభవిస్తే, ఏటంబాంబులు విసరడానికి మెట్టుగా బ్రిటన్‌ను అమెరికన్లు ఉపయోగించగలరు. అందువల్ల ఆ 'యుద్ధంలో ముందుగా బలిఅయ్యేది బ్రిటిష్ ప్రజలే నన్నాడు.

బెర్లిన్‌లో రష్యన్ పాలకుల ఆధ్వర్యంక్రింద నున్న జర్మన్ పీపుల్స్ కౌన్సిల్ జర్మన్ ప్రజలందరూ ఈ ఒడంబడికపై యుద్ధం ప్రకటించకపోతే జర్మనీ దేశానికే ముప్పువస్తుందని చెప్తూ ఒక తీర్మానంచేశారు.

పశ్చిమ ఆస్ట్రియా, పశ్చిమ జర్మనీలలో ప్రత్యేక రక్షణ ఏర్పాట్లు చేస్తున్నందువల్ల లండన్‌లోని ఆస్ట్రియా సంధిసమావేశం భగ్నమవుతుందని వియన్నా కమ్యూనిస్టు పత్రిక వ్రాసింది.

గ్రీస్‌నుగురించి బెవిన్ అభిభాషలు చెప్పిన మాటలవల్ల గ్రీక్ ప్రభుత్వ ప్రతినిధి ఒకడు ఆహ్లాదం ప్రకటించాడు.

టర్కీలో ఆశాభంగం

బెవిన్ అభిసనీలు టర్కీనిగురించి చెప్పిన మాటలపట్ల టర్కీ ప్రభుత్వ వర్గాలవారు కృతజ్ఞత ప్రకటించినప్పటికీ, ఆశాభంగం కలిగినట్లు కనపడిందని టైమ్స్‌పత్రిక విలేఖరి వ్రాశాడు. ఫ్రెంచి ఉత్తరాఫ్రికాను చేర్చగా గ్రీస్, టర్కీలను అట్లాంటిక్ ఒడంబడికలో చేర్చుకోడానికి వీలుపడలేదా అని కొందరువిమర్శిస్తున్నారు. ఇటలీ భద్రతకు టర్కీ గ్రీక్ దేశాల్ని ఆంగ్లో అమెరికన్ వర్గం భద్రపరచవలసి ఉందంటున్నారు.

స్పెయిన్ దేశాన్ని అట్లాంటిక్ ఒడంబడికలోకి ఆహ్వానించకపోయినా వ్యాఖ్యానం పరిమితంగానూ ఉదారంగానూ ఉంది అయితే స్పెయిన్ పట్ల బ్రిటన్ విరోధభావాల్ని వారు విమర్శించారు.

అమెరికాలో ఒడంబడికపట్ల ప్రజలందరూ సుముఖంగానే ఉన్నారని, స్టేట్స్‌మన్ పత్రిక వాషింగ్టన్ విలేఖరి, రాస్కో డ్రమండ్ వ్రాశాడు.

ఇంతవరకూ మూరు సంవత్సరాలుగా అమెరికా మన్రో విధానం ప్రకారం అమెరికా ఖండదేశాల రక్షణపట్ల మాత్రమే శ్రద్ధ వహించింది. ఇప్పుడు ప్రపంచ సంగ్రామాలకు కారకులైన యూరప్‌వాసులపట్ల శ్రద్ధ వహించడం అమెరికా విదేశాంగనీతిలో పెద్దపరివర్తనమని చెప్పవచ్చును. ప్రథమ ప్రపంచ సంగ్రామానంతరం యూరప్‌లో యుద్ధం రాకుండా కాపాడ్డానికి ఆ దేశాలకు సహాయపడాలని యూరప్ అమెరికాను కోరింది. ఇప్పుడు అమెరికాయే ఆ దేశాల నాహ్వానించింది. ప్రపంచంలో శాంతి యూరప్‌పైనే ఆధారపడి ఉంటుందని అమెరికా భావిస్తున్నట్లు రాస్కో డ్రమండ్ వ్రాశాడు. కాని పండిట్ నెహ్రూ ఇటీవల భారత ప్రభుత్వ విదేశాంగనీతిని వివరిస్తూ, ఐక్యరాజ్యసమితిలో ఇట్టి వైఖరి సమర్థనీయం కాదన్నాడు :

ప్రపంచంలో శాంతి సుస్థిరంగా ఉండాలంటే యూరప్ ఒక్కటే ప్రధానం కాదు. ఆసియా సమస్యలుకూడా పరిష్కారం కావాలి అన్నాడు. ఆఫ్రికాలోనూ, అమెరికాలోనూ అనుసరించబడుతున్న జాతిద్వేషాలు సమసిపోవాలి. పాకిస్తాన్, మధ్యప్రాచ్యదేశాల్లో మతద్వేషంకూడా నశించనిదే శాంతి అసాధ్యం. కమ్యూనిస్టు ముప్పుఒక్కటే ముప్పుకాదు. జాతిమతద్వేషాలన్నీ ప్రపంచశాంతికి భంగకరమైనవే.

మిలిటరీ ఒడంబడిక మాత్రమే కాదు

అయితే రష్యాను బెదిరించడానికి అమెరికా అట్లాంటిక్ ఒడంబడికను తయారుచేసింది. ఇది కేవలం మిలిటరీ ఒడంబడికమాత్రమే కాదు. ఒడంబడికలో తొమ్మిదవ నిబంధన ప్రకారం స్థాపించబడబోయే ఉత్తరఅట్లాంటిక్ కౌన్సిల్ ఆ దేశాల విదేశాంగ వ్యవహారాల్ని కూడా సహకార విధానంలో నిర్వహింపచేస్తుంది. ఈ విధానం క్రమేణా ఆదేశాల్లో ఆర్థిక పునర్నిర్మాణానికి సహాయపడుతుంది. ఆ దేశాలమధ్య కలహాలను పరిష్కరిస్తుంది.

పసిఫిక్ ప్రాంతంలోగాని తూర్పుఆసియా ప్రాంతంలోగాని మరే ఒడంబడికలోనూ పాల్గొనబోవడంలేదని అమెరికా అధికారవర్గాలవారు అంటున్నారు. అయితే ఏ ఒడంబడిక అవసరం లేకుండానే ఈ ప్రాంతాల రక్షణ విషయమైకూడా జోక్యం కలుగచేసుకోగల మార్గం ఉండవచ్చును. మలయా, ఇండోనీషియా, ఇండోచీనావంటి దేశాలకు ప్రమాదం సంభవిస్తే బ్రిటన్, హాలండ్ ఫ్రాన్సు దేశాలు కలుగచేసుకోవచ్చును. అప్పుడు అమెరికా ఆ దేశాలకు సహాయపడగలదు.

ఈ దేశాలకు, అనగా యూరోపియన్ దేశాల పరిపాలనలోఉన్న ఆసియా ఆఫ్రికాలలోని దేశాలకు మార్షల్ ఆర్థికసహాయ ప్రణాళి కనువర్తింప చేయడానికి అమెరికా యత్నాలు చేస్తోంది.

ఇండొనీషియా

ఇండోనీషియా సమస్యను తిరిగి భద్రతామండలి చర్చించి కెనడా తీర్మానాన్ని అంగీకరించింది. కెనడాతీర్మానాన్ని మొదట్లోనే అంగీకరించినట్లు డచ్చి ప్రభుత్వం ప్రకటించింది.

"జోగ్జకర్తాలో తిరిగి రిపబ్లికన్ ప్రభుత్వాన్ని స్థాపించే విషయంలోనూ, హాలండ్ రాజనగరంలో రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్సు జరిపే విషయంలోనూ" ఇండొనీషియన్ రిపబ్లికన్లకీ డచ్చి ప్రభుత్వానికీ మధ్య "ఏరీతిగా" సమాధానం చేకూర్చవచ్చునో సంప్రదించి, అట్టి సమాధానం చేకూర్చాలని ఈతీర్మానం ప్రకారం భద్రతామండలి ఐక్యరాజ్యసమితి కమిషన్‌కు ఉత్తరువు చేసింది.

ఇదివరకు, అనగా జనవరిలో భద్రతామండలి తీర్మానంలో జోగ్జకర్తాలో రిపబ్లికన్ ప్రభుత్వాన్ని తిరిగి నెలకొల్పాలని డచ్చిప్రభుత్వానికి ఉత్తరువుచేసింది. 1950 లోగా ఇండొనీషియాలో స్వతంత్రప్రభుత్వం స్థాపించడానికి ఏర్పాట్లన్నీ చెయ్యాలని కూడా ఉత్తరువు చేసింది.

మొదటి ఉత్తరువు కంగీకరించలేదనీ, రెండో ఉత్తరువు ఇవ్వనక్కరలేకుండానే తామే ఫెడరల్ ప్రభుత్వం స్థాపించడానికి కృషిచేస్తున్నారనీ చెప్తూ డచ్చి ప్రభుత్వం భద్రతామండలి ఉత్తరువుల్ని ధిక్కరించింది. ధిక్కరించిన వారిని శిక్షించకపోగా ఇప్పుడు మరెంతకోరితే అంత ఇచ్చినట్లయింది. ఇటువంటి వైఖరివల్లనే భద్రతామండలి నిర్వీర్యంగా ఉందంటే సమాధానం చెప్పుకోలేని స్థితిలో ఉంది జోగ్జకర్తాలో రిపబ్లికన్ ప్రభుత్వాన్ని స్థాపించలేకున్నారు.

ఫెడరలిస్టులచే దేశద్రోహుల్ని సృష్టించి వారికి పరిపాలనని అప్పగిస్తాంగాని రిపబ్లికన్లకి ఇవ్వమన్నారు. అంటే భద్రతామండలి తిరిగి సమావేశమై చర్చించి చేసిన సూచన ఇది. పోనీ జోగ్జకర్తాలో రిపబ్లికన్ ప్రభుత్వాన్ని స్థాపించే విషయమై మీ ఉభయపక్షాల అభిప్రాయానికీ మధ్య మార్గమేమన్నా ఉందేమో చూడమన్నమాట. అంటే జోగ్జకర్తాలో ఫెడరలిస్టులనే బొమ్మల్ని కూడా పెట్టాలని డచ్చివారు పన్నుతున్న కుట్ర ఇప్పటికి భద్రతామండలివారిచే నియమించబడిన కమిషన్ ఆశీర్వాదంతో ఫలించడానికి అవకాశం చిక్కిందన్నమాట.

రిపబ్లికన్ ప్రభుత్వస్థాపనకి కొన్ని షరతులు పెట్టి, వారిమధ్య ద్రోహుల్ని నిఘావేసి వారి చేతులు కట్టేసి, రిపబ్లికన్లుకూడా ఉండే ఒక కీలుబొమ్మ ప్రభుత్వాన్ని స్థాపిస్తామని డచ్చి ప్రతినిధులు అంటారు. మధ్యమార్గం అంటే ఇటువంటిదే ఏదో అవుతుందికాని వాస్తవమైన జాతీయప్రభుత్వ స్థాపనకి వారంగీకరించరు. ఇప్పుడీ సంప్రదింపుల్లో పాల్గొనడానికి రిపబ్లికన్లు అంగీకరించినా ఇటువంటి మధ్యమార్గానికి ఎల్లానూ అంగీకరించరు. ఈలోగా అమెరికన్ డాలర్లు మెక్కిబలిసిన డచ్చి ప్రభుత్వం రెండింతల బలంతో "దొంగల్నీ దోపిడివారుల్నీ" కొట్టుతున్నామని చెప్తూ జాతీయవాదుల్నీ అణగదొక్కడానికి కావలసినంత తీరిక దొరుకుతుంది. సంప్రదింపులు వారాల తరబడినెల్ల తరబడీ జరుగుతుంది. చివరికి సమాధానం కుదరదు. ఇంక రెండోవిషయంమీద చర్చ జరగనక్కరలేదు. సమాధానం కుదరకపోతే రౌండ్‌టేబుల్ సమావేశం ఎల్లా జరుగుతుంది? చివరికి డచ్చివారు తిరిగి అమెరికన్ తుపాకులు చేతపట్టి ఇండొనీషియామీద దాడెత్తుతారు. ఏ ఫెడరలిస్టుల ద్రోహుల ప్రభుత్వాన్నో నెలకొల్పుతారు. ఒకవైపున భద్రతామండలిలో అమెరికన్లు భారత ప్రతినిధులు ఎంత విమర్శించినా ఫరవాలేదు. అట్లాంటిక్ ఒడంబడికలో చేరిన డచ్చి ప్రభుత్వానికి ఆయుధాల లోటుండదు. కెనడా తీర్మానంవల్ల తిరిగి పాతనాటకం ఆడటానికి డచ్చివారికి వీలు చిక్కుతుంది. కాని ఇండొనీషియాలో శాంతిమాత్రం ఉండదు. భారత ప్రతినిధి చెప్పినట్లు జాతీయోద్యమాన్ని తుపాకుల్తో కాల్చి చంపడం అసంభవమని యూరోపియన్ సామ్రాజ్యవాదులు ఇంకా గ్రహించనే లేదు.

ప్రపంచ రాజ్యంలో ప్రథమ పౌరుడు

ఆరంభంలో అవహేళనకు గురైనా ఇప్పుడు దేశదేశాల్లో అతని శిష్యుల సంఖ్య పెరుగుతోంది

ఐక్యరాజ్యసమితి సర్వసభ్యసమావేశానికి హడావిడిగా పారిస్‌లో పురాతన రాజభవనంలో ఏర్పాట్లు జరుగుతున్న రోజుల్లో, అకస్మాత్తుగా ఒక రోజు ఉదయం పారిస్‌వాసుల్ని ఒక వింత ఆకర్షించింది. ప్రపంచపౌరుడని పేరుపెట్టుకొన్న వ్యక్తి ఒకడు ఆ భవనప్రాంతంలో ప్రత్యక్షమయ్యాడు. అతనిపేరు గారీ డేవిస్. గారీడేవిస్‌గురించి చెప్పకపోతే గత సంవత్సరపు యూరప్ చరిత్రలో కొరవ ఉండిపోతుంది. యుద్ధాలలోనూ ఆర్థికదుర్భిక్షంలోనూ కుమిలిపోతున్న యూరప్ ప్రజానీకంలో, అన్యుల జోక్యం ఓర్వని సంశయమనస్తతను కూడా ఛేదించి వారిలో ఉత్సాహం కొత్త ఆశ కల్పించడానికి ఒక అమెరికన్ దేశస్థుడే రీతిగా సహాయపడ్డాడో బహుశా అమెరికన్లు అర్థం చేసుకోలేరు.

గారీడేవిస్‌ను చూపించి "ప్రపంచాన్ని పూర్తిగా మార్చివేయాలనుకుంటున్న అమెరికాదేశస్థుడు" అని తండ్రులు కొడుకులికి చెప్పేవారు. ఫ్రెంచి యువకులు ఆ వ్యక్తిపైన నవ్వుపువ్వులు కురిపించారు.

సమీపంలో రైల్వే స్టేషన్‌లో పత్రికలమ్మే, లావాటి స్త్రీ అతన్ని తేరిపారచూసి "పాపం, ఎంత కుర్రవాడో! అయినా ఎంతబుద్ధిమంతుడో, చాలా మంచివాడు. కాని పాపం, ఈ దగాకోరులు రాజకీయవాదుల్నించి తప్పించుకోగల ననుకుంటున్నాడు కాబోలు, వాళ్లు విడిచిపెట్టరు. ఆహారశాఖలో అటువంటి మంచివాడే ఉంటే ఫ్రెంచివాళ్లకి మాంసానికి కరువు లేకపోయేదికదా" బీటు తిరుగుతున్న పోలీసువచ్చి జనాన్ని కదలమన్నాడు. గుంపు కూడద్దని చెప్తూ "నడవండి నడవండి, ఆ కుర్రవాడికేం ఫరవాలేదు. మనం మానవ స్వాతంత్ర్యాన్ని ప్రపంచానికి బోధించిన దేశంలో ఉన్నాం. ఫరవాలేదు. నడవండి" అన్నాడు.

కొన్ని రోజులు గారీడేవిస్ రాత్రీ పగలూ ఆ పురాతన రాజభవనాలమధ్య ఉన్నాడు. బయట పచ్చికలోనే దండేలు, బస్కీలు తీసేవాడు. అక్కడ తిరిగే చిన్నపిల్లలకి పిప్పరమెంట్లు పెట్టేవాడు. అమెరికాలో తయారైన సిగరెట్లు కాల్చేవాడు. అక్కడికి పనిమీదవచ్చిపోయే ఒకరిద్దరు పనివారిని పలకరించేవాడు. ఆ ప్రాంతంలో నలుగురిలోనూ పేరు తెచ్చుకున్నాడు. అతనికి పువ్వులు, బహుమతులు వచ్చేవి ఒక కవి తన పాటలపుస్తకాన్ని బహుమతి చేశాడకూడా పారిస్‌లో నివాసంకొరత అతన్ని బాధించలేదు: అక్కడే పచ్చికలో ఎండా గాలీ, చలీ సుఖంగా అనుభవిస్తూ ఉండేవాడు.

ఐక్యరాజ్యసమితి సర్వసభ్యసమావేశం రేపు ప్రారంభమవుతుండగా ఇంక ఈ ప్రపంచరాజ్యంమీద దాడి చెయ్యక తప్పదని ఫ్రెంచి అధికారులనుకున్నారు. అంటే డేవిస్ తన నివాసం చేసుకుని ప్రపంచరాజ్యానికి పునాది వేసిన పదిగజాల పేర.

ఆ నాలుగురోజుల తగువులోనూ ప్రజలు పవిత్రమైన ప్రపంచపౌరవ్యవస్థమాట మరిచిపోయారు. చివరికి పోలీసు చెప్పనమాటే నిలిచింది. డేవిస్ తన అమెరికన్ పౌరసత్వం రద్దుపరుచుకొని తన పాస్‌పోర్ట్ పారిస్‌లో ఉన్న అమెరికన్ రాయబార కార్యాలయానికి పంపించేశాడ అతనిదగ్గర ఏ కాగితాలూ లేకపోయాయి. అయినా అతన్ని పారిస్‌లో ఉండనిచ్చారు. యూరప్‌లోకెల్ల ప్రజాప్రాతినిధ్య పరిపాలన నెలకొల్పిన ప్రథమదేశం స్విట్జర్లండ్, దేశభక్తుల్ని, సంకుచితజాతీయభావాన్ని మట్టుపెట్టాలనే సంకల్పాన్ని నిరాదరించారు.

జినీవాలో ఇదేమాదిరిగా "రెండో" ప్రపంచపౌరుడొకడు "ప్రపంచరాజ్యం" స్థాపించడానికి ప్రయత్నించగా అతన్ని దేశంనుంచి వెళ్లగొట్టారు. అసలు స్విస్ అధికారులు దేశాలు చూడాలని వచ్చేవారిని సరిగా ఆదరించరు. అల్లా వచ్చేవారివల్ల వారిహోటళ్లకి ఏమీ లబ్ధికలగకపోగా, వెన్న, చోకలేట్ అంతర్జాతీయ సత్రకంపాల పడతాయని వారి భయం.

ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం ముగియవచ్చేసరికి, అమెరికన్ యువకుని పవిత్రోద్దేశం ఆరంభంలో భగ్నం కొన్నట్లు కనిపించినా, క్రమక్రమంగా చురుకు అందుకుంది. ప్రజల్లో అతనికి అద్భుతమైన పలుకుబడి వచ్చింది. ఏదో ఒకటి జరిగితీరాలని జనం తహతహ లాడుతున్నారు ఒకరోజున రెండువేల మంది అతనివద్ద చేరి శాంతిసందేశం విన్నారు. మరుచటివారం ఇరవై వేలమంది విన్నారు. రెండురోజుల తరవాత పారిస్‌లో ఉండే విద్యావంతులుచేరి సభ చేసి అతన్ని కీర్తించారు. పారిస్ పత్రికలో దీన్నిగురించి వ్యంగ్యచిత్రం ప్రకటించారు.

యూరప్‌లో విద్యావంతులైనవారు డేవిస్ ఉపన్యాసాలు వినడానికి వెడుతున్నారంటే, నవ్వి ఆనందించడానికని అమెరికన్లు భావిస్తే అది పెద్ద పొరపాటు. ఈమధ్య ముట్టడిగురించి ఒక నాటిక వ్రాసిన ఆల్బర్ట్ కామస్, ఆంద్రీ బ్రిటన్, జీన్-పాల్ సార్టర్, ప్రఖ్యాత ఇటాలియన్ చిత్రకారుడు, గ్రంథకర్త అయిన లెవీ, "స్టాలిన్‌గ్రాడ్" అనే గ్రంథం వ్రాసి ప్రసిద్ధికెక్కిన జర్మన్ రచయిత థియోడర్ ప్లివియర్ మొదలైనవారంతా డేవిస్ సభల్లో పాల్గొన్నవారే! ఇంతమందీ ఆసభల్లో ఊరికే కాలం గడపడానికి వెళ్లలేదు. చిత్రకారులు, గ్రంథకర్తలు, పత్రికారచయితలే కాదు కళాశాలాధ్యాపకులు, పారిస్ విజ్ఞానరంగంలో ప్రసిద్ధి పొందినవారు కూడా డేవిస్ ఉపన్యాసాల్ని ప్రశంసించారు. ఫ్రాన్సిస్ మోరియాక్ సభకి రాలేకపోయినందుకు క్షమార్పణ కోరుతున్నట్లు ప్రచురించాడుకూడా.


యూరప్‌లోని ప్రజల్లో గారీడేవిస్ ఉద్యమం పట్లు అత్యంతాదరగౌరవాలు శ్రద్ధ నానాటికి వృద్ధిపొందుతున్నాయి. గారీడేవిస్ అమెరికన్ దేశస్థుడైనందువల్లనే యూరప్‌లోని కఠినవిమర్శకులు, విజ్ఞానవంతులుకూడా ఇతని ఉద్యమంపట్ల శ్రద్ధ వహిస్తున్నారు. ఇది అమెరికన్లపట్ల ప్రశంసఅనకో కూడదు. యుద్ధం వస్తుందా రాదా అనే విషయం అమెరికాపైనే ఆధారపడిఉంటుందని యూరప్‌లో ప్రజలందరి అభిప్రాయం. ఇందువల్లనే గారీడేవిస్ ఉద్యమం పట్ల ఇంత శ్రద్ధ. ఈనాటి ప్రపంచపరిస్థితి ప్రమాదభూయిష్ఠంగా ఉందంటే దీని కెవరు బాధ్యులనేది కాదు ప్రశ్న. రష్యానే నిందించేవారు కూడా యుద్ధమో శాంతో నిర్ణయించేది అమెరికామాత్రమే నని అభిప్రాయపడుతున్నారు. ఫ్రాన్స్‌పై అమెరికన్ యువకుని దాడి కిదే అర్థం.

శాంతి. శాంతి కావాలని యూరప్‌లో ప్రజలంతా ఘోషిస్తున్నారు. 1948 వ సంవత్సరంలో యూరప్‌లో చెప్పదగిన విషయం ఇదొక్కటే. ఈ శాంతి ఒక్కటే ప్రజల్ని మథనపరిచేది. ఎటామిక్ బాంబు చూపుతూ ప్రపంచాన్నంతనీ భయపెట్టాలని అమెరికా చేసే ప్రచారమంతా రష్యాను పిసమైనా చలింపచేయలేదు. కాని యూరప్ ప్రజల్లో శాంతిని సాధించాలనే యత్నం రాజకీయాల్లో ప్రధానమయింది.

కమ్యూనిజాన్ని ద్వేషించేవారకూడా ఇల్లా అంటున్నారు:

"కమ్యూనిస్టు పాలిత ప్రపంచం ఘోరంగా ఉంటుంది, నిజమే. రష్యా ఆక్రమణ దుర్భరంగానే ఉంటుంది. ఎప్పుడో ఒకప్పుడు ఈ పీడనుంచి ముక్తి పొందవచ్చును. కాని ఎవరూ తప్పించుకోలేనిది ఒక్కటే. అది ఏటంబాంబు."

పశ్చిమయూరోపియన్ ప్రభుత్వాలు ఫీల్డ్ మార్షల్ మాంట్ గామరీ ఆధిపత్యంకింద సమావేశాలు జరగవచ్చును. కాంగ్రెస్ కోట్ల డాలర్లు మంజూరు చెయ్యవచ్చును. కాని ఈ పర్యాయం యూరప్ ప్రజలు మాత్రం యుద్ధంలో ముందడుగు వెయ్యరు. చెయ్యి చేసుకోరు. పారిస్ పురాతన రాజభవనంలో యుద్ధభీతిని ప్రతిఘటించడానికి చెయ్యెత్తిన గారీ డేవిస్ అనే సామాన్యయువకునికి ఇంత శిష్యకోటి ఉందంటే అదే నిరూపిస్తోంది యూరప్ ప్రజలవైఖరి.



కైకలూరు తాలూకా పోలు కొండ బహిరంగసభలో అఖిలభారత కాంగ్రెసు కార్యదర్శి శ్రీ కళావెంకట్రావుగారు ఉపన్యసించిరి.

కాశ్మీర్ జనవాక్య నిర్ధారణాధికారిగా చెస్టర్ నిమిట్జ్ నియామకం

పసిఫిక్ యుద్ధంలో ప్రసిద్ధి కెక్కిన అమెరికా నౌకాదళాధిపతి



కాశ్మీరు ఇండియాతో చేరునా, పాకిస్తానుతో చేరునా అనే విషయమై జనవాక్యం నిర్ణయించడానికి జరుగబడే ప్లెబిసైటు నిర్వహించుటకు ఐక్యరాజ్యసమితివారు అడ్మిరల్ చెస్టర్ నిమిట్జ్‌ను నియమించారు. అడ్మిరల్ నిమిట్జ్ గత యుద్ధంలో మిత్రమండలివారి పక్షాన పసిఫిక్ ప్రాంతానికి సర్వసేనానిగా పనిచేశాడు.

నిమిట్జ్ నావికోద్యోగిగా చాలా ఖ్యాతి గడించినవాడు. 1885 ఫిబ్రవరి 24 న ఈయన టెక్సాస్ స్టేటు (అమెరికా) లో జన్మించాడు. 1901 లో నావల్ ఎకాడమీలో ప్రవేశించి 1905 లో నావికశిక్షణ పూర్తిచేసి పట్టభద్రుడైనాడు. వెంటనే "పానే" అనే ఫిరంగి ఓడకు నాయకుడుగా నియమించబడ్డాడు.

మొదటి ప్రపంచయుద్ధం అఖరుదశలో 1918 ఫిబ్రవరి సెప్టెంబరు మాసాలమధ్య అమెరికను అట్లాంటికు సబ్మెరీను దళానికి ఛీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా ఉండి యూరపులోని మిత్రమండలి నౌకా బలాలకు అమెరికను సబ్మెరీనులు పంపాడు. 1926 లో కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో మొట్టమొదటగా నావికాధికారుల శిక్షణశాఖ ఏర్పరిచాడు. 1935 లో బ్యూరో ఆఫ్ నావిగేషనుకు సహాయాధికారిగా నియమించబడి 1939 లో ప్రధానాధికారి అయినాడు. 1942 లో ఈయనను పెసిఫిక్ నౌకాదళానికి నాయకుడుగా నియమించారు. ఆ పదవిలో ఆయన చూపిన ప్రజ్ఞకు 1944 లో ఈయనకు "డిస్టింగ్విష్డు సర్వీస్ మెడల్" ఇచ్చారు.

నిమిట్జ్ తనకిందివారిని జాగ్రత్తగా కనిపెట్టి సాధ్యమైనంతవరకు వారిపై ఆధారపడడమే కాక, తన నాయకత్వంలో సాధించిన విజయాలకు వారే కారకు లని కూడా చెబుతాడు. గత యుద్ధములో మిడ్వే, సాలోమన్స్, కారొలైన్స్, మేరియానాస్ మొదలైనచోట్ల సముద్రయుద్ధములో అమెరికా జపానుపై సాధించిన విజయాలకు తనకింద పనిచేసినవారే బాధ్యు లని చెప్పాడు. నిజానికి, ఆయన ఏ పనికి ఎవరిని నియోగించాలో చక్కగా తెలిసినవాడు. ఈయన తన క్రింది అధికారులతోనే కాక ఒక్కొక్కసారి సామాన్యనావికుల పరిచయంకూడా చేసుకుంటాడు. ఒకసారి ఈయన ఒక సామాన్యనావికుడితో గంటసేపు ప్రసంగించి చివరకు ఫోటోగ్రాఫరును పిలిచి అతనితోసహా ఫోటో తీయించుకున్నాడట. కారణ మేమంటే, ఆనావికుడు అడ్మిరల్ నిమిట్జ్‌ను చూడలేడని అతని అనుచరులు పందెం వేశారట. చూసినట్టు దాఖలుగా నిమిట్జ్ ఫోటో తీయించాడు.

ఆయనకు ఉద్రేకం రావడం ఎప్పుడూ ఎవరూ చూడలేదు. ఆయన నావికాధికారి అయిన కొత్తలో ఒక పాత యుద్ధనౌకపై ఉండగా ఇంజనీరొకడు "నౌక మునిగిపోతున్నది ఏమిచేయుచున్నారు?" అని తత్తరపడుతూ అడిగాడట. దానికి నిమిట్జ్ "చార్టన్స్ ఇంజనీరింగ్ మాన్యువల్ - 48 వ పేజీచూస్తే ఇటువంటి స్థితిలో ఏమి చెయ్యాలో తెలుస్తుంది." తొణకకుండా సమాధానంచెప్పాడట.

కథానిక:

నిరవాకాలు

శ్రీ కాళీపట్నపు రామారావు

ఉగ్గుపాలతో పాటు వేదాంతాసవాన్ని సేవిస్తూ పెరిగిన, హిందూ సామాజికులముందు నోరు విప్పడానికి నాకు హడలే—కాని గత్యంతరం లేదు.

ఒకప్పుడు ఉండనిల్లూ కట్టబట్టా లేని '—' వారి కుటుంబం కొంతకాలం తాము తినగా యింకొకరికి పెట్టగలిగే స్థితికి అభివృద్ధి చెందింది. యిళ్లా మరికొంతకాలానికి యెప్పటి స్థితికే చేరుకుంది.

'దీనికి కారణ మేమిటి —' అని ప్రశ్నిస్తే రకరకాల జవాబులు వస్తాయి.

ముందుగా సుప్రసిద్ధమైన సుభాషితం — 'జెనెలు బండ్లగు బండ్లు నోడలౌ' తరువాత 'సంపదలు తరంగసంచలంబులు—'

ఈరకం రడీమేడ్ అభిప్రాయాలే కాక యింకొక తెగకు చెందిన అభిప్రాయా లిచ్చేవారు తమ అభిప్రాయాన్ని చాలా తికమకగా చెప్తారు.

"—ఒక కుటుంబమైనా ఒక సమాజమైనా ఆర్థికరంగంలో కాని యింకేరంగంలో కాని అభివృద్ధినొందటం పతన మవటం ఒకసూత్రంపై ఆధారపడివుంటుంది. ఆధ్యాత్మిక ఆదిభౌతికరంగాలన్నిటా అత్యున్నత శిఖరా లందుకున్న భారతీయ విజ్ఞానం నాగరికతా మరల అంత ఎత్తుల నుండీ పునాదులకు పతన మవటానికి కారణం ఏదో—ఈ కుటుంబంలోని వివిధపరిణామాలకు కూడా అదే కారణం" అంటారు.

యేది యేమైనా జరిగినది యిదీ :

సుబ్బారావు పంతులుగారు పుట్టకముందు వారి కుటుంబం కష్టంమీద జీవనం సాగిస్తుండేది. అటువంటిది ఆయనకు పాతికేళ్లు వచ్చేసరికి మంచి ఉచ్చస్థితిలోకి వచ్చింది.

తండ్రి వీర్రాజుపంతులుగారు చనిపోయేసరికి ఆరు ఎకరాల పల్లం ఎనిమిది ఎకరాల మెట్టా ఇనప్పెట్టెలాంటి పెంకుటిల్లూ. అయిదు వేల వరకూ ఋణాలయాకేణ చరాస్తి కొండొకప్పో కొంత—ఇంతా యిచ్చిపోయాడు. అయితే యేం లాభం ?

ఇంత ఆస్తి సంపాదించినది అతని ఒక్కని చేతిమీదనే. ఆ చుట్టుప్రక్కల పదారుగ్రామాల లోనూ వీర్రాజుపంతులుగారిని గురించికాని వారి ప్రయోజకత్వం గురించికాని కుమారుడికి వారు చేసిన 'నిరవాకం' గురించికాని చెప్పుకోనివారు ఉండరు.

ఆయన పేరెక్కిన ముసద్దీ. ఆయనగురించి ఉన్న గాథలు యిన్నీ అన్నీ కావు. '—వీర్రాజుపంతులు దస్తావేజు వ్రాశాడూ అంటే ఫాలాక్షుడు వచ్చినా తప్పుపట్టలేడు.' '—బొతుఈక కలం తీసి బరబరలాడించాడంటే ముత్యాలకోవలు!' '—కేసుపట్టి కోర్టుకు తీసుకువెళ్ళాడూ అంటే హరిమీద గిరి పడ్డా గిరిమీద హరి పడ్డా కేసు మాత్రం నెగ్గితీరవలసిందే. మూడవకోర్టులో కాకపోతే ముప్పైమూడవకోర్టులో నన్నా నెగ్గించాడన్నమాటే—' ఈ విధమైన జనాభిప్రాయపు టండనే అత నాఆస్తి అంతా గడించాడు. గడించి ఏకైకపుత్రుడు సుబ్బారావుపంతులు కిచ్చాడు. అందుకే అతను పోయినా ఆయన కొడుక్కు చేసిపోయిన 'నిరవాకం' గురించిమాత్రం ప్రజలమధ్య చిరస్థాయిగా వుండిపోయింది.

అయితే యీ 'నిరవాకం' గురించి ప్రజలకన్నా ఎక్కువగా చెప్పుకొనేది సుబ్బారావు పంతులుగారే. తండ్రి గొప్పదనాన్ని చెప్పుకోవడంలోని శిగ్గుచేట మనవాళ్లలో చాలామందికి తెలియదు. ఆయన చెపుతుంటారు—

"—ఆరోజులే వేరు! మా చిన్ననాటి భోగాలు జమీందారు బిడ్డలకు జరగవు ఈ గురువుశెట్టి — యిప్పుడంటే కన్నూమిన్నూ కానకుండా వున్నాడు కాని—అప్పుడు వాణ్ని గురన్నా గురివిగా అని పిలిచేవాళ్లం. తండ్రి వెనుక ఉప్పుగల్లూ చింతపండూ భుజాన వేసుకొని ఊరూరా త్రిప్పి అమ్ముకుంటుండేవాడు. నేనుమాత్రం యిరవయ్యేళ్లు — యిరవైయేళ్లేం మాతండ్రిగారు బ్రతికిఉన్నంతకాలం ఒక్కనాడు కూడా యింటి వ్యవహారాల్లో నైతేనేం యేటి వ్యవహారాలలో నైతేనేం నాక్యం కలిగించుకోవలసిన అవసరం లేకపోయింది. ఆయన అలా జరిపాడు! మహారాజు !!

ఆ రోజుల్లో — దీపావళి రథయాత్రా మొదలైనవివస్తే వీడు నన్ను మంచి మాటలు ఆడుకొని నాచేతడబ్బు తెప్పించి నాకూ వాడికీ ఖర్చు పెట్టించేవాడు. ఇద్దరం యెంతో స్నేహంగా ఉండేవాళ్ళము-" యిలా అని చెపుతూ చెపుతూ అకస్మాత్తుగా వేడెక్కిపోయి గొంతుపెద్దది చేస్తూ అరిచేవాడు "—అటువంటివాడి అవస్థ కిప్పుడు కళ్లు నెత్తిమీదికి వచ్చేయి లక్ష్మీఅనుగ్రహం కలగ్గానే అన్నీ మరిచిపోయాడు చిన్ననాటి స్నేహితునికే ద్రోహం తలపెట్టాడు. పాజీ! ఘూటాకోర్ !! మావిద్రోహి తువ్వ !!! "

పంతులుగారి ఈ వాక్యాలలో ఆయన అభిప్రాయాలు అటు ఉంచితే కథనమంతా అక్షరాలా నిజం.

వీర్రాజుపంతులుగారు కొడుకును జమీందారు బిడ్డలానే పెంచారు. చచ్చిపోయేటప్పుడు ఏమీకూడా సంపాయించి యివ్వవలసివుంటుందేమోనని మాత్రం ఒకసారీ సందేహించలేదు.

ఆయనగారు బ్రతికివున్న రోజుల్లో సుబ్బారావుగారి దర్జా సౌఖ్యం బన్ను బట్టేవికావు. ఉదయం లేవగానే మస్తుగా తినటం, ఒకచుట్ట ఒకటి వెలిగించి రామమందిరం చేరుకోవటం. అప్పటి కప్పుడే యిటువంటి — జొడ్డునమాణిక్యంతో పుట్టినబాపతు— అంతా అయిదారు గురుచేరుతారు. వీరంతా అక్కడ సభ దీర్చి గానకళోపాసనో, చతుర్ముఖ పురాణ పారాయణో ఏదో ఒకటి ఆరంభించేవారు. ఏదైనా అరంభించారో—ఐదో ఒకటి ఆరంభించి తీగుతారు— అపరాహ్ణందాకా నిరంతరాయంగా సాగిపోయేది. యింటిదగ్గర ఆడవాళ్ల నుంచి కబురు మీద కబురు రాగా రాగా అప్పుడు యింక విధిలేక లేచియిళ్ళకు వెళ్లేవారు. అవకాశం వుంటే స్నానాలు చేసో, లేక తీరిక లేకపోతే వాయిదా వేసో భోజనాలదగ్గర కూర్చునేవారు. కండిన పాకాల్లో 'యివి,బాగు లేవు' 'ఆవి చేశావు కావేం?' అని యథావిధిగా నాదాహంగామా చేస్తూ ఆపెట్టే యేదో తీర్చుకొని మాపెవరూ మంగడవక ముందేమరం చేసువేవారు. అక్కణ్నుంచీ మామ్మోలుపాటే! రాత్రికూడా భోజనాలవగానే చేతికందిన తువ్వాలో దుప్పటో కప్పుకొని నోట్లోకి పెద్దచుట్ట పెట్టుకొని అక్కడికే చేరువారు.

రాత్రిళ్ళుమాత్రం సభికులు చాలామంది వుంటారు. పగలల్లా పనిపాట్లకుపోయిన రైతులూ, తదితరవృత్తులవారుకూడా వస్తారు. రోజు కో కార్యక్రమం. ఒకనాడు కథలు, యింకోనాడు 'కుసలాయక మో' 'హరిహరీ నారాయణ' పదమో. యిందలి నాయకులు ఏకారణంచేతైనా '75 హాజరు అయిపోతే స్వంత కథలు.

ఈ 'మా అనభవాలు' వింటుంటే ఎటువంటి శ్రోతయినా నిచ్చెరపోవలసిందే. ఏ చచ్చనాయకుణ్ణి తీసుకున్నా ఒకడూ సాహసాంకునికీ రసికావతంసునికీ బృహస్పతికీ యీడు తియ్యరు.

తరుచు ఎట్టివారిపై నాఉద్యోగ్నులను చేసే దెయ్యాల అనుభవాలూ, రసికానుభవాలూ వినవస్తూవుంటాయి. ఒకొక్కరు చెప్పే అక్షర సత్యాలు వింటుంటే—యిప్పుడు లేరు గాని—ఆ విక్రమార్కుడూ ఆ శ్రీకృష్ణుడూ వీళ్ల కథలు విన్న మరుక్షణంలో వీరు శిష్యులైపోయి వుండరా అనిపిస్తుంది.

ఒక్కరోజున భజన. ప్రతిశనివారంరాత్రీ శ్రీ సీతారాములవారి భజనతిప్పదు యిందులో పంతులుది అగ్రస్థానం పంతులు అక్కడి గాయకమణులందరిలోనీ శిఖామణి. ఈభజనల్లో తరుచు వీలునంబడిని శ్రీసీతారాములవారి పేరు చెప్పి ఏకాగ్రతాసిద్ధికోసం భక్తులంతా భంగుకూడా ప్రసాదంగా స్వీకరించడం కద్దు.

పంతులు నేర్చుకున్న విద్య యింతే కాదు. కొన్ని 'భాగోతం' దరువులు కూడా వచ్చు. ముఖ్యంగా 'మద్దిల' (మృదంగం) వాయిస్తాడు. 'పంతులు మద్దిల కడితే కిన్నెర్ల గజ్జల కణ కణ యినిపిస్తది' అని గురువుశెట్టి యెన్నోసార్లు సహజోక్త్యలంకారంగా వర్ణించివున్నాడు. కాగా భాగవతం చదవడం పంతులుసొత్తు - అందులో ప్రహ్లాదచరిత్ర పంతులునిత్యపారం. యింగాపంతులుకు చాలా చాటువులూ శతకాలూ కూడా కంఠస్థం వచ్చును.

ఇదీ పంతులుగారి లాల్యయవ్వనాల్లో జమీందారీ పెంపకం.

సరిగ్గా ఈ రోజుల్లోనే గురన్న ఉదయస్తమిదాకు పగలల్లా గోనెమూటలు వీపున వేసుకొని ఎండనక వాననక దగ్గరనక దూరమనక ఊరూరా తిరిగి చస్తినోయని యింటికి వచ్చి రాత్రిమాత్రం సుఖం చేసుకొనేవాడు. ఎప్పుడూ పంతులు ప్రక్కనే పంతు లిచ్చిన చుట్టముక్క కాల్చుకుంటూ కూర్చునేవాడు—అదే వారిస్నేహం.

స్నేహితు లిద్దరిలో ఒకని తండ్రి తనకొడుకు కొన్ని వేలరూపాయాల ఆస్తి సంపాదించి పోతే, రెండవవాని తండ్రి కొడుక్కి నెత్తికి చేతు లిచ్చిపోయాడు. శెట్టితండ్రి కట్టి అప్రయోజకుడు. పుత్రాభిమానం యిసుమంతైనా లేనివాడు. పశువులూ పక్షులూ అయినా నయం. యుక్తవయస్సు వచ్చాక పిల్లలను ఆకాశంలోనికి తీసుకొనిపోయి ఆహారం సంపాదించడం మప్పుతాయి. కాని శెట్టితండ్రిమాత్రం కొడుక్కి యుక్తవయస్సు యింకా వచ్చీరాకుండానే రెక్కపట్టుకొని విశాలవిశ్వంలోకి ఈడ్చుకుపోసాగాడు.

అయితే నేం, శెట్టిఅదృష్టం బాగుంది. తండ్రి చిన్నప్పటినుంచీ కష్టపెట్టడం తప్ప ఒక్క దమ్మిడి ఎత్తు 'నిరవాకం' చెయ్యక పోయినా పదేళ్లలో ఊర్లో మోతుబరి ఆసాములతో తలెత్తుతి విరసాగాడు

'ఇంగులో కి టి కు ఏమ యియ్యంటుందీ? ' అంటే చెప్పలేం.

శెట్టి తరుచు ఉద్ఘాటించే పంతపదంనుండి ఏమైనా చేయగలిగితే ఆ పంతపదము ఇదీ —

"—నమ్మకం చెడగొట్టుకొన్న బతుకు ఏం బతుకూ అంటాను. ఒకరికి ఉపకారం చెయ్యి! అయ్యా. నేనీ ఉపకారం చేశేనను, ఈకూరాకు తింటానను? అంతేకాని దొంగలింకా ! ఛీ! అట్టి బతుకు సరే—కుక్క బతుకు సరే !"

శెట్టి పదేళ్లలో పదివేలరూపాయల ఆస్తి సంపాదించాడు. ఈ యింత ఆస్తి తనకు కుక్కబ్రతుకు మీది ఈ అసహ్యం వల్లే పరహృదయ దయద్రవణశక్తివల్లే సంపాదించా నంటాడు. నమ్మాలి మరి !

అయితే లోకులు అనుకునేదంతా యేమిటయ్యా అంటే—

"—బాబూ, తెలియం దేముందీ! లోకులు పలుగాకులు !.. ...

ఇంకా చాలా భారతం ఉంది. దానితో నోటికి తాళం.

యేమైనా పంతులు జీవితంమాత్రం శెట్టి బ్రతుకువంటిది కాదు. లోకులచే వేలు మడిచించుకొనని జీవితం. తండ్రి అలా పెంచాడతన్ని. "చిన్నప్పణ్ణుంచీ రాజాదర్జాతో పెరిగినబాబు! పాలూనీలూ ఒకటే నను నే దరమరాజు ! అతని కతగాడే సాటి" అనిపించుకున్నాడు. చివరిరోజుల్లో ఈనీతిమంతుడి ముఖం యెవరూ చూడకపోతే చూడకపోదురుగాక - ఫలానా అకార్యం చేసాడని వేలెత్తి చూపించుకోలేదు.

అయితే యిట్టి సుశిక్షిత బ్రాహ్మణవంశజుణ్ణీ ధర్మశీలినీ భక్తుణ్ణి పండితుణ్ణీ నీచుల నంటవలసే దారిద్ర్యమెలా ఆవేశించిందీ అంటే - అదే చిత్రం ! భగవచ్ఛిద్విలాసం !!

శ్రీమన్నారాయణమూర్తివారి లీలా జగన్నాటకగ్రంథంలోని ఈ యేకాంకికకు నాంది యిదీ :

వీర్రాజుపంతులుగారు అనుకోని విధంగా చెప్పి పెట్టకుండా హరీ మనేశారు.

దీనితో నిరాలంబుడైన పంతులు తన భారాన్ని మోయ నంగీకరించే దాత యెవరా అని దిక్కులు చూడసాగారు.

పంతులుఅంతరంగాన్ని గ్రహించి పరోపకారపరాయణుడూ, ఆబాల్యస్నేహితుడూ అయిన గురన్న ఒకనాటిరాత్రి తొలిజాము సమావేశాల్లో కలుసుకొని ఏకాంతస్థలానికి తీసుకపోయాడు. అక్కడ సక్రమమైన నాందితో ఆరంభించి ఒక చిన్న పాఠం చెప్పాడు.

బంధువు లంటె యెవరో వాళ్లు బయటికి తీయతీయటిమాటలు చెపుతున్నా లోపల మాత్రం యాంతరాలాల వాళ్ల నిజస్వరూపం యెట్టిదిగా వుంటుందో !

స్నేహితులంటే యిట్టివారో, వాళ్లు బయటకు ఆడేమాటలూ. చేసే కార్యాలూనిష్ఠురంగా ఉన్నావారి అంతఃకరణంలో ఏమిటి కోరుతూ వుంటారో—

వారి వీరికి ఉన్న భేదా యేమిటో—

మొదలైన విషయాలగురించి అనేక ప్రత్యక్ష పరోక్ష అనుభవగాథలనుండీ భూతభవిష్యత్ వర్తమానాది త్రికాలాల్లోంచీ అనేక ఉదాహరణ లిస్తూ సవిస్తరంగా ఉపన్యసించాడు.

శెట్టి చేసిన ఈ నిస్వార్థబోధనతర్వాత కొద్ది దినాలకే పంతులు గురన్నా నేస్తా లైపోయారు. తక్షణం కాకపోయినా నిలకడమీద శెట్టి గొంక్క యీపనాల హృదయంకు అర్థం తెలిసింది కూడా !

వీర్రాజుపంతులుగారి దినవారాల కైతేనేం, ఆపత్సమయంలో ధైర్యం కొల్పడానికి వచ్చిపోయే బంధులతిని మర్యాదచేయ్యడంతో నైతేనేం అగమాసాలనాటికే తండ్రి రొఖ్ఖం రూపంలో మిగిల్చిన కొద్దివందలూ హరించుకుపోయాయి.

అట్టిసమయంలో గురన్నవంటి నేస్తం ఉండబట్టే సరిపోయింది. పంతులు ఒక్కసారి ఒక్కమాట మాత్రం అనగానే యింకదేనికీ తడుముకోవలసిన అవసరం లేకపోయింది. బియ్యం కావలసినా ఉప్పు కావలసినా పప్పు కావలసినా గురన్న కొట్టుకు పంపిస్తే అన్నీ వచ్చిపడేవి.

అయితేమూడునెల్లనాడు 'యవహారంలో చిన్న తిరకాసురావడంవల్ల' గురన్న నోరు తెరవక తప్పిందికాదు. కాని పంతులు వద్ద అంతకుముందే దమ్మిడీ లేదు. కాగా సంవత్సరికాలకైతేనేం, మరికొన్ని పైఖర్చులకైతేనేం డబ్బు కావలసివుండెను. అందుచేత పంతులుకు రావలసిన ఋణాలనుండి ఏమైనా వసూలవుతుందేమోనని చూశారు. కాని ఋణగృహీతలు ఎవరికి వారే తమ అశక్తతనూ విచారాన్నీ వెలిబుస్తూ ఆరు మాసాలకు తక్కువకాని వ్యవధిని కోరారు.


అప్పుడు గురన్న ఆలోచించి ఒక యుక్తి పన్నాడు. భార్య పుట్టినింటినుండి తెచ్చుకున్న స్త్రీధనం వెయ్యిరూపాయిల పైచిలుకుండట. తను ఎన్నిసార్లడిగినా 'శశా, కాదు పొమ్మం'దిట. అన్న కాబట్టి పంతులు మొఖమాట పెడితే కాదన లేదట.

చివరకు గతిలేక పంతులు అందుకే తలపడ్డాడు. శెట్టిమాత్రం 'తను మధ్యను ఉంటే వ్యవహారం కుమటపడదనే అధైర్యం వల్ల యిందులో జోక్యమే కలిగించుకోలేదు. చివరకు వ్రాతకోతలు జరిగేటప్పుడైనా ఊర్లో లేడు. అట్నుంచి వచ్చాక పంతులు అంతా చెప్పాడు.

ఆ రోజుల్లో సొమ్ము ఆలీని వడ్డీకిస్తే (తణఖాలేని వ్యవహారం) నెలకూ నూటికీ రూపాయిన్నర ధర్మవడ్డీగా వుండేది. అటువంటిది ఈ వ్యవహారంలో వడ్డీరేటు రెండు రూపాయి లనేసరికి శెట్టి మొదట నిశ్చేష్టుడైపోయి తర్వాత మండిపడిపోతూ యింటికి పరుగెత్తాడు. పంతులు ఆ వైఖరి చూసి అనుమానిస్తూ తనూ వెనకనే వెళ్లాడు :

శెట్టి పెళ్లాన్ని పట్టుకొని గట్టిగా చావతిట్టేశాడు. అంతాశేవుంటే జయం పొందదన్నాడు. వడ్డీరేటు తగ్గించకపోతే సొమ్ము యెలా వసూలౌతుందో చూస్తా నన్నాడు. అగ్గి రుద్రుడైపోయాడు. చివరకు పంతులే శాంతపరిచాడు. అతడు శెట్టి వృథాకోపంలోని పొరపాటును తెలివిగా ఎత్తి చూపించాడు.

(17వ పేజీ చూడుడు)





ట్రంక్ ఎక్స్ఛేంజి : మద్రాసు పట్టణంలో దాదాపు 4900 మంది టెలిఫోను సంభాషణ ట్రాన్స్మిట్ కావలసి ఉంటుంది. దినమూ దాదాపు 1000 మా... ఒకళ్ల కొకళ్లు ఇంత దగ్గరగా ఉన్నాకూడా, ఒకళ్లు మాట్లాడుతూంటే పక్క... తుంది. ఈ ఆపరేటర్ల పనిని మానిటర్లు పర్యవేక్షిస్తూంటారు. వాళ్లపైన సూపర్... యంత్రాలు కొల్కత్తాలో గ్రాఫ్, టెలిఫోను మీటరు వల్ల తెలుసుకొని, ఒక్కొ... ఇక్కడ ఆఫీసు గదులు...

పట్టణంలో వివిధభాగాలనుంచి వచ్చే టెలిఫోను తీగల కొనలన్నీ ఈ చట్రంమీదకి చేరుస్తారు. ఒక్కొక్క టెలిఫోనుకు ఒక్కొక్క ప్రత్యేక సంజ్ఞాసంఖ్య ఉంటుంది. చట్రంలో ఒక్కొక్క విలువు కానులో 220 నంబర్ల కొనలు ఉంటాయి. ఎక్కడి టెలిఫోను చెడినా, ఈ అంచున ఫ్రేమ్‌వద్ద మంచి పరీక్షచేసి ఎక్కడ చెడిందో తెలుసుకోగల్గుతారు. టెలిఫోను ఉన్నవారు ఊళ్లో ఒకచోటనుంచి మరోచోటికి (అదే ఎక్స్ఛేంజి విభాగంలో) మార్చదలుచుకుంటే, నంబరు మార్చక్కరలేకుండా ఈ చట్రంలోనే ఈ మార్పు తేవచ్చును. ఈ ఫ్రేములోపలిభాగంలో చుట్టబడిన తీగె 12 మైళ్ళ పొడుగుంటుంది. 2748 మంది టెలిఫోను ఖాతాదారులకు ఎక్స్ఛేంజి సౌకర్యం, ఈ 12 మైళ్ల తీగెవల్లా అనువవుతుంది. చట్రం అడుగున 6480 కేబుల్సు తలకొనలు అమర్చే వీలుంది. 3700 ఖాతాదారులకు స్థానికంగా ఉనుసుల్లు కల్పించే వీలుఉంది. ఈ చట్రంలో తీగెల అమరిక చాలా క్రమబద్ధంగా ఉంటుంది.

మద్రాసు




★

పరిశోధక శాఖ : ఎక్కడెక్కడి టెలిఫోను లోపాలున్నాయని కంప్లైంటు రాగానే, ఆపరేటర్లు, టెస్టు బల్లవద్ద పని వారికి కంప్లైంటు తెలుపుతారు. ఇక్కడి ఎలక్ట్రిక్ మీటర్లతో, లోపల ఎక్కడుందో టెసింగ్ నిపుణులు పరిశోధించి వెంటనే, సరిచేయవలసిన పని నిపుడు మీ యింటి చీటీలను కంప్లైంట్లవరుసలో టేబిల్ మీది గూళ్లల్లో ఉంచుతారు. మెకానిక్‌లు ఈవరుసలో ఆ యిండ్లకు వెళ్లి, ఫోనులు సరిచేస్తుంటారు. ఎక్కడ కంప్లైంటయినా సరే, శ్రద్ధ తీసికోకుండా ఆగేందుకు ఎంతమాత్రమూ వీలులేదు. ➡

ఎంక్వయిరీలు, కంప్లైంటులు : కొత్త ఖాతాదారులకు విషయాలు! విపులీకరించేందుకు కొత్తగా ఎంక్వయిరీశాఖ ఖాతాదారులు చెప్పుకొన్న కంప్లైంటులు తీసికొని వెంటనే సరిచూసేందుకు వేరే శాఖా ఉన్నయి.

ఖాతాదారు ఎవరైనా ఎక్స్ఛేంజితో ఏదైనా సంప్రదింపులు జరిపేందుకు వేళకుదుర్చుకోవాలంటే ఒకరోజు ముందుగా, "90" నంబరు పిలిచి, కావలసిన వేళ నిశ్చయించి అప్పుడు మాట్లాడమని అడగవచ్చును.


★






...వా రున్నారు. ఇండియా, సిలోన్, పాకిస్తాన్‌లకు ఎక్కడెక్కడికి మాట్లాడాలన్నా ట్రంక్ ఎక్స్ఛేంజి ద్వారా ...ంక్ ఎక్స్ఛేంజిద్వారా పిలుపులు ఉంటాయి. ఇక్కడి ఆపరేటర్లు పగలూ రాత్రీకూడా పనిచేస్తూ ఉండవలసి ఉంటుంది. ...ళ్ళకి వినబడదు. ఎక్కడెక్కడ పిలుపులూ, ఒక ఊరినుంచి మరొక ఊరికి అందించే పని ఈ ఎక్స్ఛేంజి ద్వారా జరుగు ...వేజరు ఉంటారు. ఇక్కడ ఉద్యోగులందరూ స్త్రీలే. ఒక్కొక్క సంభాషణ ఎంతసేపు తీసుకొన్నది—అక్కడి ...క్కటిక్కట్టుమీద రికార్డు చేస్తారు. మర్నాడు వాటి నన్నిటిని, వరుస వారీగా కూర్చి, మళ్లీ సరిచూచుకొంటారు. ...ని అన్నీ శుభ్రంగా ఉంటానికి ఎక్కువ శ్రద్ధ తీసుకొంటారు.

టెలిఫోన్ ఎక్స్ఛేంజి





ఇప్పటి టెలిఫోన్ : "కొత్తరకం సెంట్రోమాటిక్" విధానాన్ని 1926 ప్రవేశ పెట్టారు. ఇప్పుడు ఈరకం టెలిఫోన్లను కలకత్తా జంషెడ్‌పూర్ కర్మాగారాలలో తయారుచేస్తున్నారు.



1882 లో మద్రాసులో మొదటి టెలిఫోన్ : మద్రాసులో మొట్టమొదట టెలిఫోన్ ఎక్స్ఛేంజి 1882 లో స్థాపించారు. అప్పుడు 25 ఎక్స్ఛేంజి లైనులతో టెలిఫోను సౌకర్యం ప్రారంభించారు. అప్పటి టెలిఫోన్ విధానము పాత మాగ్నిటర్ విధానం. ఆనాటి టెలిఫోన్ ఈ స్వరూపంలో ఉండేది.



'చేసిన మేలు వ్యర్థం కాదు'

మూలం: 'సాండ్‌ఫర్డ్ అండ్ మెర్టన్'

అనుకరణ: 'శ్రీ ఆచార్య భార్గవ'

ఓరోజు ఒక కుర్రవాడు ప్రొద్దున తన ఊరినుండి, ఐదుమైళ్ల దూరంలో ఉన్న మరో గ్రామానికి ప్రయాణమయ్యాడు—ఏదో పనిమీద. మధ్యాహ్న భోజనానికి అన్నం మూట కూడా తీసికొనిపోతూ వుండినాడు.

ఈలా అతడు వెళుతూండగా ఒక కుక్క అతని వెంట బడింది. తోక ఆడిస్తోంది; అతనివంక అతిదీనంగా చూస్తోంది—తనమీద దయుంచమని వేడుకొనేలా.

ఆ పిల్లవాడు మొదట ఈ కుక్కను గమనించనేలేదు. వెళ్లగా వెళ్లగా అప్పుడు చూచాడు ఆ కుక్కను. చాలా చిక్కి నీరసంగా ఉసూరుమంటూ ఉన్నది.

"ఈ కుక్క ఆకలికి అల్లాడిపోతోంది. నన్ను విడవకుండా, తన కేదైనా పెట్టమనేలా చూస్తోంది. ఏదైనా కొంచెం ఆహారం ఇవ్వకపోతే ఇది చచ్చిపోతుంది. దాని కిస్తే నేను వస్తు ఉండవలసి వస్తుంది. ఐనా నాకంటే ఈ కుక్కకే ముఖ్యంగా తిండి అవసరం." అని ఆలోచించి ఈ దయగల అబ్బాయి తన అన్నంలో కొంత భాగం ఆకుక్కకు పెట్టాడు. ఆ కుక్క అన్నానికి వాచిపోయినట్లుగా మహా ఆప్యాయంగా తినేసింది. కొంచెం కుదుటపడింది కుక్క. మళ్లీ సాగించాడు ప్రయాణం కుర్రడు.

* * *

తన ప్రాణం నిలిపినందుకు కృతజ్ఞత తెలియబరుస్తూ అతని వెంటనే వెళుతోంది కుక్క. అతన్ని నీడలా అనుసరిస్తోంది. ఆ కుర్రవాడు ముందుకు సాగి పోగాపోగా అతని కొక గుర్రం కనపడింది అది లేవలేని స్థితిలో బాధతో మూల్గుతూ ఉంది.

కుర్రవాడు దగ్గిరికి వెళ్లి చూచాడు. గుర్రానికి, కడుపు కాల్చేసే ఆకలి తప్పితే వేరేమీ రోగం లేదని తెలుసుకున్నాడు. ఇంక కొంత సేపటికి, ఆహారం ఏమీ దొరక్కపోతే చచ్చిపోయేలా గుంది ఆ గుర్రం.

పిల్లవాడికి ఇది ఒక పెద్ద సంకట పరిస్థితి అయింది. ఈ గుర్రాన్ని ఈ స్థితిలో వదలి వెళ్లడానికి అతని మనస్సు ఒప్పుకోలేదు. దానికి మేత పెడుతూ, నీళ్లు తాగిస్తూ, ఆలస్యంచేశాడంటే తను వెళ్లవలసిన ఊరికి వెళ్లి, తిరిగి చీకటిపడేలోగా తన యింటికి చేరలేడు. అదీగాక ఆ ఎడారిదారిలో దొంగల భయం అమితం; ప్రమాదం కలగవచ్చు. అతడికి ఏమి చేయడానికీ పాలుపోలేదు.

"ఏమైనా సరే, ఈగుర్రం బాధపడుతుంటే నేను చూస్తూ ఊర్కుండలేను; సాయం చేయవలసిందే దీనికి నేనిప్పుడు సాయం చేశానంటే, భగవంతుడు నాకు తప్పక సాయపడుతాడు కష్టాలు గలిగినప్పుడు!" అని నిశ్చయించుకుని, అక్కడా అక్కడా తిరిగి ఇంత పచ్చిగడ్డి తెచ్చి దానిముందు వేసి, ఒక ఆకుదొన్నెలో రెండుమూడు సార్లుగా నీళ్లు తెచ్చి ఆ గుర్రంచే తాగించాడు.

ఈ సహాయంతో గుర్రం ప్రాణం నిలుపుకొంది. కొంచెం తేరుకొని, కొంత ప్రయత్నంమీద లేచి నిల్చొని నడవగలిగింది. చుట్టుపట్ల మేత మేయ సాగింది.

* * *

గుర్రం బతికిందికదా అని సంతోషంతో మళ్లీ నడక సాగించాడు మన మంచి అబ్బాయి. కొంతదూరం వెళ్లేసరికి ఒక మనిషి కనిపించాడు. అతడు ఒక నీటిగుంటలోనుండి, తడుము కుంటూ పైకి రాలేక చాలా బాధపడుతున్నాడు.

"ఏమయ్యా, అలా అవస్థపడుతున్నావ్—రాలేవూ పైకి?" అని అడిగాడు కుర్రడు జాలిగా.

"నాయనా, నేను గుడ్డివాణ్ణి; నా కర్మంకాలి ప్రమాదంవల్ల నే నీ గుంటలో పడ్డాను. పైకెక్కలేకున్నాను. నాకు కాస్త దోవ చూపి దరిచేర్చి దయచూడు తండ్రీ—నీ కెంతేనా పుణ్యముంటుంది" అని ప్రాధేయపడ్డాడు ఆ గుడ్డివాడు.

"అయితే నీ చేతిలోని కర్ర విసిరేయి. దాని సాయంతో లోతు కనుక్కుంటూ నేను గుంటలోకి వచ్చి నిన్ను ఒడ్డుకు చేరుస్తాను."

గుడ్డివాడు నేర్పుగా, శబ్దం వినవచ్చిన తట్టు తన కర్రను విసిరేశాడు. కుర్రవాడు జాగ్రత్తగా అతణ్ణి గుంటలోనుండి గట్టుకు చేర్చాడు. ఈ అడ్డంకులతో కుఱ్ఱవాడికి చాలా పొద్దుపోతోంది. అందువల్ల చాలా వేగంగా పోతున్నాడు.

* * *

కొంత దూరం వెళ్లాడో, లేదో ఒక నావికుడు కనపడ్డాడు. అతడికి రెండు కాళ్లూ లేవు పాపం! చంకకర్రలమీద నడుస్తున్నాడు. అతడు కుర్రవాణ్ణి సమీపించి—

"నాయనా అబ్బాయీ, నేను తల్లి దేశంకోసం ఎన్నో యుద్ధాలు చేశాను. గ్రహచారవశాత్తు ఒక యుద్ధంలో నా రెండుకాళ్లూ తెగిపోయాయి. నేను దిక్కులేని కుంటివాణ్ణి. నా కింత కూడు పెట్టి నా పోయే ప్రాణాన్ని నిలబెట్టి రక్షించు. నీకు దేవుడు మేలు చేస్తాడు" అని వేడుకొన్నాడు.

మన పిల్లవాడు తనదగ్గర మిగిలి వున్న అన్నంఅంతా అతని కిచ్చేస్తూ ఇలా అన్నాడు: "నాదగ్గర ఉన్నదంతా ఇదే. చాలా తక్కువ. చాలీ చాలని అన్నం. కడుపునిండా పెట్టలేనందుకు చాలా విచారిస్తున్నాను."

అని చెప్పి, అక్కడినుండీ పరుగు పరుగున తను వెళ్లవలసిన ఊరికి వెళ్లి, తన పని ముగించుకొని, వెనుదిరిగి వస్తున్నాడు వేగంగా—తన ఇల్లు చేరుకోడానికి.

* * *

తన శక్తినంతా కూడదీసుకొని వేగంగా నడుస్తున్నాడు. ఎంత అవసరపడ్డా నగందూరమైనా వచ్చాడో, లేదో—ఇంతలోనే బాగా చీకటిపడిపోయింది. అతనిగుండెలో రాయి పడింది. ఎంత ప్రయత్నించినా చికట్లో దోవ తెలియడంలేదు. ఆఖరికి ఆ గజిబిజిలో తప్పుదోవ పడ్డాడు. ఆదోవ అతణ్ణి ఒక అరణ్యానికి తీసుకెళ్లింది. ఎంతసేపు ఎంత దూరం తిరిగాడో ఆ భయంకర అడవిలో పాపం మన కుర్రవాడు! పూర్తిగా అలసిపోయాడు. ఆకలి! కడుపు దహించేస్తోంది. ఉన్నదంతా ఒకళ్లకు పెట్టేసి తనప్రాణం మీదికి తెచ్చుకున్నాడు. ఒక్క అడుగైనా ఇక ముందుకు పెట్టలేడు. అక్కడ్నే కూలబడ్డాడు—తన దుస్థితికి దుఃఖిస్తూ.

తన్ను విడవకుండా కూడా వస్తూన్న కుక్క—అది ఎక్కడిదో—ఒక చేతిగుడ్డమూట తెచ్చి ఆ అబ్బాయి ముందు పెట్టింది. కుర్రాడు ఆ మూట విప్పి చూచాడు. అందులో రొట్టె ముక్కలున్నాయి! వాటిని చూచేటప్పటికి ప్రాణం లేచివచ్చింది. అవి తిని దోసెడు నీళ్లు తాగేసరికి కాస్త ప్రాణ ఒచ్చింది.

"అందరూ నీచంగా చూసే ఈ జంతువు—కుక్కకి చేసిన ఉపకారం కూడా వ్యర్థం కాలేదు కదా? ఈ కుక్క నా పోయే ప్రాణం నిలిపింది." అనుకున్నాడు.

* * *

ఆకలిమాత్రం కొంత శాంతించింది గాని, ఆ అడివిలోంచి తప్పించుకొని ప్రాణాల్తో బయట పడడ మెలాగ? శాయశక్తులా ప్రయత్నించాడు—ఫలం శూన్యం! ఆ అడవిలో, ఆ కారు చీకట్లో ముళ్ల చెట్లు వొళ్ళంతా గీచుకున్నాయి. ఫలితం ఒళ్ళంతా రక్త ప్రవాహం.

"ఇక లాభం లేదు. ఇవాళతో నా కథ సరి. ఈ అడవికే నేను అర్పణం ప్రయత్నానికి ఫలం ఉండబోదు." అని నిరాశతో కుప్పకూలిపోయాడు.

అప్పుడే చంద్రుడు ఉదయిస్తున్నాడు. ఆ గుడ్డి వెలుగులో ఏదో ఓ జంతువుమేస్తూన్నట్లు కనబడింది. దగ్గరికి వెళ్ళి చూచాడు. ఇందాక తనవల్ల సహాయం పొందిన గుర్రమే అది! చుట్టాన్ని చూచినంత సంతోషం కలిగింది కుర్రవాడికి.

"ఈ గుర్రం ఈ ప్రాంతాలలో తిరగటానికి అలవాటు పడివుంటుంది. అందుచేత ఇది నన్ను సరియైన దోవకు తీసికెళ్లగలదు. ఇది తనకు చేసిన ఉపకారానికి బదులుగా నన్ను తన వీపుమీద ఎక్కించుకోవచ్చు" అనుకుంటూ అతడు గుర్రందగ్గరకు వెళ్లి, దాని వొళ్లంతా ఓసారి ఎగాదిగా నిమిరి, బుజ్జగిస్తూ దానిమీద కెక్కబోయాడు. ఆ గుర్రం చలించకుండా తన అంగీకారం తెలిపింది—కృతజ్ఞతాసూచకంగా. అతణ్ణి వీపుమీద ఎక్కించుకొని మెల్లగా బయలుదేరింది. ఆ అడివినుండి ఒక బయలు ప్రదేశానికి చేర్చింది ఆతణ్ణి. చేరువులోనే రాజుబాట కనిపిస్తూ వుంది పిల్లవాడు చాలా సంతోషించాడు. 'బతుకు జీవుడా!' అనుకున్నాడు.

"నేనీ గుర్రాన్ని బతికించకపోతే నేను ఇవాళ అడవిలోనే రాత్రంతా ఉండిపోవలసి వచ్చేదిగా? ఎప్పటికీ ఒకళ్లకు—జంతువుకు గాని, మనిషికి గాని—చేసిన మేలు వృధా కాదు గదా?" అని అనుకున్నాడు.

* * * *

కాని, ఇంకా గండం గడవలా. ముందే ఉంది ఉండేదంతా. ఏం ప్రమాదం జరుగనుందో!

కుర్రడు ఒక నిర్జనమైన సందులో వెళుతూండగా, ఎవరో ఇద్దరు మనుష్యులు అమాంతంగా అబ్బాయి మీద పడి, పట్టుకుని, నోరు నొక్కేసి అతడి గుడ్డలు ఉల్చుకోబోతున్నారు.

పిల్లవాడు, పాపం చాల చిక్కులో పడ్డాడు. తనను రక్షించేవా రెవరు? తనేమో చిన్నవాడు. కాని, సరిగ్గా, మంచి సమయానికి కుక్క భలే పని చేసింది. ఒకడి కాలు లంకించుకుని కసిదీర కసుక్కుని కొరికింది—కండ లూడివచ్చేలా. అతడు ఆ బాధకు తట్టుకోలేక, నెత్తీ నోరూ మొత్తుకుంటూ, కోపంతో కుక్కను తరుముకొన్నాడు. ఆ కుక్క పెద్దగా మొరుగుతూ అరుస్తూ గోలచేస్తూ చేతి కందకుండా పరుగెత్తుతోంది.

హఠాత్తుగా ఒక పెద్ద గొంతు వినబడింది— "ఇదుగో! ఆ దొంగ వెధవలు! పట్టుకోండి, పట్టుకోండి! చావచితగ్గొట్టండి!" అని. దీన్ని విని

బ్రాహ్మణుడు - సంజీవి

శ్రీ ఎస్. లక్ష్మీనరసింహాచార్య

అనగా అనగా, ఒక ఊళ్లో ఒక బ్రహ్మణుడు వుండేవాడు. అతనికి సంజీవి సంపాదించాలని కోరిక వుండేది. 'సంజీవి' అంటే, ఏమిటో తెలుసా? 'చచ్చిన వాళ్లను బ్రతికించేది'— అన్నమాట. అయితే, యీ కోరికతో, ఆ బ్రహ్మణుడు సంజీవిని ఏలాగైనా సంపాదిద్దామని,— ఒకనాడు ఆ బ్రహ్మణుడు, తపస్సు చెయ్యడానికి, కాకులు దూరని కారడవుల్లో— చీమలు దూరని చిట్టడవుల్లో ప్రవేశించాడు. మంచి చోటును, ఒక దగ్గర చూచుకొని, అక్కడ యీ బ్రాహ్మడు, పార్వతీ దేవినిగురించి తపస్సు చెయ్యడం ప్రారంభించాడు.

ఏక దీక్షతో యీలా తపస్సు చెయ్యగా చెయ్యగా, అతని చుట్టూ దట్టమైన పుట్టలు పెరిగాయి. అతని జుట్టు పెరిగి, ఆ జుట్టులో,— పావురాలూ, చిలకలూ, గోరింకలూ, బంగారుపిచ్చికలూ గూళ్లు కట్టుకున్నాయి. ఈ విధంగా మరికొన్నాళ్లు తపస్సు చేశాడు ఆ బ్రహ్మణుడు.

ఈ బ్రహ్మణుడి, తపస్సుకు మెచ్చుకొని, పార్వతీ దేవి, ఒకనాడు ప్రత్యక్షమైంది.

"ఓయీ, బ్రాహ్మణుడా! నీ తపస్సుకి మెచ్చాను: నీ కేమిటి కావాలో కోరుకో—" అంది పార్వతీదేవి. అందుకా బ్రహ్మణుడు సాష్టాంగపడి—

"అమ్మా! చాలాకాలంనుంచీ, సంజీవి సంపాదించాలనే కోరికగా వుంది: దయచేసి, ఆ సంజీవిని ప్రసాదించ వలసిందిగా కోరుతున్నాను"— అన్నాడు.

"సరే..."— అని పార్వతీదేవి అక్కడే వున్న ఒక చెట్టుయొక్క పచ్చటి ఆకులు తీసి,— "ఏ ప్రాణి చచ్చినా, దాని ముక్కుదగ్గర యీ ఆకుల రసం పిండితే, అది మళ్ళీ బ్రతుకుతుంది" అని చెప్పి పార్వతీదేవి మాయమయ్యింది.

బ్రాహ్మణుడు సంతోషాన్ని పట్టలేక ఒక గంతు వేశాడు తిన్నగా యింటికి బయలుదేరాడు. ఈ విధంగా ప్రయాణం చేస్తూ వుండగా, ఎక్కువదూరం నడిచివున్న ఆ బ్రహ్మణుడికి దాహం వేసింది. చుట్టూ చూశాడు. అంతా అరణ్యమే! ఎక్కడా నీరున్నట్లు కనిపించలేదు. కొంచెం సేపు ఆలోచించి,— ఎత్తైన చెట్టొకటి ఎక్కి, అప్పుడు చుట్టూ చూచాడు. కొంచెందూరంలో ఒక కొండా, కొండ ప్రక్కన వాగూ కనిపించింది. మన అదృష్టం బాగుందనుకొని, తిన్నగా అక్కడకు వెళ్లాడు. త్రాగవలసినన్ని, త్రాగగల్గినన్ని, నీళ్లు త్రాగివేశాడు.

తిరిగి ప్రయాణమయ్యాడు.

ఇంతలో దారికి అడ్డంగా ఒక పులి పడి వుంది. మన బ్రహ్మణుడి గుండెలు ఒక్కసారిగా దడదడా కొట్టుకున్నాయి. అక్కడే నుంచొని, పులి వైపు తేరిపారచూడ్డం ప్రారంభించాడు. ఎక్కడా, కదలిన జాడ లేదు. మెల్ల, మెల్ల అడుగుల్తో దగ్గరకు వెళ్లాడు. అది చచ్చిన పులి! ధైర్యం చేసి యిటూ—అటూ, కదిపాడు. నిజంగా చచ్చిందే! సందేహం లేదు!!

ఇంతలో బ్రాహ్మణుడికి ఒక ఆలోచన తట్టింది. మొలలో వున్న ఆకులు జ్ఞాపకాని కొచ్చాయి. 'పార్వతీదేవి యిచ్చిన యీ ఆకులవల్ల, చచ్చిన ప్రాణులు బతుకుతాయో? లేదో?' అని తనలో తానే ప్రశ్నించుకొని, తన సందేహం తీర్చుకోవడానికి, తన దగ్గర వున్న పచ్చటి ఆకుల రసం పిండి, ఆ పులి ముక్కు దగ్గర వుంచాడు.

ఏముందీ? "కాండ్రు, కాండ్రు" మంటూ లేచింది ఆ పెద్దపులి. తప్పించుకు పారిపోదామని ప్రయత్నించాడు— కాని, పులి వదులుతుందా? ఆ బ్రాహ్మణుని పట్టుకొని అక్కడే భక్షించింది.

బాలలూ చూచారా! బ్రాహ్మణుని తెలివి!!! బుద్ధిలేని వాళ్లు ఎంతటి మేలు పొందినా,— దానివల్ల వాళ్లకు ఫలితంవుందీ? వాళ్లకే కాదు— ప్రపంచానికైనా ఫలితంవుంటుందా?

రెండో దొంగకూడ హడలిపోయి కాలికి బుద్ధి చెప్పాడు.

'ఎవరా, ఇట్టి ఆపదలో తన్ను కాపాడారు!' అని ఆశ్చర్యంతో నలుమూలలా చూశాడు కుర్రాడు. ఏముంది? గుడ్డివాడి భుజాలమీద కుంటివాడు ప్రత్యక్షం! వీళ్లిద్దరూ ఇంతక్రితం తనవల్ల ఉపకారం పొందిన వాళ్లే. ఆశ్చర్యంతో వాళ్లవంక చూస్తున్నాడు పిల్లవాడు.

"ఎలాగైతే నేం? దేవుడి దయవల్ల నీకు సహాయం చేయగలిగాం. అదే మాకు పదివేలు! నీవు మాకు ప్రొద్దున్న ప్రాణదానం చేశావు. నీకింత మాత్రం ఉపకారం చెయ్య గలిగినందుకు మేము చాలా సంతోషిస్తున్నాం. నే నిందాక పొదమాటున ఉన్నప్పుడు ఈ దోపిడిగాళ్లు రహస్యంగా మాట్లాడుకోటం విన్నాను. వాళ్లు ఒక కుర్రవాణ్ణి దోచుకోడనికి నిర్ణయించుకున్నారు. వాళ్ల మాటల్నిబట్టీ, వాళ్లు చేసిన వర్ణనను బట్టీ దోచుకోదలచుకుంది నిన్నే అని నిశ్చయించుకున్నాను.

"కాని నేను కుంటివాణ్ణి. నే నెలా నిన్ను కాపాడగలను? చాలా విచారపడ్డాను. కాని సమయానికి ఈయన— ఈ సత్పురుషుడు (గుడ్డివాడు) సహాయపడ్డాడు. అతడు తన భజాల మీద నన్నెక్కించుకున్నాడు. నేను దోవ చూపించాను. ఇక్కడికి చేరుకోగలిగాం." అని ఈలా చెప్పాడు కథంతా కుంటివాడు.

కుర్రవాడు వాళ్లు చూపిన కృతజ్ఞతకు చాల సంతోషించి వాళ్లని తన యింటికి తీసికెళ్లి ఆ పూట— రాత్రి కొంచెం పొద్దు పోయినా— మంచి భోజనం పెట్టించి, వాళ్ల శ్రమ పోగొట్టి బాగా మర్యాద చేశాడు. కుర్రవాని కథంతా విని తల్లిదండ్రులు, ఎలాగైతే నేం, కుర్రవాడు తమకు దక్కాడు గదాని సంతోషించారు.

ఆ కుక్క మాత్రం అప్పటికీ ఇప్పటికీ అతణ్ణి విడవకుండా సేవ చేస్తూంది. అతడూ దాన్ని చాలా దయగా చూస్తాడు. 'ఒకళ్లకు మనం మేలు చేస్తే అది ఎప్పటికీ వృధా పోదు. మనకీ తప్పక మేలు చేకూరుతుంది!' అనే మాట అతడు ఈనాటికీ మరవలేదు.



కుమారి జయలక్ష్మి

సంగీతభూషణ సి, వెంకట్రామ శర్మ గారి శిష్యురాలు. సెక్రటారియటులో సూపర్నెంటు కుమార్తె. ఈ మధ్య వాలాజపేటలో సాహిత్య పరిషత్తు వార్షికసభయందు పాటకచ్చేరీ జరిపెను.

బాలగేయం:

నా ప్రయాణం

(రాజమండ్రి నుండి చెన్నపురికి)

శ్రీ యల్. యమ్. సెట్టిబాబు

ఓరు ఓరు రైలుబండి
ఒంటికన్ను రైలుబండి
గోలగోల పెట్టిబండి
గోదావరి బ్రిడ్జి దాటె
కూసికూసి రాత్రివేళ
కృష్ణానది బ్రిడ్జి దాటె
విజిలు వేసినంతలోనె
విజయవాడ దాటిపోయె—
కంటిమీద రెప్ప వాల్చ
కదలిపోయె రైలుబండి
తెల్లవారి చూడగానె
నెల్లూరును దాటిపోయె
కనిపించదు రాజమండ్రి
వినిపించదు బావపిలుపు
లేచి వెదకి చూడగానె
లేదు లే దుయ్యాలతొట్టి—
ఉదయానే లైటువద్ద
చదువుచుండ పుస్తకాలు
చంటి పాప నిచ్చి వెళ్లు
చిన్నిమరద లెందు చూడ
కానరాదు కంటికైన-
పేప రొకటి తిరుగవెయ్య
పిల్లవాని బొమ్మ యొకటి
ముసినవ్వులు నవ్వుచుండ
ముద్దు లిడితి సంతసమున—
పిలువగానె ప్రేమతోడ
పలుకునట్టి గోపాలుడు
ముద్దులొలుకు పలుకులోన
మరిపించెడు చిన్నబావ
కొడుకువలె ప్రేమతోడ
కాంచి మదిని చూచినట్టి
మాతృదేవి మా వదినయు
మెదహా మరి యీ వుదయం
యీ రైలులో కానరారు
ఉదయమునే వీరందరు
పొద్దుపొడుచునంతలోనె
ఒక్కొక్కరు ఒక్కొక్కరు
యెక్కిపోయె బండియొక్క
చక్రములా తిరిగి తిరిగి
శిరసులోన తలపు కొచ్చె—
వెదకినాను బండియంత
వేయిసార్లు కండ్లు తెరచి
చుక్కలుండె యాకాశం
కాని యెందు కానరారు
చందమామ కనిపించదు
చంటిబాల యందు లేదు
సూర్యుడొకడె బయలుదేరె
చుక్కలన్ని దూరమయ్యె
గుప్పుగుప్ రైలుబండి
గుట్టలెన్నొ దాటిపోయె
పొగ నెంతో విడిచిపెట్టి
పోవుచుండె చెన్నపురికి
రైలుబండితలుపు మూసి
రాజమండ్రి మరువాలని
కళ్లు రెండు మూసుకొంటి
కాని మరువలేక పోతి
చేతి నున్న గడియారము
చిన్నబావవోలె నవ్వె
విజ్ఞానము నిచ్చు బుక్కు
వదినవోలె మాటలాడె
పాట వ్రాయు పెన్సి లొకటి
ఆటలాడు గోపివలెను
కనిపించిరి కంటిముందు
కల్లగాదు నిజముగానె
వీరందరు నాదగ్గర
ముందు వెనుక యున్నారని
మది నప్పుడె తలచుచుండ
రయ్యుమనచు రైలుబండి
కుయ్యుమని విజిల్ వేసి
చేరుకొనెను చెన్నపురికి
పోదు వింక బడికి నేను
పొండు మీరుకూడ బడికి.

వెంకటస్వామినాయుడు కమిటీ నివేదిక

(7-వ పేజీ తరువాయి)

అవినాశలింగం చెట్టిగారు, ద్విభాష, బహుభాషా ప్రాంతాలలో పిల్లల మాతృభాష ఏదో ఒక ప్రాంతీయ భాష అయి ఉండుననిరి. అట్టి ప్రాంతములలో దానిని ప్రథమభాషగా అభ్యసింపవచ్చును. అది బోధనభాషగా గూడా ఉండవచ్చును. ప్రాంతీయభాషకు అతీతమైన భాష మాతృభాష గాగల విద్యార్థులు మాతృభాషను రెండోభాషగా అభ్యసించవచ్చునని. 1946 ఏప్రెల్ నుంచి సేలం, ఉత్తరార్కాటు జిల్లాలలో ప్రారంభింపబడిన మూసివేసిన తెనుగుబళ్లు లేవు. చిత్తూరులో 7 సెకండరీ పాఠశాలలు 128 ప్రాథమిక పాఠశాలలు ప్రారంభింపబడెను. 99 తెనుగుబళ్లు మూసివేయబడెను. చెంగల్పట్టులో 6 ప్రాథమిక పాఠశాలలు ప్రారంభింపబడెను. చెన్నపట్నంలో నాల్గు సెకండరీ పాఠశాలలు 2 ప్రాథమిక పాఠశాలలు ప్రారంభించి 1 సెకండరీ పాఠశాల, 2 ప్రాథమిక పాఠశాలలు మూసివేసినారు. మొత్తం 11 తెనుగు సెకండరీ పాఠశాలలు 136 తెనుగు ప్రాథమిక పాఠశాలలు ప్రారంభింప బడెను. ఒక తెనుగు సెకండరీ పాఠశాల 101 ప్రాథమిక పాఠశాలలు మూసివేయబడినవి.

1948 ఏప్రిల్ 28వ తేదీన విద్యాశాఖ డైరెక్టరు చెన్నపట్నంలో తెనుగు బోధనను గూర్చి ఎట్టి నిర్ణయమునూ చేయలేదనిరి. "స్కూళ్ళ ఇన్‌స్పెక్ట్రెస్ చెన్నపట్నంలో ఏ. మేనేజిమెంట్లనుగాని తెలుగును ఎత్తివెయ్యమని కోరలేదు. చెంగల్పట్టుజిల్లాలో తెనుగుకు స్వస్తి చెప్పవలదనియు, తెనుగు విద్యా సౌకర్యముల హెచ్చించవలెననియు కొన్ని రాయబారములు వచ్చినమాట నిజము.

ఇక ద్విభాషా బహుభాషా ప్రాంతాలలోని తెనుగువారు విద్యామంత్రి విద్యావిధానమునకు ఎంతో అసంతృప్తులైనా రన్న సంగతి ఎరుగుదురా అన్న ప్రశ్నకు సమాధానముగా తెనుగు పిల్లలకు విద్యా సౌకర్యములం కొరకైన వని కొందరు రాయబారము వచ్చినారని మంత్రిగారంగీకరించిరి. ప్రభుత్వమువారు దానిని విచారించుటకు ఒక కమిటీని వేసినారనియు, అది ప్రభుత్వమువారి ఆలోచనలో ఉన్నదనియు గూడా విద్యామంత్రిగారు సమాధానమిచ్చిరి.

శ్రీమతి అమ్మన్న రాజా. చెన్నపట్నంలో పెట్టిన బి. టి. కోర్సు మోడల్ స్కూళ్లలో బోధనభాష తమిళమే పెట్టి తమిళేతరులకు స్థానము లేకుండా చేసిన సంగతి మంత్రిగారెరుగుదురా?

స: ఇతరులుగూడా ఉన్నా రనుకుంటాను. తెనుగువారికి రాజమహేంద్రవరంలో ట్రెయినింగ్ స్కూలు ఉన్నది. అయినా సరియైన సమాధానము చెప్పుటకు వ్యవధి అవసరం.

శ్రీ దినుమర్తి రామస్వామి. చిత్తూరు జిల్లాలో 128 ప్రాథమిక పాఠశాలలు 99 మూసివేసినా రంటే 100-కి 80 తెనుగు పాఠశాలలు మూసివేయుటకు కారణ మేమి?

స: సమాధానమునకు వ్యవధి కావలెను.

శ్రీ కాశేశ్వరరావు · తమిళదేశమందలి ఆంధ్రులు తమిళమే ప్రాంతీయభాషగా పరిగణించవలెనని నేను అంగీకరింతును గాని, తెనుగు చదువుకుంటా మనేవా రధికసంఖ్యాకులుగా ఉండి పాఠశాలలు కావలెనని కోరినచో కొన్ని తరగతులవరకైననూ తెనుగు పాఠశాలలు ఏర్పాటు చేయుట ప్రభుత్వధర్మము గాదు.

స: ప్రాథమిక పాఠశాలల్లో బోధనా భాషకుగా మాతృభాషయే అనుమతింపబడినది.

శ్రీ జి. రాజమన్నార్ చెట్టి అనేకమార్లు విద్యామంత్రి చెన్నపట్నంలో ఏ ఒక్కటీ ప్రాంతీయభాష గా దంటూ వచ్చారు. అయినా ఈ విద్యామంత్రిగారు అధికారమున వెలసిన నాటినుంచి తెనుగు బాలబాలురకు విద్యాసౌకర్యములు క్రమేణ ఎందుకు హ్రస్వమైనవి?

స: 16 ప్రాథమిక పాఠశాలలో తెనుగు చెప్పే మేస్టర్లు ఉన్నా తెనుగు చదువుకొనే కుర్రవాళ్లు లేనేలేరు.

సలాంగారు: రాజమండ్రిలో తెనుగు వాళ్ళకు ట్రెయినింగు స్కూలు ఉన్నదని మంత్రిగారు అనడంలో చెన్నపట్నంలో తెనుగువాళ్ళకు స్థానం లేదని గుండెమీద చేతులు వేసుకొని స్ఫురింపచేయడమేనా?

స గౌరవసభ్యుని అభిప్రాయము సరి గాదు.

శ్రీ నాగప్ప. చెన్నపట్నంలోనూ, ద్విభాషా ప్రాంతాలలోను, అన్ని ప్రాథమిక పాఠశాలలలోనూ, ఉన్నతపాఠశాలలలోనూ, తెనుగులో విద్యాబోధ ఉండేట్టు మంత్రిగారు చేస్తారా?

స: వెంకటస్వామినాయుడు కమిటీ నివేదికకు మనం వేచిఉందాము.

ఎల్. సి. పయస్‌గారు: అయితే క్రయిస్తవులకు మాతృభాష ఏదని నిర్ధారించారు.

స: అయితే కొంకణవారిదీ ఇంకా ఇతరులదీ ఏమో నిర్ధారణ చెయ్యవలసి ఉంటుంది.

శ్రీమతి కుట్టిఅమ్మాళ్ అమ్మ· చెన్నపట్నంలో తెనుగు, తమిళాలేగాక కన్నడ మళయాళాలు ఎందుకు బోధించరాదు?

స చెన్నపట్నంలో తగినంతమంది తెనుగు, మళయాళం, కన్నడం పిల్లలు ఉన్నట్లయితే ఆయా తరగతులు ఏర్పాటు చేస్తూనే ఉన్నారు.

శ్రీ అల్లూరి : వెంకటస్వామినాయుడు కమిటీ ఎప్పుడు వేశారు? వారు నివేదిక ఇచ్చారా? లేకపోతే ఎప్పుడు ఇస్తారు? వారి సలహాలను అమలు చేస్తారా?

స వారి నివేదిక సమర్పించబడినదని ఇదివరకే చెప్పి ఉన్నాను. కమిటీ సిఫార్సులు గూడా సభ్యులకు అందజేసినట్లు అనుకుంటాను.

శ్రీ ఎస్. ఎస్. వరదాచారి ఇల్లా ఏదో ఒకభాష చిన్నపిల్లల నెత్తిన రుద్దుటంకన్నా ఆ బాలబాలికలకు ఇచ్ఛానుసారం పాఠశాలలలో ఆయా భాషలం దభ్యసింప ఏర్పాటు చెయ్యడం శ్రేయస్కరం గాదా?

స: అచ్చంగా అదే మేం చేసింది.

శ్రీ టి. ఎస్. పట్టాభిరామయ్య హోసూరు తాలూకా విద్యాసౌకర్యా లడగటంలో ఆంధ్ర రాష్ట్రంలో చేర్చటాని కిది ప్రథమ యత్నమా?

శ్రీ బేగం అమీరుద్దీన్: ద్విభాషా ప్రాంతాల్లోను, చెన్నపట్నంలోనూ విద్యాబోధన ఏవిధంగా ఉండాలో కేంద్రప్రభుత్వంవారు చేసిన తీర్మానాన్ని రాష్ట్రప్రభుత్వం అమలు జరుపుతుందా?

స: కేంద్రప్రభుత్వతీర్మానాన్ని అంగీకరించాము.

అన్వర్ సాహెబ్ రాజమండ్రిలో తెనుగు ఉపాధ్యాయులకు, సైదాపేటలో తమిళ ఉపాధ్యాయులకు శిక్షణ యివ్వబడుచున్నదని మంత్రిగారి అభిప్రాయమా?

స: అదే కాదు. సైదాపేటలో కన్నడ, మళయాళ ఉపాధ్యాయులకుకూడా శిక్షణ యివ్వబడుతుంది.

ఎల్. ఎస్. గోపాలస్వామి : ఆంధ్రదేశంలో వున్న తమిళులకు మళయాళీలకు విద్యాసౌకర్యములు లేవు గదా? వారికి చదువుకొనే అవకాశాలు లేవు గదా?

స: ఈ ఉపప్రశ్నకు ఆస్కారం లేదు.

శ్రీ నాగప్ప· శ్రీ వెంకటస్వామినాయుడు కమిటీ నివేదిక అమలు చేస్తామని మంత్రిగారు దయతో హామీ యివ్వగలరా?

స: ఆ సిఫార్సు లేమో ఆలోచించవలసి యున్నది.

శ్రీ కన్నప్పర్ · (తమిళంలో) చెన్నపట్నంలో ఉన్న సౌరాష్ట్ర బాలబాలురకు సౌరాష్ట్రభాషలో విద్యాభ్యాససౌకర్యాలు కలుగచేస్తారా?

ప్ర: వేరే ప్రశ్న వెయ్యండి.

శ్రీమణేశర్: భారతాఖండితను ప్రవచించే కాంగ్రెసువాదులు మాతృభాషపై అంతగ నొక్కినొక్కి చెప్పినచో భారతైక్యతకే భంగము కాదా?

జనాబ్ హుస్సేన్: మాతృభాష ను గూర్చి ఆకాశవాణీద్వారా ఉద్ఘాటించిన విద్యామంత్రి మాతృభాషద్వారా విద్యాసౌకర్యముల వృద్ధి చేయుటకు యేమి చేసినారు?

సమాధానం లేదు.

సలాంగారు: చిత్తూరులో 99 తెనుగుపాఠశాలలు ఎత్తివేయడంలో మంత్రిగారి వ్యాఖ్యానం ఏమిటి?

స వేరే ప్రశ్న వేస్తే చెబుతాను.

శ్రీ రాజమన్నారు చెట్టి ఆంధ్రరాష్ట్రానికి చెన్నపట్నంలో ఉండే తెనుగువాళ్లకు సంబంధం లేదని చెన్నపట్నం తెనుగువాళ్లు చెబుతూన్నా గూడా చెన్నపట్నంలో తెనుగువాళ్ళ విద్యాసౌకర్యాలు తగ్గించకుండా హెచ్చించడానికి మంత్రిగారు దయ చూపుతారా?

స చెన్నపట్నంలో ఉండే అన్ని శాఖలవారికి, కులాలవారికి విద్యగరపడమే విద్యా సౌకర్యాలు కలుగచెయ్యడమే ప్రభుత్వమతం.

రజాఖాన్‌గారు ఈ ప్రశ్నపై ఇన్ని ప్రశ్నోపప్రశ్నలు రావడం మంత్రిగారు అనుసరించే విధానంయెడ పలువురు సభ్యుల సమ్మతి తెలుపబడుచున్నదో, అసంతృప్తి తెలుపబడుచున్నదో మంత్రిగారు గ్రహించలేదా?

సమాధానం లేదు.

ఆర్. వి. స్వామినాథన్ : చెన్నపట్టణాన్ని ఆంధ్రరాష్ట్రంలోకి తీసుకుపోతామనేవా రుంటుండగా తెనుగు విద్యా సౌకర్యాలు సున్నచుట్టడంలో ప్రమాదం ఏమి?

సమాధానం లేదు.

మార్చి 22-వ తేదీ శాసనసభలో

బి. ఎస్. మూర్తి గారి ప్రశ్నకు సమాధానముగా నేడు అసెంబ్లీ సమావేశంలో విద్యామంత్రి అవినాశలింగం చెట్టిగారు చెన్నపట్నములో తెనుగువారి విద్యాసౌకర్యాల విచారణ చేయుటకు నియమింపబడిన వెంకటస్వామి నాయుడు కమిటీ విచారణ ముగించిరనియు, వారి నివేదిక 16-9-1948 వ తేదీన ప్రభుత్వమునకు అందచేయబడె ననియు చెప్పిరి. వారి సిఫార్సులు సభ్యుల నిమిత్తం నేడు బల్లలపై ఉంచినారనిరి.

ప్రభుత్వమువారు ఆ నివేదికను విద్యాశాఖా డైరెక్టరుఅభిప్రాయమునకు పంపినారనియు, అది వచ్చినవెంటనే ఆలోచింతురనియు, విద్యామంత్రి చెప్పిరి.

శ్రీ బి. ఎస్. మూర్తి·-ఈ సిఫార్సులు చాలా దీర్ఘముగా ఉన్నవి. సభ్యులు జాగ్రత్తగా పరిశీలించి ప్రశ్న లడుగుటకు వ్యవధి కావలెను. కనుక రేపు ఉపప్రశ్నలకు అవకాశ మివ్వవలెనని కోరుచున్నాను.

విద్యామంత్రి:-ఇప్పుడీ ప్రశ్నోపప్రశ్నలవల్ల అంత ప్రయోజనము ఉండగలదని నేననుకొనను. నివేదికపై విద్యాశాఖా డైరక్టరు అభిప్రాయములు రావలెను. అప్పుడుగాని సరియైన అవసరము లేవో చెప్పజాలము. నివేదిక వారి దగ్గిర నుంచి వచ్చినమీదట తెనుగువారి విద్యావసరాలను ఎంతో సానుభూతితో విచారించగలము. వారి అభిప్రాయము మాకు చేరిన తర్వాత ఎవ రెన్ని ప్రశ్నలు వేసినను ఆ ప్రశ్న పరంపరల కన్నిటికీ సమాధాన మివ్వగల స్థితిలో ఉండును. బి.ఎస్. మూర్తిగారు ఇది ప్రధానవిషయ మైనందున రేపటివరకు వ్యవధి అడిగిరి.

స్పీకరు ఈ ప్రశ్న పై ఉపప్రశ్నలు వేయుటకు రేపటికి వ్యవధి నిచ్చిరి.

మార్చి 23-వ తేదీ శాసనసభలో

నేడు విద్యామంత్రి అవినాశలింగం చెట్టిగారు అసెంబ్లిలో తెనుగు బిడ్డల విద్యాస్థితినిగూర్చి తప్పు సమాధానాలు ఇస్తున్నారనీ, సరియైన సమాధానాలు ఇచ్చేట్టు చెయ్యవలసిం దనీ నాగప్పగారు స్పీకరును వేడుకున్నారు. మంత్రిగారు సరియైన సమాధానాలు చెబుతున్నారో లేదో తమకు తెలియదనీ, తా మీ సందర్భంలో ఏమీ చెయ్యలేమనీ స్పీకరు శివషణ్ముగంపిళ్లెగారు చెప్పిరి.

మద్రాసు ప్రభుత్వ విద్యాశాఖామంత్రి అవినాశలింగం చెట్టిగారు వెంకటస్వామినాయుడు కమిటీ విచారణ సంఘనివేదిక తమకు తెలిసినంతవరకు ఏకగ్రీవమైన నివేదిక అనియు, విద్యాశాఖా డైరెక్టరు అభిప్రాయములు వచ్చినంతనే అవసరమని తోచిన సిఫార్సులపై చర్య గైకొందుమనియు, ఎగ్మూరు ప్రెసిడెన్సీ గరల్స్ హైస్కూలులో తెలుగు ఎత్తివేసినా రంటే అది తమకు తెలియదనియు, బహుశః అది సహాయ పాఠశాలఅయివుండ వచ్చుననియు వెంకటస్వామి నాయుడు విచారణ సంఘ సిఫార్సులనుగూర్చి బి. ఎస్. మూర్తిగారి ప్రశ్న సందర్భమున మద్రాసు అసెంబ్లీలో నేడు వచ్చిన ప్రశ్నపరంపరకు సమాధానముగా చెప్పిరి

నేడు సభ ప్రారంభ మగుటతోడనే నిన్న నుసభ్యులకు అందజేసిన సిఫార్సులపై ఉపప్రశ్నలడుగవచ్చు నని స్పీకరు చెప్పిరి.

శ్రీ బి. ఎస్. మూర్తి:— చెన్నపట్నంలో 100 కి 75 పాఠశాలల్లో తెనుగువారికి విద్యా సౌకర్యాలు లేవని తెలిసియుగూడా అట్టి సౌకర్యములు కల్గించుటకు ప్రభుత్వము ఎందుకు చర్య తీసుకొనలేదు?

స.—చర్య తీసుకొనుటకే కమిటీ నియమింపబడినది. విద్యాశాఖా డైరెక్టరుఅభిప్రాయము వచ్చినంతనే ప్రభుత్వము ఆ నివేదిక సిఫార్సుల చాలా జాగ్రత్తగా పరిశీలించగలదు. అప్పుడు అవసరమని తోచిన సిఫార్సులను అమలుజరుపగలదు.

శ్రీ నాగప్ప —మంత్రిగారు సభ్యుల కందచేసినవరకేనా నివేదికా? ఇంకా వేరె నివేదిక ఏమైనా ఉన్నదా?

స:—అదొక్కటే నివేదిక!

అన్వర్ గారు:—చెన్నపట్నంలో బాలికలకు తెలుగు విద్యాబోధన చేసి రెండు తెలుగు ఉన్నత పాఠశాలలు పెట్టవలసిం దని కమిటీవారు చేసే సూచనలు చూస్తే, చెన్నపట్నాన్ని రెండుగా విభజించడానికి నర్మగర్భంగా వారు వేసిన పాచిక అని చెప్పవచ్చునా?

స.—అట్టి దురుద్దేశము వారికి లేదు. తెలుగు పిల్లల అవసరముల తీర్చటానికి సహృదయతతో చేసిన సూచనలే అని నా అభిప్రాయము.

శ్రీ రొక్కం రామమూర్తి —చెన్నపట్నంలో స్కూళ్ళ మేనేజర్లకు వరసగా తెలుగుతరగతుల ఎత్తివేయవలసిందిగా విద్యామంత్రిగారు మూజువాణీ ఉత్తర్వులు ఇచ్చినారా?

స:—ఈ సభలో అనేకమార్లు ఆ ఆరోపణలను నేను కాదన్నాను.

శ్రీ నాగప్ప —తెలుగు బాల బాలికల విద్యా సందర్భమున ఇప్పటి స్థితి ఏమి? తెలుగుబోధన ఇకనైనా చెప్తారా?

స:-ఇక్కడిపాఠశాలల్లో తెనుగు గూడ బోధనభాషగా అనుమతిస్తామని నేను స్పష్టంగా చెప్పితిని. అంతేగాదు. కన్నడం, మళయాళం మాతృభాషగాగల వారికి చాల బాలురకుగూడ చెబుతామన్నాము.

శ్రీ తెన్నేటి విశ్వనాథం :— విద్యా మంత్రి విచారణ సంఘ నివేదికను యావత్తూ సభ్యులకు బల్లలపై ఉంచుతారా?

ఒకరు .—చర్చగూడ చేయనిచ్చెదరా?

స ·—అది చాలా దీర్ఘ నివేదిక. సభ్యులకు తెలియడానికిగాను లైబ్రరీలో ఒక కాపీ ఉంచుతాను.

హమీద్ ఖాన్‌గారు -వివిధ మాతృభాషలు గలవారికి 8 వ తరగతివరకూ వారివారి మాతృభాషలో విద్యాబోధనకు ఏర్పాటులు జరిగిన మాట వాస్తవమా?

స —8వ తరగతివరకే పరిమితము కాలేదు. ఇది నగరమైనందువల్ల హైస్కూళ్లలో గూడా తగినంతమంది పిల్లకాయ లున్నచో తెలుగులో పాఠములు చెప్పుటకు ఏర్పాటులు ఇప్పుడు జరుగుచున్నవి.

బేగం అమీరుద్దీన్ — మగ పిల్లలకన్న ఆడపిల్లలు బళ్లు లేక బాధపడుచున్నందున ఈ నివేదికలో కనీసం ఆడపిల్లలకు రెండు హైస్కూళ్లు వెంటనే ప్రారంభిస్తారా?

స: గౌరవసభ్యురాలి అభిప్రాయమును హర్షింతును.

శ్రీ నాగప్ప హర్షిస్తే చాలదు, ఆపని చేస్తారా? అని అడుగుతున్నాను.

శ్రీ ఎల్. ఎస్. గోపాలస్వామి: చెన్నపట్నంలో హిందూస్తానీ గుజరాతీ కుటుంబాలు ఉన్నందున ఆ రెండు భాషల్లోగూడా పాఠాలు చెప్పించటానికి ఏర్పాట్లు చేస్తారా?

స: ఆ ఏర్పాట్లు కొన్ని చోట్ల ఉన్నవి. క్రిస్టియన్ కాలేజి హైస్కూలులో ఉత్తరాది బాలురకు ఆ సౌకర్యము ఉన్నది.

శ్రీ బి. ఎస్. మూర్తి: తమిళంలో అనేకమంది తెలుగు పిల్లలు పాఠాలు చదువుతున్నారని కమిటీవారు తెలుపుతున్నారు. విద్యాశాఖా డైరెక్టరు నివేదిక వచ్చేలోపున ఈ వ్యవహారం ఎక్కడ జరుగుతోందో ప్రభుత్వంవారు విచారిస్తారా?

స ఏమి చెయ్యడానికి గాని ప్రభుత్వానికి విద్యాశాఖడైరెక్టరు నివేదిక రావలసిందే.

శ్రీ దిగుమర్తి రామస్వామి :- విచారణసంఘ నివేదిక ఏకగ్రీవమైనదా? లేక ఎవరైనా భిన్నాభిప్రాయము వ్రాసినారా?

స:-నాకు తెలిసినంతవరకు నివేదిక ఏకగ్రీవమే.

శ్రీ జి. రాజమన్నార్ చెట్టి:- అనేకమంది హరిజనబాలురు; వారు అధికసంఖ్యాకులుగా ఉన్నచోట్ల తెనుగుబళ్ళు, తరగతులు లేక బాధపడుతూండగా వారిని తమిళంలో పాఠాలు చదువుకోవలసిందిగా బలవంతంచేస్తున్న సంగతి మంత్రిగారు చిత్తగించారా?

స.-ఇంతవరకు నేను చెప్పగలను. ఐతే డాక్యుమెంట్లు నాదగ్గర లేనందున ఈ లెఖ్ఖలు సవరించుకోవలసి రావచ్చు నేమో. 56 ప్రాథమిక పాఠశాలలలో తెనుగు ఉపాధ్యాయులను పెట్టినారు. 16 స్కూళ్లల్లో తెనుగు ఉపాధ్యాయులను పెట్టినా తెనుగుపిల్లవాడు ఒక్కడు గూడా వచ్చినాడు కాదు.

శ్రీ తెన్నేటి విశ్వనాథం: పిల్లలు రాకపోవడం మేష్టర్లు లేక కాదా?

స: తెలుగు ఉపాధ్యాయులను పెట్టినా ఒక్క తెలుగు కుర్రాడూ రాలేదని నేను చెబుతున్నాను.

శ్రీ బ్రహ్మానందరెడ్డి ఎగ్మూరు ప్రెసిడెన్సీ గరల్స్ హైస్కూలు (గవర్నమెంటు)లో నుండి తెలుగు ఉపాధ్యాయురాలిని పంపించి వేసినమీదట ఆ పాఠశాలలో తెనుగుతరగతులు ఎత్తివేసినమాట నిజమేనా?

స: నాకు తెలియదు. అది సహాయ పాఠశాలన్నా, ఏమన్నా ఏమో!

హమీద్‌ఖాన్ ఒక పాఠశాలలో ఒక్కడే తెనుగు ఉపాధ్యాయుణ్ణి పెట్టి, మిగతవారంతా తమిళ ఉపాధ్యాయులైనందువల్ల ఆ పిల్లలు చాలా కష్టపడుతున్న మాట తెలియునా?

స: అది వివరముగా విచారించవలసిన విషయం.

శ్రీ నాగప్ప: మంత్రిగారు తప్పు సమాధానాలు ఇస్తూన్నందున సరియైన సమాధానాలు ఇవ్వనందున, వారు అసలు విషయాలను చెప్పేట్టు అధ్యక్షులు సభ్యులకు తోడ్పడతారా?

స్పీకరు :- మంత్రిగారు తప్పు సమాధానాలిస్తున్నారో సరియైనవి ఇస్తున్నారో 'నాకు తెలియదు' ఈ సందర్భంలో నేనేమీ చెయ్యలేను.

బి. ఎస్. మూర్తిగారు :- తెలుగుపిల్లలు లేనిచోట్ల తెలుగు ఉపాధ్యాయులను పెట్టి పిల్లలు లేరని సాకు చెప్పడమూ, పిల్లలు ఉన్నచోట్ల ఉపాధ్యాయులను పెట్టకుండా చెయ్యడమూ, జరుగుతూన్న కథ ఇది అని మంత్రిగారు తెలిపిన సమాధానాన్ని బట్టే చెప్పవచ్చునా?

స: నేను ఆ ప్రశ్నకు సమాధానం చెప్పలేను. కార్పొరేషనుక్రింద కొన్ని పాఠశాలలు ఉన్నవి. మిగతావి సహాయపాఠశాలలు. సహాయపాఠశాలల సందర్భంలో ఏమి చెయ్యడమో నాకు పాలుపోకున్నది. అందునిమిత్తమే ఈ కమిటీని వేశాము. దానిపై విద్యాశాఖడైరెక్టరు అభిప్రాయం వచ్చాక అవసరమైన సిఫార్సులపై చర్య తీసుకుంటాము.

నిరవాకాలు

(11 వ పేజీ తరువాయి)

"యెందుకురా, అలా వెర్రెత్తిపోతావ్! నువ్వు అనేదానికీ దీనికీ యేమాత్రం తేడా? అర్ధరూపాయేనా? నెలకు అదనంగా యింకో అయిదు రూపాయలు యెక్కువౌతుంది! అంతే! ఆరు మాసాల్లో ఎలాగా తీర్చేస్తాం. మహా అయితే ముప్పై రూపాయలే కదా? ఆడపిల్లకు ఆ మాత్రం ఆశకూడా లేకపోతే యెలారా?"

సెట్టి ఈ సత్యాన్ని కాదనలేకపోయాడు. అక్కడకూ అక్కసు భరించలేక "నీ! ఆశ పోతులంజ!" అంటూ కేండ్రించి "తూ!" అంటూ దూరంగా ఉమ్మి ఊరుకున్నాడు.

అయితే ఈ వ్యవహారంలో ఓ చిన్న పొరపాటు జరిగింది. భగవల్లీలలగురించి ఇంత చదువుకున్నా పంతులుగారు ఒక చిన్న ప్రాథమిక సూత్రాన్నే మరిచిపోయినట్టుంది. తాను ఒకటి తలుస్తే దైవం యింకొకటి తలుస్తాట్ట. ఈ ప్రాథమిక సూత్రాన్ని మరిచిపోయిన పొరపాటుకే పంతులు రెండువేల రూపాయలు జరీమానా చెల్లించాడు.

ఆరుమాసాలనాడు తీర్చేయవచ్చు ననుకుంటూ చేసిన అప్పు-తీరా తీర్చవలసివచ్చేసరికి ఆరు సంవత్సరాలు పట్టింది.

వచ్చిన చిక్కేమంటే పంతులు మెత్తదనం చూసి ఋణగృహీతలు ఒంటికాలున నడవసాగారు. గురువుశెట్టి వాళ్లను ఒక్కొక్కళ్లనే భయపెట్టీ, భంగపెట్టీ, పంతులుని పట్నం తీసుకువెళ్లీ, రిజస్టరునోటీసు లిప్పించీ, వాళ్లు అప్పంతా తీర్చలేమంటే పంతులుతో చెప్పి వడ్డీలూ అవీ కొంతవరకూ మాఫీచేయించీ ఆరేళ్లనాటికిగాని వ్యవహారాలన్నీ సొక్తుపరచలేకపోయాడు. అప్పటికైనా భార్యవ్యవహారంమాత్రం అతడికి సాధ్యమయ్యింది కాదు.

ఆరేళ్లలోనూ వడ్డీ ఒక్కనాడుకూడా చెల్లుపెట్టబడకపోవడంవల్లనైతేనేం మూడేళ్లనాడు పద్దు త్రిప్పి వ్రాయడంలో మొత్తానికి వ్రాయబడడంవల్లనైతేనేం వెయ్యి రూపాయల అప్పు మూడువేలకు పెరిగింది.

వడ్డ కొంత మాఫీచెయ్యడం ధర్మమంటూ శెట్టి పెళ్లాన్ని ఎంతో బలవంతపెట్టాడు. కాని ఆమె విందికాదు. చివరకు శెట్టికి బాగా కోపం వచ్చి అరిచాడు:

"ఆ బాపనయ్య గొంతుకు అడ్డంగా కోదామనుకుంటున్నావా రాకాసిముండా!-" అంటూ పంతులువంక తిరిగి "యిదుగో పంతులూ! దీనికి ఒక్కదమ్మిడీ శెల్లు బెట్టకయ్యా! దీని యబ్బ యెవరొచ్చి వసూ లేస్తాడో చూస్తాను."

—అంటూ పెళ్లాంతో కత్తికట్టి నిలబడ్డాడు. కాని యింతచేసినా లాభం లేకపోయింది. ఆమె పెరటిదారిన పంతులుయింటికి వెళ్లి "ఆడపిల్లను! యిది తగునా అన్నయ్యా!" అంటూ రెండు మూడుసార్లు ముక్కుగబీల్చేసరికి మరునాడే పంతులు అణా పైసలతో సహా అంతా కక్కేశాడు.

ఏతావతా చెప్పవచ్చేదేమంటే - ఆరేళ్లనాడు అంతా లెఖ్ఖచూసుకుంటే స్థిరాస్తి విడిచి మిగిలిన చరాస్తిఅంతా హరించుకుపోయింది. ఒక్కదమ్మిడీ మిగల్లేదు.

భూములవల్ల సాలీనా గరిశన్నర ధాన్యం అంబారం నూటయాభై రూపాయలవరకూ శిస్తులూ వచ్చేవి. కాని పంతులువారి కుటుంబ ఖర్చు యివికాక యింకే నాలుగువందలపైన అయ్యేది.

అంత కర్చు ఏల అయ్యేదీ అంటే అయ్యేదీ! పంతులుగార్కి పుష్టికరమైన ఆవులును ఇంటి ముందు ఉంచటం సరదా. అందుచేత ప్రతి యేడాది ఓ ఆవును కొనేవారు. అతనికి చిన్నప్పణ్ణుంచీ ఆవులను కొనటం అలవాటులేదు. ఎవరో కొనిపెట్టేవారు. ఒకటే నూరు రూపాయలకు తక్కువకు లభించేదికాదు. పాడి అయిపోయాక అమ్మటం కూడా ఎవరో పున్నెం కట్టుకునేవారు. ఒకటో యాభై రూపాయలకు ఎక్కువకు అమ్ముడు పోయేదికాదు. కాగా వచ్చిపోయే అతిథి అభ్యాగతులకూ లోటు వుండేది కాదు. ఊర్లోకి ఎవరు వచ్చినా పంతులుయింటికే కబురు. తర్వాత పెద్ద ఖర్చు పంతులుగారి భార్య; నాలుగుపురుళ్లు తర్వాత ఆమె సుస్తీ మనిషి అయిపోయింది. అందులోనే కానుపులు—బలానికి మందులు! నక్షత్ర శాంతులు! దానాలు! ధర్మాలు!

యింక పంతులుగారు చూస్తే ఒక్క పుణ్య సంపాదనా, కీర్తిసంపాదనా తప్పిస్తే యింకే విధమైన సంపాదనకూ తలపడేవారు కారు.

యేమైతేనేం యీ పద్ధతి ఆదాయవ్యయాలవల్లా శెట్టి — కాదు శెట్టిభార్య ఋణంవల్లా - చివరకు చరాస్తి సున్నాకుసున్నా, హళ్లీకి హళ్లీ అయింది. అక్కడితో పంతులుగారి ధోరణి మారిపోయింది. ఆబాల్యస్నేహితుల స్నేహాన్ని చూడలేనివారి మాటలు ఏవో తలకెక్కాయి కాబోలు; లేక తన దారిద్ర్యం శెట్టి అభివృద్ధీ రెండూ చూసి అసూయే పుట్టిందో స్నేహితునితో పోట్లాడి మాటలు మానేశారు.

ఆతర్వాత కొంతకాలంకు పరప్రేరణంవల్లో ఈ యిహలోకసాగరాన్ని ఈదటానికి తుచ్ఛధనార్జన చేయక విధి లేదనే సత్యాన్ని అంగీకరించాడు. అర్జనోపాధులు వెతగ్గా వర్తకం తగిలింది. కాని మొట్టమొదటిసారే మొగ్గలెయ్యకుండా నడవగల్గిన పసిబిడ్డనుగూర్చి ఈ కలికాలంలోకూడా యెక్కడా వినలేదు.

పంతులు భూమిమీద అప్పుచేసి వేరుశెనగవర్తకం ఎలావుంటుందో మచ్చుచూశారు. అదృష్టవశాత్తు మచ్చుమాగానే తెలిసింది. ఒక్క రెండు వందలరూపాయలనష్టంతోనే ఒడ్డెక్కింది. చేయి కాలిన బిడ్డడిలా మరెప్పుడూ వర్తకం జోలికి పోలేరు.

అయితే యీ ప్రయోగంవల్ల యింకో సత్ఫలితం కూడాను. రెండేళ్లదాకా డబ్బుకోసరం తడుముకోవలసిన అవసరం లేకపోయింది. వర్తకం కోసరం చేసిన అప్పు వర్తకం ఆపివేసినా దానిని తీర్చలేదు.

మూడవ ఏటి అంతాన ఋణగృహీత దావా తెస్తానంటే మూడెకరాలమెట్టు అమ్మి అసలు వృద్ధులక్రింద పదిహేనువందలు వాడికి చెల్లించి మిగతా పెబ్బుతో మరోసంవత్సరం నరమెల్లిగా వెళ్లబుచ్చారు.

ఇదంతా చూసి యెవరైనా "ఏం పంతులుగారూ! భూము లున్నాయి కదా, వ్యవసాయం పెట్టరాదా?" అంటే..

"......పెట్టినదినములలోపల నట్టడవులకైన వచ్చు నానార్థములున్‌........."

విన్నవాడు పద్యభావంయొక్క సత్యాసత్యాలను గ్రహించినా గ్రహించకపోయినా పంతులుగారి కంఠంలో ధ్వనించే నైరాశ్యానికి కరిగిపోతాడు. కాని తనను కదలించిన ప్రమేయాన్ని గుర్తించేవిజ్ఞానం లేక అదంతా కంఠంలో గొప్పదనమే నని పొగుడుతారు. పంతులుగారు ఈ ఊరటతో అంతా మరిచిపోతారు.

కాగా పంతులుగారి యిష్టదైవమైన నారాయణమూర్తి తన భక్తుణ్ణి సిరినించి వంచించినా సంపదనుంచి మాత్రం వంచించలేదు. పదమూడేళ్లలో ఎనమండుగురు పిల్లలను ప్రసాదించాడు. అందులో ఆరుగురు శ్రీమహాలక్ష్మిసమానరాండ్రు.

ఆపిల్లలు చిరిగి బాగా మాసిపోయిన బట్టలు కట్టుకొని తిరుగుతున్నప్పుడూ, శీతాకాలంలోయే చిరుగుల దుప్పటి కోసరమో నలుగురూ కొట్లాడుకునేటప్పుడూ, ఆపిల్లలు తమకు యివి కావాలనీ అవి చాలవనీ ఏడ్చేటప్పుడూ, ముఖ్యంగా ఆ ఆడపిల్లలను చూచేటప్పుడూ మాత్రం ఒక్కొక్కసారి గుండె బెజారెత్తుతుంటుంది. నాగరికత పల్లెలకు కూడా బాగా వ్యాపించిపోయిన ఈ నవభారతంలో - అందులో అగ్రవర్ణులమని నేటికీ బోరలు విరుచుకొనే బ్రాహ్మణ్యంలో - ఆడపిల్లను కనుక్కున్న తండ్రిపాట్లను, యిహలోకదృష్టి తక్కువైన పంతులుగారుకూడా గుర్తించారు.

ఎప్పుడైనా భవిష్యత్తు మనఃపథాన చోటు చేసుకొని బయటకు వస్తే ఒక్కోసారి "......రాతిలో మండూకంబే క్రియ బ్రతుకుచుండున్‌......"అంటూ కడ్డాదివారి పిప్పరమెంటో లేక బమ్మెరవారి యింకొక మందారమకరందమో త్రోసి దుఃఖాన్ని మరిచిపోతారు. యింకో అప్పుడుమాత్రం వీసమెత్తు కారణమైనా అవసరం లేకుండానే పెళ్లాన్ని తిట్టిపోయడమో, యింకా మతి తప్పితే ఒళ్లు హూనం చెయ్యడమో జరుగుతుంటుంది.

ఈ రెండో పద్ధతి అవలంబించేటప్పుడు మాత్రం అది కాస్తా అయాక పెద్దకుమారుని పిలిచి తండ్రి యెప్పుడో కొనియిచ్చిపోయిన ఆ పెద్ద మృదంగాన్ని బయటకు తెప్పించుకొని ఆరంభిస్తారు.

"ధిత్తోం! ధిత్తోం! తకిట ధిత్తోం......"

అంటూ మృదంగం అరవనారంభిస్తుంది. క్రమంగా స్థాయి హెచ్చుతూపోయి కొంతసేపటికి "ఝుణఝుణఝుణఝుణ"మంటూ పిడుగులు కురుస్తున్నట్టు మ్రోగుతుంది. అప్పుడు ఆ పిడుగులుపాటులో శబ్దబ్రహ్మం సాక్షాత్కరించగా పంతులుగారి క్షుభితహృదయం నెమ్మది నెమ్మదిగా శాంతించి క్రమంగా తన్మయత చెందుతూ చివరకు మైకంతో కన్ను మూస్తుంది.

రవీంద్రుని నవలలు

"అమరేంద్ర"

భారతీయ సాహిత్యంలో నవలారచనకి నాంది చెప్పిన గౌరవం బంకించంద్ర చటర్జీకి దక్కుతుంది. ఈయన 'కపాలకుండల', 'దుర్గేశనందిని' అపారమైన ప్రచారాన్ని పొంది అనేక భాషల్లో అనువదింపబడినై. నవలని చదవాలనే కుతూహలం బంకింబాబు నవలలవల్లనే అన్ని ప్రాంతాలలోనూ అంకురించింది. కాని నవలారచనలో క్రొత్తదారులు త్రొక్కి ఉన్నత శిఖరాల నందుకున్న విశ్వకవి రవీంద్రుడు. రవీంద్రుని "గోరా" చదివి ముగ్ధుడైపోయి" ఇటువంటి నవలని రాయగలిగితే జన్మ సార్థక మౌతుంది." అన్న శరత్ బాబు సామాజికనవలారచనలో గురువును మించిన శిష్యుడు. భారతసాహిత్యంలో నవలారచన పొందిన పరిణామానికి బంకిం, రవీంద్ర, శరత్ చంద్రులే ముఖ్యకారకులు. వీరి నవలలు వంగసాహిత్యానికే కాదు భారతీయ సాహిత్య ప్రపంచానికే అమూల్యాభరణాలు.

రవీంద్రుడు నవలారచన ప్రారంభించే సమయానికి బంకింబాబు కీర్తి పదిదిశలా వ్యాపించింది. ఆంగ్లసాహిత్యంలో వాల్టర్ స్కాట్ సృష్టించిన చరిత్రాత్మక నవలలని అనుసరించి బంకింబాబు కొన్ని నవలలు రాశాడు. కల్పనతోనూ చరిత్రకు సంబంధించిన వాతావరణంతోనూ నిండిన బంకింబాబు నవలలకి దేశంలో విశేషమైన ఆదరం, విస్తారమైన వ్యాప్తి లభించినై. అందువల్ల రవీంద్రుని మొదటి రెండు నవలల్లోనూ బంకిం ఛాయలు బాగా కనిపిస్తయ్.

ఒక క్రొత్తదారిని త్రొక్కేముందు ప్రతిభావంతుడైన రచయిత కూడా కొంతకాలం నలిగిన దారినే నడుస్తాడు. రవీంద్రుని మొదటి నవల "బౌఠాకూరాణీర్ హాట్" లోనూ, "రాజర్షి" అనే రెండో నవలలోనూ బంకింబాబు ప్రభావమే ప్రస్ఫుటంగా కనబడుతుంది. ఈ రెండు నవలల్లోనూ కవిత్వం ఎక్కువగానూ, వాస్తవ దృష్టి తక్కువగానూ కనిపిస్తయ్. ఇవి వచనంలో రాసిన కావ్యాల మాదిరిగా వుంటయ్. ఈ నవలల్లోని పాత్రలకు జీవం లేదు, రక్తం లేదు. అవి కేవలం భావాలకి మూర్తులు. పాత్రల సృష్టిలోనూ, వాతావరణ చిత్రణలోనూ నవలా రచయితకి అత్యవసరమైన వాస్తవదృష్టి కనిపించదు ఈ రెండు నవలల్లోనూ స్వభావంచేత కవియైన రచయిత, నవలారచయిత కావటానికి చేసిన నిష్ఫల ప్రయత్నమే కనిపిస్తుంది బంకింబాబు అడుగుజాడల్లో తడబడుతూ నడిచే రవీంద్రుడే ఈ రెండు నవలల్లోనూ కనబడతాడు.

ప్రతిభావంతుడైన రచయిత అనుకరణలతోనూ, అనుసరణలతోనూ తృప్తిపడి వూరుకోలేడు. ఎప్పటి కప్పుడు తన స్వతంత్రశక్తి వెల్లడించటంకోసం ప్రయత్నిస్తూ వుంటాడు. ఇటువంటి సఫలీకృతమైన ప్రయత్నమే రవీంద్రుని మొదటి సామాజిక నవల "వినోదిని." ఈ నవల అన్నివిధాలా ఒక నూతన శకానికి ప్రాతిపదిక అనవచ్చును. సామాజిక నవలలో బంకిం బాబు చూపని సాహసాన్ని రవీంద్రుడు "వినోదిని" లో ప్రదర్శించాడు. యౌవనం అంకురించక మునుపే భర్తను కోలుపోయిన అభాగిని వినోదిని. ఆమె హృదయంలోని తీరని ప్రేమపిపాస నవలలోని ముఖ్యవస్తువు. బంకిం ప్రశ్నించకుండా శిరసా వహించిన సంఘ నియమాలని రవీంద్రుడు నిర్భయంగా విమర్శించాడు. వ్యక్తి స్వాతంత్ర్య మంటే రవీంద్రునికి అపారమైన భక్తి. తరతరాలనుంచి స్థిరపడిపోయిన ఆచారాలమీద బంకించంద్రునికి అమితమైన గౌరవం.

పాత్రపోషణలోకూడా రవీంద్రుడు ముందడుగు వేశాడు. బంకింబాబుపాత్రల్లో క్రమపరిణామం కనిపించదు. ఆకస్మికమైన, అస్వాభావికమైన పరివర్తనలు బంకింబాబుపాత్రల్లో తటస్థిస్తయ్. అటువంటి నవలలు చదివినప్పుడు కట్టుకథలు విన్నట్లుగా వుంటుంది. కాని వాస్తవ జీవిత ప్రతిబింబాన్ని చూసిన సంతృప్తి కలగదు. సక్రమమైన పరిణామాలతో, సహజమైన చిత్తవృత్తులతో, స్వాభావికమైన పాత్రలతో మొట్టమొదటి సామాజికనవలని సృష్టించినగౌరవాన్ని "వినోదిని" వల్ల రవీంద్రుడు సంపాదించాడు. ఈ నవలలో రచయిత ఉత్తమ కవిత్వాన్ని, అద్భుతమైన వాస్తవ చిత్రణాన్నీ సమన్వయించాడు. ప్రతిభావంతుడైన కవి రవీంద్రుడు ప్రజ్ఞావంతుడైన నవలరచయిత కాగలడని "వినోదిని" నిరూపించింది. ఈ నవలలో రవీంద్రుడు రమణీయమైన వాస్తవ దృష్టిని ప్రదర్శించాడు. ఇది ఫ్రెంచి నవలల్లో కనిపించే నీరసమైన, జుగుప్సాకరమైన వాస్తవ తృష్ణ కాదు. ఇది భావనాలోకాన్ని సుఖ దుఃఖాత్మకమైన మానవలోకంతో కలపటానికి రవీంద్రుడు సంధించిన సుందరమైన ఇంద్రధనస్సు.

'వినోదిని' తరవాత 'నౌకాభంగం' వెలువడింది. ఈ నవలలో పాత్రపోషణకంటె కథాసంవిధానమే ముఖ్యమైంది. చివరిదాకా అసలు విషయాన్ని దాచిపెట్టి చాకచక్యంతో కథని రవీంద్రుడు ముందుకి నడిపించాడు. ఒక పడవ మునిగిపోతుంది. ఆ పడవలో రెండుమురాల. పెళ్లివారు ప్రయాణం చేస్తుంటారు. తుపాను సమసిపోయినాక రమేశ్, కమలా ఒడ్డున పడి వుంటారు. కమలే తన భార్య అనుకుంటాడు రమేశ్. అతనే తన భర్త అనుకుంటుంది కమల. ఈ కల్పనా బుద్బుదంమీదనే వారు కాపురం చేస్తుంటారు. చివరికి అసలువిషయం బైటపడుతుంది. కమల ఇంకొకని భార్య. రమేశ్ ఇంకొకతె భర్త, ఈ రహస్యాన్ని కప్పిపుచ్చటానికి నవలని ఎంతో నేర్పుతో నడిపించాడు. కాని కమలకి స్త్రీసహజమైన కుతూహలం లేశమైనా వుంటే అసలు సంగతి ముందే బైటపడి పోయేది. ఎంత నేర్పుతో నడిపించినా కథ అస్వాభావికంగానే కనిపిస్తుంది. ఈ నవల కంతటికీ హేమనళినిపాత్ర అలంకారం. ముందుముందు రవీంద్రుడు సృష్టించబోయే సుందరమైన గంభీరమైన స్త్రీ పాత్రలకి హేమనళిని ప్రాతిపదిక.

రవీంద్రుని నవలల్లో "గోరా" ఉన్నతశిఖరం. అంతకు ముందు రచించిన నవల లన్నీ ఈ శిఖరాన్ని అందుకోడానికి నిర్మించిన సోపానాలు. భారతీయ నవలాచరిత్రలో "గోరా" మొట్టమొదటి ఉత్తమ సామాజిక నవల. ఆనాటి సాంఘిక, రాజకీయ, ధార్మిక సంచలనా లన్నిటికీ, ఉద్యమా లన్నిటికీ "గోరా" అద్భుతమైన ప్రతిబింబం. ఆనాడు జాతిలో వెల్లివిరిసిన చైతన్యం, ఉత్తేజం నవలలోని ప్రతి పుటలోనూ తాండవిస్తయ్. 'గోరా' కేవలం నవల మాత్రమే కాదు. ఆనాటి జాతీయ జీవితచరిత్ర అని చెప్పవచ్చు ఈ నవలలో పాత్రలు ఎన్నో సమస్యలు చర్చిస్తారు. తన దేశంలోని, ప్రాచీన ధర్మాలు ఆచారాలు పవిత్రమైనవని, వాటిని సంస్కరించటం పాప మనీ గోరా వాదిస్తాడు. అతని దేశభక్తి తీవ్రమైనది, గొప్పది. కాని గుడ్డిది. తన జాతీయ జీవితంలోని పాపాలని, దోషాలని నిష్పాక్షికంగా విమర్శించి, నిర్మూలించ గలిగినవాడే నిజమైన దేశభక్తుడని రవీంద్రుడు నిరూపించాడు. ఎన్నిచర్చలు జరిగినా ఎన్ని వాదోపవాదాలు రేగినా కథ ఆగకుండా సాగిపోతూ వుంటుంది ఈ చర్చలూ వాదోపవాదాలూ పాత్రల స్వరూప స్వభావాలని తీర్చిదిద్దుతయ్. అవి కథ నడకకిగాని, పాత్రల పరిణామానికి గాని అడ్డం రావు. వాదోపవాదాల వల్ల కథకి దెబ్బ తగలనీకుండా నవలని నడిపించటం రవీంద్రుని అసాధారణ ప్రతిభకి తార్కాణం.

'గోరా' లోని పాత్ర లన్నిటిలోనూ మరపురాని సృష్టి సుచరితపాత్ర. స్త్రీ ప్రకృతిలోని సౌమ్యానికీ, సౌజన్యానికీ, సౌందర్యానికీ రమణీయమైన మూర్తి సుచరిత. ఈ నవలలోని పాత్రలన్నీ జీవంతో నిండి తొణుకుతూ వాస్తవ వ్యక్తుల మాదిరిగా కనిపిస్తారు. గోరా, వినయబాబు, లలితా, మహీం, ఆనందమయి, పరేశ్- ఒకొక్కరూ ఒకొక్క విశిష్టమైన వ్యక్తిత్వంతో మనల్ని ఆకర్షిస్తారు. నవలలోని అప్రధానమైన పాత్రల్లో హరిమోహినిపాత్ర ప్రతిభావంతమైన వాస్తవ సృష్టి. ఎక్కడా ఆసరా లేక సుచరితఅండన చేరుతుంది. కొస్త తికాణా దొరికే సరికీ ఇంటి కంతకీ పెత్తనం చెలాయించే సుచరితనే చెప్పు చేతుల్లో వుంచుకోటానికి ప్రయత్నిస్తుంది. హిందూ కుటుంబాలలో ఛాందసాచారాలతో అధికారం చెలాయించే వృద్ధ వితంతువులకి హరిమోహిని గొప్ప ప్రతిబింబం.

కథానిర్వహణంలో, వాతావరణచిత్రణలోనూ, పాత్రపోషణలోనూ, "గోరా" అపూర్వమైన విజయాన్ని సాధించింది. అందుకనే సామాజికనవలాచక్రవర్తి శరత్ బాబు "గోరా" నవల తన ఆదర్శమని పేర్కొన్నాడు.

పురోగామియైన రచయిత ఎన్నడూ తన విజయంతో తాను సంతృప్తిపడి వూరుకోలేడు. క్రొత్తదారులు త్రొక్కి క్రొత్త విజయాలు సాధించటంకోసమే ఎప్పుడూ పాటుపడతాడు. సాధారణరచయిత అయితే ఒకమాటు సాధించిన విజయాన్నే మళ్లీ మళ్లీ పట్టుకు పాకులాడి చివరికి తన విజయాన్ని పరాజయంగా మారుస్తాడు. ఒక గొప్ప నవల రాస్తే అటువంటివే పది నమూనాలు తయారుచేసి చదువరులని విసిగిస్తాడు. కాని రవీంద్రుడు ఇంకో "గోరా"ని సృష్టించలేదు. క్రొత్త దారి త్రొక్కాడు. క్రొత్త విజయాలు సాధించటంకోసం ప్రయత్నించాడు.

ఇది రవీంద్రుని నవలారచనలో ఆఖరి దశ. ఈ దశకి చెందిన నవలలన్నీ ఒక ప్రత్యేకమైన తరగతికి చెందినవి. ఈ నవలల్లో కనిపించే పాత్రలు అసాధారణవ్యక్తులు. ఈ నవలల్లో రవీంద్రుడు సావకాశంగా కథ చెప్పడు. జరిగిన కథని కుంచించి విమర్శిస్తాడు. సాంతం కథ చెప్పకుండా ముఖ్యమైన ఘట్టాలమీద దృష్టి కేంద్రీకరిస్తాడు. వీటి శైలి ధారాళంగా సాగిపోకుండా ఆగి, ఆలోచించి, తూచి విసిరే సూక్తులతో మందంగా నడుస్తుంది. పాత్రల సమగ్రస్వరూపం కళ్లకి కట్టదు. వాళ్ల స్వభావాలలోని కొన్ని విశేషాలు మాత్రమే చదువరికి అందిస్తాడు. ఈ దశకి చెందిన రవీంద్రుని నవలలని ఆంగ్లకవి మెరిడిత్ నవలలతో పోల్చవచ్చును. ఇవి ప్రతిభావంతమైన నవలలే కాని పాఠకుణ్ణి పూర్తిగా తృప్తిపరచలేవు. పాఠకుడికి కావలసింది సాఫీగా సాగే కథ, సహజమైన పాత్రలు, మామూలు సంభాషణలు. ఇవి ఈ నవలల్లో దొరకవు. ఈ నవలల్లోని శక్తి మిరుమిట్లు గొలుపుతుంది. కాని మనస్సుకి సంతృప్తి ఇవ్వదు.

ఈ దశకి చెందిన మొదటి నవల "చతురంగ" (***Broken Ties***). ఈ నవలకి నాయకుడు శచీశ్. అతని ఆత్మ వెలుతురుకోసం తడుముకోటమే ఈ నవలలోని కథావస్తువు. ఈ నవలలో మెరుపులాగా మిరుమిట్లు గొలిపే స్త్రీ పాత్ర దామిని. కథలో సంఘటనలు తక్కువ. గమనం మందం. పాత్రలు తమ మనస్సులలోకి తొంగి చూసుకోటానికే నవలలో ప్రాధాన్యం ఇచ్చారు.

రెండో నవల "ఇంటా - బైటా" స్వదేశీ ఉద్యమం నవలకి వాతావరణం. భార్యగా జీవితం సాగించే స్త్రీ బైటి ప్రపంచంలోని సమస్యలతో ఎంతవరకు జోక్యం కలిగించుకోవచ్చును? బైటిలోకపు ఆకర్షణలకి లొంగిపోకుండా గృహిణి తన పత్నీధర్మాన్ని నెరవేర్చుకోగలగటం సాధ్యమా? అనే ముఖ్యసమస్యని ఈ నవలలో రవీంద్రులు చిత్రించారు. ఈ నవలలో నిఖిలేశ్ తన భార్య విమలకు సంపూర్ణమైన స్వాతంత్ర్యం ఇచ్చాడు. స్వదేశీఉద్యమంలో ఉద్రేకంతో పాల్గొంటున్న సాందీప్ విమలని ఆకర్షించాడు. అతని ప్రలోభాలకి విమల లొంగిపోతుంది. చివరికి గొప్పగొప్ప ఉపన్యాసాలు కొట్టిన సాందీప్ తన భర్త పాదధూళికి కూడా సరిపోడని విమల తెలుసుకోగలుగుతుంది. మానసిక స్వాతంత్ర్యాన్ని గురించీ నైతికస్వేచ్ఛనిగురించీ సాందీప్ ఇచ్చే గంభీరోపన్యాసాల చాటున తుచ్ఛమైన కామపిపాస దాగివుం దని విమల గ్రహిస్తుంది. కాని సాందీప్ పాత్రని రవీంద్రుడు చాలా శక్తివంతంగా నిర్వహించాడు. చదువుతున్నంతసేపూ సాందీప్ ప్రతిభ చదువరిని ముగ్ధుణ్ని చేస్తుంది. అతని వివేకం వెర్రితలలు వేసింది. అతని ప్రతిభ పెడదారి పట్టింది. మొత్తంమీద నవలలో కథాసంవిధానంకంటె, సంఘటనలకంటె సమస్యాపరిష్కారానికీ, పాత్రల చిత్తవృత్తుల పరిశీలనకీ ప్రాముఖ్యం ఎక్కువ.

తరవాత 1929 లో రవీంద్రుడు "యోగాయోగ" అనే మరొక సమాస్యాపూరితమైన నవల రాశాడు. మనసు కలవని దంపతుల కాపురం కథావస్తువు. భార్యాభర్తలైనప్పటికీ కథానాయికకీ కథానాయకుడికీ ఉత్తరధృవానికీ దక్షిణధృవానికీ వున్నంత వ్యత్యాసం వుంది. వివాహబంధంలో విధి ఒకచోటికి చేర్చిన విభిన్న ప్రవృత్తుల సంఘర్షణని ఈ నవలలో చిత్రించాడు. కథానాయకుడు మధుసూదన్ హృదయంలేని కుబేరుడు. గొప్ప వ్యాపారస్థుడు. కనక తన భార్యనికూడ ఆస్తిలో ఒక భాగంగా పరిగణించి అధికారం చెలాయిస్తాడు. అతని దౌర్జన్యం శ్రుతిమించినకొద్దీ ఆమె సహనం అధికమౌతుంది. చివరికి అణకువ, సహనం జయించినై. పశుబలం తల వంచింది. ఈ నవలని గాల్స్వర్దీ రాసిన "ఆస్తిపరుడు" అనే నవలతో పోల్చవచ్చు. గాల్స్వర్దీనవలలోని నాయకుడు సోమ్సుకీ, రవీంద్రుని నవలలోని మధుసూదన్‌కీ చాలా పోలిక వుంది. కాని కథానాయికలమధ్య తూర్పు పడమరల కున్నంత వ్యత్యాసం వుంది.

ఈ దశకి చెందిన నవల లన్నిటికంటె భిన్నమైన ధోరణిలో రాసిన నవల "శేషేర్ కవిత" మానవస్వభావాలలో ప్రేమవల్ల కలిగే మార్పులు చిత్రించటం నవల ముఖోద్దేశం. నాయకుడు అమిత్ రాయి ప్రేమప్రభావాన్ని పరిహాసం చేసి చివరికి లావణ్య అనే స్త్రీప్రేమలో చిక్కుకుంటాడు. ఇద్దరిప్రేమా స్వప్నవీథుల స్వర్ణశిఖరాలకి ఎగబాకి క్రమంగా వాస్తవజీవిత మనే ఎడారిలో ఇంకిపోతుంది. కవిత్వం నవలనిండా వెల్లివిరుస్తుంది. వచనంలో రాసిన మధురమైన ప్రణయకావ్యం "శేషేర్ కవిత."

"నాలుగు అధ్యాయాలు", "అక్కచెల్లెళ్లు" వంటి చిన్న నవలలు కొన్ని రవీంద్రుడు రచించాడు. నవలాశిల్పంలో ఇవి ప్రయోగాలు మాత్రమే కాని విజయాలు కావు.

రవీంద్రుడు మొత్తం పన్నెండు నవలలు రాశాడు. వీటిలో మొదటి దశకి చెందిన "వినోదిని"మీదా, రెండో దశకి చెందిన "గోరా" మీదా, మూడోదశకి చెందిన "ఇంటా బైటా", "శేషేర్ కవిత"మీదా రవీంద్రుని కీర్తి ఆధారపడుతుంది. ఇవే నవలారచనలో కవి రవీంద్రుడు సాధించిన అపూర్వవిజయాలు. ఈ నవలల్లో ఉత్తమమైన కవితాశిల్పమూ, ప్రతిభావంతమైన వాస్తవచిత్రణమూ గోచరిస్తయ్.

కాని ప్రొఫెసర్ హుమయూన్ కబీర్ అన్నట్లు రవీంద్రుని నవలల్లోని పాత్రలు భువికంటె దివికే చేరువగా వుంటయ్. కవితాలోకపు కాంతిపరివేషం ప్రతిపాత్రలోనూ కనిపిస్తుంది. శరత్ బాబు పాత్రలు ఆప్తులుగా, ఆత్మీయులుగా మనసులో నిలిచిపోతారు. రవీంద్రుని పాత్రలు ఉజ్వల స్వప్నాలుగా, ఉన్నతాదర్శాలుగా హృదయంలో వెలుగుతూ వుంటారు.

డాక్టర్ ధూర్జటిప్రసాద్ ముఖర్జీ అన్నట్లు ఇంకో విషయాన్ని మనం ఒప్పుకోక తప్పదు; భారతీయ సాహిత్యంలో నవలారచయితగా రవీంద్రునికి ఉన్నతస్థానం ఇవ్వక తప్పదు. కాని రవీంద్రుడు విశ్వకవి. విశ్వసాహిత్యదృష్టిలో, ప్రపంచసారస్వతంలోని ప్రమాణాలదృష్టిలో నిష్పక్షపాతంగా చూస్తే టాల్స్టాయ్, డాస్టోవ్‌స్కీ, బాల్జాక్, విక్టర్ యూగో వంటి రచయితల మేటి నవలలతో సాటి రాగల నవలలు రవీంద్రుడు సృష్టించలే దనే చెప్పాలి. కాని భారతీయసాహిత్యంలో రవీంద్రుడు మార్గదర్శకములైన నవలలని సృష్టించా డని ఒప్పుకోక తప్పదు.

ఆంధ్రదేశసర్వతోముఖాభివృద్ధి

శ్రీ నరసింహదేవర సత్యనారాయణ

దేశము సకలసంపత్సమృద్ధిగా నుండాలంటే కొన్ని ప్రకృతి సౌలభ్యాలు కలిగి వుండాలి. ప్రకృతిసంపదతో ప్రజా సహకారము తోడ్పాటు ఉండాలి. ప్రజల కృషిమూలమున ప్రకృతి సంపద యితోధికముగా వృద్ధియై జన సామాన్యముయొక్క సుఖసంపదలకు తోడ్పడును. ప్రజలు ప్రకృతిని వినియోగించుకొనుటలో అద్భుతపరిణామము కలుగును. ప్రాచీనకాలము మొదలు నేటివరకు ప్రజలు ప్రపంచమునం దంతట పరిభ్రమణము కావించుచు ప్రకృతి నన్వేషించి సుఖ సంపదలకై ప్రాకులాడి తమ ప్రత్యేక విశిష్టతను ప్రకటించిరి.

ఆర్యులు భారతదేశము విచ్చేసినపుడు యిచ్చటి ప్రకృతిరామణీయకతకు అచ్చెరువొంది నదీనదములు గిరిగహ్వరములు వనాంతరసీమల నాశ్రయించి తమ నైతిక ఆధ్యాత్మిక విజ్ఞానమును వికసింపజేసుకొనిరి. వివిధ కళలను పెంపొందించిరి. అనశ్వరమైన నాగరికతను ప్రపంచమునకు వ్యాప్తిజేసి లోకమునకు శాంతి సందేశము వెలిబుచ్చిరి. ఆర్యజాతి ప్రకృతి నారాధించి ఈశ్వరసందర్శనము కావించుకొని ధన్యమయ్యెను.

వీరు భౌతిక సుఖసంపదల ననుభవించుచున్నను, వున్నత ఆధ్యాత్మిక ఆకాశవీథుల విహరించిరి. ఎక్కడనో అదృశ్యుడగు పరమాత్మను "సర్వం ఖల్విదం బ్రహ్మ" అని దివ్యదృష్టిని ప్రపంచమునం దంతటను దర్శించి "తమలోనూ సాక్షాత్కరింపజేసుకొని" సర్వసమత్వము కలిగి యుండిరి. తమలోనుండు దైవమే "ఆత్మవత్సర్వభూతాని యః పశ్యతి స పశ్యతి" అని అందరిలో కలడని నిరూపించుకొని అహింసా సత్యవ్రతులై "సర్వే జనాః సుఖినో భవంతు" అని భౌతిక సుఖసంపదలను అందరు సమానముగా ననుభవించిరి. ఆర్యజాతి ప్రకృతి ఆరాధన మూలమున ప్రపంచమునకు లభించిన ప్రత్యేక విశిష్టత ధర్మప్రతిపాదనము.

ఆధర్మ ప్రతిష్ఠాపనకొరకే ఆర్యఋషులు వేదగానము చేసిరి. చక్రవర్తులు పరిపాలనావిధానము సర్వసమత్వముతో ధర్మయుతముగా నిర్వర్తించిరి. యుద్ధవీరులు తమ ధన ప్రాణ మానములను తృణప్రాయముగ నెంచి రణరంగమున ధర్మరక్షణకొరకు ఆహుతి యైరి. వ్యాపారస్థులు ధర్మమునకు కట్టుబడి దేశమును సౌభాగ్యవంతముగా నొనర్చిరి. కృషీవలులు అధిక ఆహారోత్పత్తి యొనర్చి భూమాతను సేవించి తమ విధ్యుక్తధర్మమును నెరవేర్చుచు దేశసంపదకు తోడ్పడిరి. అధికుడు అధముడు అజ్ఞాని విజ్ఞాని అను భేదభావములు లేక "ఆపన్నార్తి ప్రశమనఫలాః సంపదో హ్యుత్తమానాం" అని సంపద్వరేణ్యులు పామర జనులను దైన్యమునుండి కాపాడి పోషించిరి. జాతిలోని వివిధవృత్తులవారు తమ వృత్తులను అన్యోన్యసహకారభావముతో నెరవేర్చుకొని స్వయంపోషకత్వము కల్గి యుండిరి. ఇందుమూలమున దేశములో సంపత్తి సర్వవ్యాపకమై ప్రజానీకములో అసంతృప్తికి ఆస్కారము కలుగలేదు. కలిమిలేములకు కష్ట సుఖములకు ఒండొరులు పరస్పరసానుభూతితో కలసి పనిచేయుట మూలమున దారిద్ర్యదేవతకు స్థానము కలుగలేదు. దేశము సకలసంపత్సమృద్ధియుతముగ నుండెను.

ఇది ప్రాచీనభారతదేశపు జాతీయపురోభివృద్ధికి ఆర్యులు అవలంబించిన వుత్తమసహకార పద్ధతి భారతావనియందు వర్ధిల్లిన వివిధజాతులు కులములు వృత్తులు పరస్పరవైరుధ్యములేక అన్యోన్యసహాయముతో వున్నత సహకార ఆదర్శములపై వర్ధిల్లినవి. ఆర్యజాతీయ మహాసౌధము దృఢమైన సహకారపునాదులపై నిర్మింపబడి యుండుట మూలముననే నేటివరకు శిథిలము కాక సామ్రాజ్యములు విధ్వంసములైనను రాజులు తారుమారైనను జాతి నశించక ప్రజానీకము శాంతి సంపత్సమృద్ధి కలిగి యుండిరి.

అఖండైశ్వర్యముల ననుభవించిన ఆర్యజాతి పాశ్చాత్యజాతుల సంసర్గమువలననే దధోగతిపాలైనది. దేశము దారిద్ర్యదేవతకు నిలయమైనది. క్షామదేవతకు నివాసమైనది. అనారోగ్య పిశాచమునకు స్థావరమైనది ప్రాశ్చాత్యజాతులు పరదేశము లాక్రమించుటలో లక్ష్యము వేరు. దృక్పథము వేరు. ప్రాశ్చాత్యజాతులు భారతదేశమునకు వచ్చిన ఆర్యులవలెనే అమెరికా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా, ఆసియా ఖండముల లోను పర్వతరాజములు సందర్శించిరి. ఘనదేశ తలము క్రొల్చిరి. నదీనదములను అన్వేషించిరి. భూగర్భములను దొల్చిరి. సముద్రములను లంఘించిరి. ఆకాశముల విహరించిరి ప్రకృతిశక్తుల వశపరచుకొని తమ సుఖసంపదలకు బానిసగా నొనర్చుకొనిరి. ఈ శక్తి ఉపాసన వీరిని ఆర్యుల వలె భగవత్ప్రేరితులుగ జేయక రాక్షసులుగ నొనర్చినది. పక్షులవలె విమానములలో ఆకాశమున విహరించినను మత్స్యములవలె జలాంతర్గాములలో సంచరించినను విద్యుచ్ఛక్తిచే ప్రపంచము నంతను చుట్టుముట్టినను మరమాణుశక్తిచే ప్రపంచము నంతను ఒక్కక్క క్షణములో భస్మీపటలము చేయుటకు శక్తి సంపాదించ గల్గినను ఉన్నతమానవ అభ్యున్నతి కొరకు వీరి మహచ్ఛక్తిని వినియోగించలేకపోయిరి. ఇందుకు కారణ మొక్కటేను. మిరుమిట్లుకొలుపు భౌతిక సుఖ సంపదలతో తులతూగుచు ధనోన్మత్తులై తోటి మానవుని భగవంతుని మరచి భోగలాలసత్వమునకు గురియైరి. అందుచే వీరి ప్రకృతి శక్తి ఆరాధన ఆధ్యాత్మికోన్నతికి యుపయోగపడక ఆత్మనాశముకొరకు వినియోగపడుచున్నది. మానవునిలోని పశుత్వము రాక్షసత్వము నశించినగాని ప్రపంచశాంతి లోకకల్యాణము కలుగదు. పాశ్చాత్యుల ధనకాంక్ష పరస్పర పోటి పద్ధతి మానవత్వము నశింపజేసి రాక్షసత్వము పురికొల్పినది. తిరిగి ప్రపంచములోని ప్రజానీకము సర్వసమాన సుఖసంపదలు పొందవలె నన్న యీ పద్ధతి నశించాలి. ప్రజలలో సంఘసేవాపరాయణత్వము పరస్పర సహకారభావము పెంపొందాలి. అప్పుడే ప్రపంచమున శాంతి సుఖ సంపదలు కలుగును. ఇందుకు ప్రాచీన ఆర్య సహకార సిద్ధాంతమే ఆదర్శకము. అవలంబనీయమార్గము.

ఆంధ్రావని సర్వతోముఖ సంపత్సమృద్ధికి యీ వున్నత సహకారభావములు ఆదర్శకముగ అమలులో పెట్టబడవలెను. ఇదియే అమరపురుషుడగు మహాత్ముని లక్ష్యము. ఇందు మూలమున ప్రజల ఆర్థిక నైతికరాజకీయ వ్యావసాయిక పారిశ్రామిక విద్యాపురోభివృద్ధి యితోధికముగ కల్గును. ఇందుకు ఆంధ్రదేశమున సహజప్రకృతి సిద్ధమగు సంపత్సమృద్ధికరమైన వనరు లెన్నియేని కలవు. దేశసర్వతోముఖ సంపత్సమృద్ధికి తృణ జల కాష్ట సమృద్ధి ఆవశ్యక మని ప్రాచీన ఆర్థిక వేత్తలు పేర్కొన్నారు. ప్రజలకు ఆహారము పుష్కలముగా లభించుటకు వ్యవసాయపురోభివృద్ధి ముఖ్యావశ్యకము. వ్యవసాయ అభ్యుతికి పశుగణము పెంపొందాలి. పశుపోషణకు తృణము అనగా గడ్డి సులభముగా లభ్యము, కావలెను. అందుచేతనే దేశమాతను కవిచంద్రుడగు బంకిం చంద్రుడు సశ్యశ్యామలాం అని వర్ణించినాడు. ఆంధ్రావని సశ్యశ్యామలమైనది. తృణధాన్యములు పుష్కలముగా పండుటకు యెన్నియో మహదవకాశములు కలవు. కాని కృష్ణా గోదావరీ తుంగభద్ర పావనోదకము ఆంధ్రదేశమును సశ్యశ్యామలముగ జేసి తృణధాన్యములు పండించి ప్రజలను పశుగణమును పోషించుటకు భగవంతుడు యీ జీవనదులను ప్రసాదించినను యీ నదీ జలములు సముద్రగాములై వృథాగా ప్రవహించిపోవుట కనులార చూచి వూరకుంటున్నామే గాని ఫలప్రద మగునటుల వుపయోగించుకొనుట లేదు. నూరుసంవత్సరముల క్రితము పరదేశప్రభుత్వము కృష్ణా గోదావరీ నదులకు ఆనకట్టలు కట్టి నాటికి అయిదువంతులు గోదావరీజలమును పదివంతులు కృష్ణానదీజలమును మాత్రమే పంటలు పండించుకొనుటకు వుపయోగమునకు తెచ్చిరి. బంకించంద్రుడు వర్ణించినటుల ఆంధ్రావని "సుజలాం" జలపూరితమైనను యీ జలములను సద్వినియోగపరచుకొని "సుఫలాం" చేయుటకు యింతవరకు నోచిపెట్టలేదు. కృష్ణా గోదావరీ నదులకు రిజర్వాయర్లు స్వతంత్రప్రభుత్వము వెంటనే నిర్మించి దేశసంపత్సమృద్ధికి దోహద మొసగవలయును.

ఈ కృష్ణ గోదావరి నదులకు కట్టబడే ప్రాజెక్టులవలన ఆంధ్రదేశము ఆహారవిషయమున పరాధీనత లేక స్వయంపోషకత్వము కలిగి యుండుటయేగాక భారతదేశమున కంతకును ఆహారకొరత తీర్చగలదు. గోదావరినదికి రామపాదసాగర ప్రాజెక్టు కృష్ణానదికి కృష్ణా పెన్నార్ ప్రాజెక్టు తుంగభద్రానదికి తుంగభద్రా ప్రాజెక్టు అచిరకాలంలో పని ప్రారంభించి పూర్తిచేసిన దేశము సుభిక్షముగా పండగలదు. ప్రజలు ఆహారకొరత లేక సుఖించగలరు. జలాశయములు ఆంధ్రావనియందు పెక్కు లున్నను వీటిని వుపయోగించుకొనలేని దుస్థితి యందుండి ప్రజలు దరిద్రనారాయణు లగుచున్నారు. ఈ దరిద్రనారాయణ సమస్యను తీర్చుటకు దేశము సకల సంపత్సమృద్ధిగ చేయుటకు యీ జీవనుల పావనోదకము వుపయోగకరముగ నొనర్చుట మూలముననే కల్గును. వ్యవసాయాభివృద్ధితో గూడ పశుగణ మభివృద్ధి చెందును. పాడిపంటలు పుష్కలముగ ప్రజానీకము అనుభవించిన దేశమునుండి అధి వ్యాధులు పలాయన మగును. కడుపునిండ తిండి యున్న కంటపుష్టి కలిగి ప్రజలు కష్టపడి పనిచేసి వివిధ వృత్తులను పెంపొందించుకొని స్వయంపోషకత్వము కల్గి యుందురు.

ఈ జలాశయములవలన నెన్నియో ఇతర పరిశ్రమలు పెంపొందించుటకు విద్యుచ్ఛక్తిని వ్యాపకము చేయవలసి యున్నది. పరదేశములలో సంపత్సమృద్ధి కలుగుటకు పరిశ్రమాభివృద్ధియే మూలకారణము. వ్యవసాయపరిశ్రమ బహుజనులకు జీవనభృతి యొసగినను, యితర పరిశ్రమలు కూడ పెంపొందించుకొన్న గాని దేశసౌభాగ్యము వృద్ధి నొందజాలదు. రామపాద సాగర తుంగభద్రా ప్రాజెక్టు మాచికండు ప్రాజెక్టులనుండి విద్యుచ్ఛక్తిని యుద్భవింపజేసి ఆంధ్రదేశములోని వివిధ మండలములకు దశ దిశల వ్యాప్తి నొనర్చి పట్టణపరిశ్రమలకు గ్రామపరిశ్రమలకు వినియోగపరచిన యీ ప్రాజెక్టుల మూలమున వ్యవసాయపురోభివృద్ధితో కూడ దేశపరిశ్రమాభివృద్ధి చెంది ప్రజలు సుఖసంపదలతో తులతూగగలరు.

కోస్తాజిల్లాలలో వ్యవసాయపరిశ్రమ వృద్ధి చేయుటకు యెన్ని అవకాశము లున్నవో రాయలసీమజిల్లాలలో పరిశ్రమలు వృద్ధిచేసి ప్రజలకు సంపత్తి కలుగజేయుటకు అన్ని మహదవకాశము లున్నవి. కోస్తాజిల్లాలలో జలాశయములద్వారా అధిక ఆహారోత్పత్తికి వనర్లు కలుగజేసిన కూటికి కరు వుండదు. రాయలసీమజిల్లాలలో వస్త్రపరిశ్రమ వృద్ధి చేసిన గుడ్డకు కరు వుండదు. ఇక్కడ ప్రత్తి విశేషముగ పండును. చౌక యెలక్ట్రిసిటీ వ్యాప్తిమూలమున బట్టల ఫ్యాక్టరీల నిర్మాణముచే వస్త్రపరిశ్రమ వృద్ధి పెంపొందించవచ్చును దేశములో వస్త్రకాటకము లేకుండ అక్షయము చేయవచ్చును. కడుపు నిండ తిండి, ఒంటెనిండ బట్ట ఆంధ్రావనిలో లోటు లేకుండ చేయడానికి ప్రకృతిసిద్ధమైన యీ తృణ జల సంపత్తిని బహువిధముల వుపయోగించుకొనలేని అసమర్థత, దురదృష్టము మనదే కాని దైవలోపము లేదు.

తృణ జల సమృద్ధితోపాటు కాష్ట సమృద్ధి అనగా ఆటవికసంపద ఆంధ్రదేశములో యెంతేని కలదు. ఆంధ్రదేశము రామాయణకాలములో కూడ దండకారణ్యమునకు సుప్రసిద్ధి చెందినది. ప్రాచీనకాలమున యీ కాష్ట సమృద్ధితో ఆంధ్రులు తమ కళానైపుణ్యము చూపి దివ్య సుందరమందిరములను గృహనిర్మాణములను చేసి చాతుర్యము చూపిరి. మయశిల్పి ఆంధ్రుడు. ఇంతియేగాక ఆంధ్రదేశము నౌకానిర్మాణము నందు గణతి కెక్కినది. విదేశయానమున సుప్రసిద్ధి చెంది కోస్తావ్యాపారముల ద్వారా దేశ సంపత్తిని వృద్ధిపరచిరి. రాయలనాడు హంపీనగర సంపత్సౌభాగ్యమునకు డచ్చి దేశపు యాత్రికులు అచ్చెరువొంది యీ సంపత్సమృద్ధికి ఆంధ్రదేశనౌకావ్యాపారః హేతుభూత మని ప్రకటించిరి.

ఆటవిక సంపత్తితోపాటు ఆంధ్రదేశము ఖనిజసంపదకు అనాదినుండి ప్రసిద్ధి గాంచినది. కోహినూరువజ్రము ఆంధ్రావనియం దుద్భవించినది నెపోలియన్ యోధుడు కరమున ధరించిన ఖడ్గమునకు పిడియందు ఆంధ్రదేశ వజ్రములు పొదగబడినవి మాంగనీసు మైకా మొదలగు ఖనిజసంపత్తి తదితర లోహసంపత్తి ఆంధ్రదేశమున యెంతేని కలదు. ఈ ఖనిజసంపత్తి పర దేశపరిపాలనలో దేశమునుండి మన అదృష్టవశాత్తు తరలించుకొని పోబడలేదు. పరిశోధనల కావించిన యెన్నియో ఖనిజములు ఆంధ్రావని యందు కలవనుట తథ్యము. రాయలసీమ రత్నాల సీమ యని పేరెన్నిక గాంచినది కాని నేడిపుడు రాళ్లసీమ యైనది తిరిగి వజ్రాలసీమ రత్నాల సీమ కావలెనంటే యెంతేని పరిశోధనకు అవకాశము కలదు. ఖనిజసంపత్తికి ఆటవిక,సంపత్తికి రాయలసీమ ఆటపట్టు. ఆంధ్రావని సకలసంపత్సమృద్ధికర మగుటకు ఆంధ్రులు పరస్పర భేదభావముల విడనాడవలెను. ఐక్యభావముతో సహకారపద్ధతిని, యేకతాటిని కృషిసలుప అలవడ జేసుకొనవలెను. అప్పుడే ఆంధ్రదేశము స్వయం పోషకత్వముగల సకలసంపత్సమృద్ధముగు స్వతంత్ర రాష్ట్రమై "సునదాం" "వరదాం" సార్థక అన్వర్థనామము కల దగును.

(బెజవాడ రేడియోకేంద్రంవారి సౌజన్యంతో)



అన్నమాచార్యులవారు



తిరువెంగళనాథులు

కర్ణాటక సంగీత సంప్రదాయ నిర్మాత శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులవారు

శ్రీ తెన్నేటి సూరి

అన్నమాచార్యులు, క్షేత్రయ్య, త్యాగరాజు—ఈ ముగ్గురూ కర్ణాటకసంగీత సాంప్రదాయాన్ని వెలయించిన ఆదిపురుషులు. కర్ణాటదేశమంతా బహుళవ్యాప్తిలో వున్న కారణంగా, సాంప్రదాయానికి 'కర్ణాటక సాంప్రదాయ'మనే వ్యవహారమున్నా, వాస్తవానికి, ఇది కేవలం ఆంధ్ర సాంప్రదాయం. ఈ సాంప్రదాయాన్ని నిర్మించిన ముగ్గురు మూర్తులూ ఆంధ్రులు. వారి పదబంధాలన్నీ ఆంధ్రభాషలోనే ప్రభవించినై. దీన్ని ఆంధ్ర సాంప్రదాయమనటం సమంజసం.

ఆంధ్ర సాహిత్యకళకు కవిత్రయమెలాగో—ఆంధ్ర సంగీతకళకు ఈ వాగ్గేయకారకత్రయం, అలా, ఆది నిర్మాతలు. వీరి ముగ్గురిలోనూ అన్నమాచార్యులవారు (1424-1503) నన్నయార్యునివలె, అనాది పురుషులు. మొదట వీరూ, తరువాత ఇన్నూరు సంవత్సరాలకు క్షేత్రయ్య, ఆపైని మరో శతాబ్దికి త్యాగరాజులవారు ప్రభవించారు.

అన్నమాచార్యులవారూ, తద్వంశీయులూ, అనుయాయులూనైన యితర మహాపురుషులూ రచించిన గేయకల్పనలు వేలాది సంఖ్యలో తాళ్ళపాకవారి పదాలనే పేర, కర్ణాటదేశమంతా విస్తృతవ్యాప్తిలో వున్నయి. ఒక్క అన్నమాచార్యులవారే 32 వేల సంకీర్తనలు రచించినట్టు చరిత్రాధారాలు కనుపిస్తున్నై.

అన్నమాచార్యులవారి ఇతర రచనలు: ద్విపద రామాయణం (ఇంకా లభ్యం కాలేదు). శృంగారమంజరి, వేంకటాచల మహాత్మ్యము (సంస్కృత రచన), సంకీర్తన లక్షణం (సంస్కృత రచన (అలభ్యం). ఇవికాక నానాభాషలలో అనేక యితర గ్రంథములూ, పదివరకూ శతకములూ రచించినట్టు చరిత్రాధారాలున్నయి. వీటిలో ఇప్పటివరకూ చాలా భాగం అలభ్యంగానే వుండిపోవటం శోచనీయం.

తెలుగుజాతిలో పరివ్యాప్తమైయున్న జీవద్భాషను అమృత ధారలుగా పిండి గేయకల శాలలో నింపి యుగయుగాల తెలుగు బిడ్డలకూ అందజేసిన మహాపురుషుడు అన్నమయ. ఆయన ప్రతికల్పనలోనూ, తెలుగు జాతీయత చలచలనైగ నిగ్యంగా, నిండి తొణికిసలాడుతూ వుంటుంది.

అఖండమైన సంస్కృత భాషా పాండిత్యం కలిగివుండి కూడా, ఈ మహాపురుషుడు వ్యావహారిక నుడికారాన్ని వరించటం గమనింపదగిన విషయం. వ్యావహారిక భాషలో రససిద్ధి యేర్పడదనే వితండవాదానికి తాళ్ళపాకవారి రచనలు గొడ్డలిపెట్టు. సంస్కృత భాషా పాండిత్యం లేని కారణంగా, వ్యావహారికాన్ని చేపట్టారని, తక్కిన వారినన్నట్టుగా అన్నమాచార్యులవారి మీద అభాండలాన్ని వేయటానికి పూనటం, ఇక అది కేవలం దురుసుతనం క్రిందికి వస్తుంది. సంపూర్ణమైన రససిద్ధి యేర్పడాలన్నా, ఉజ్వలమైన సజీవ రచనగా వుండాలన్నా వ్యావహారికం వినా, మరొగత్యంతరం లేదనటానికి తాళ్ళపాక వారి రచనలు ఒక సవాలు. ఎందుచేతనంటే, రససిద్ధి విషయంలో, మడిక్కున్నావనే యేకాముఖ్యలు దరిగిన గ్రాంథిక రచయితా తాళ్ళపాకవారి రసస్థాయిని అందుకోలేకపోవటం. రెండు-శిష్ట సాంప్రదాయానికి చెందివున్నామని గండపెండాలు తొడిగించుకున్న పెద్దనాది దిగ్గజాలకు కూడా, తాళ్ళపాకవారి మధుర పదజాలాన్ని తలదాల్చటంౘ తప్పని సరిగావటం,

—"చిగురుగొమ్మైన చేవ—మీ సాలపై తేనియల్—తంగేటిజున్ను—కొలగగర—పొరివిడంగాయములు—గోవాళ్లు—చింతుకందు—తలపూవాడక"—ఇత్యాది ప్రయోగాలన్నీ యే వీటియెరువు సొమ్ములు!!!

అన్నమయముడిచివేసిన పువ్వులు-గేయకల్పనలలో, వివిధ రాగతాళములలో అన్నమయ త్రొక్కిచూడని పుంత లేదు. జాజరలు-చందమామలు-కోవెల, చిలుక, తుమ్మెదపదములు-లాలి, సువ్వి, గొబ్బి, ఉయ్యాల, లాల, జోల, జోజో, జయ, విజయాభవ, శోభన మంగళ వైభోగములు, మేలుకొలుపులు, నలుగులు, దంపుళ్ళు, కొట్నాలు నివాళులు, ఆరతులు, మంగళారతులు, జయమంగళాలు, అల్లో నేరేళ్ళు, బాగుబళాలు, సాసముఖాలు, అవధానాలు, తందానలు, వెన్నెలలు, ఆత్మసంబోధనలు-మొదలైన మధురకవితా విశేషాలెన్నో అన్నమాచార్యులవారు రచించారు.

ద్రవిడవేదాంతరచనకు శఠగోపయతీంద్రులవారు అవతరించినట్టు, ఆంధ్రవేదాంతరచనకు అన్నమాచార్యులవారవతరించి 32 వేల పాటలలో ఆంధ్రవేదాన్ని వినిర్మించారు.

అన్నమయరచనలలో, కేవలభక్తి ప్రబోధములూ వేదాంత ప్రబోధములే కాక, నాటి చరిత్రాంశాలెన్నో బహిర్గతమౌతున్నయి. రచయితలకూ, కళాకారులకూ రాజాశ్రయంవంటి పరమదౌర్భాగ్యకరమైన దుస్థితి మరొకటి వుండదు—"సర్వంపు పడగనీడను." అసంఖ్యాకములుగావున్న యితర తార్కాణాల సంగతి అలావుంచి, అన్నమయాచార్యులవారి చరిత్రయీ విషయాన్ని విస్పష్టం చేస్తున్నది.

సాళ్వనరసింహరాయలు అన్నమాచార్యులవారికి తనఆస్థానంలో ఆశ్రయమిచ్చి, మొదట పచ్చలకడియాలువగైరా తొడిగి అందలాలెక్కించాడు. అనంతరం, తలతిరిగి, శ్రీ వెంకటేశ్వరస్వామివారిమీదచేసినట్లే, తనమీదకూడా కొన్ని శృంగారరచనలు ఘటించవలసిందని ఆచార్యులవారిని వేపుకుతినటం ప్రారంభించాడు. ఆచార్యులవారుపడ్డ వేదన ఆయా గేయచరణాలు తిలకించితే తెలుస్తుంది.

1—"నరహరికీర్తన నానిన జిహ్వా
ఒరుల నుతింపగ నోపదు జిహ్వా
మురహరు పదముల మ్రొక్కి—
శిరము పరుల వందనకు
పరగదు శిరము"

2—పసగల బ్రహ్మపదవులు
బ్రహ్మనిర్మితములు
పెస బ్రహ్మలింగ్రడి
శ్రీ వెంకటేశుండె
యెసగ నాతడెమమ్ము నేలి
యన్ని యునిచ్చె
పొసగినమానోమ్ములు ఒరు
లియ్యగలేనా

3—హరిముకుందుని గొనియాడిన జిహ్వా
నిను గొనియాడగా నేరదు జిహ్వా".

ఇలా తన అభిలాషను తృణీకరించినందుకు, నరసింహుడు ఏకోపాకున, ఆచార్యులవారిని జైల్లో వేయించాడు. నాడు బంధనలో వుండి చేసినరచనల్లో కొన్ని చరణాలు:

1—"ఆకటివేళల నలపైన
వేళల తేపన
హరినామమే దిక్కు మరి
లేదు పాపపు వేళలభయపడిన
వేళల వోపినంత
హరినామమే గతిగాక!

2—సంకెల బెట్టిన వేళ చంప బిలిచిన వేళ
వేంకటేసునామమే విడిపించగతిగాక!"

3—నీ దాసుల భంగములు నీవు
చూతువా? ఏదని చూచేవు
నీవు ఎచ్చరించవలెనా?
ఘోరపురాజసభల నుండి నిన్ను
వినతించితిమి యేరీతిపరాకు నీకు
ఇంకరక్షించరాదా?"

1478 లో, విజయనగర పాలకుడైన విరూపాక్షరాయని ఆయన పెద్దకొడుకు రాజశేఖరరాయలు చంపించి సింహాసనమెక్కాడు. తిరిగి యితగాణ్ణి ఇతడి తమ్ముడు రెండవ విరూపాక్షరాయల హత్యచేయించి రాజ్యమాక్రమించాడు. సాళ్వ నరసింహరాజు దండనాయకుడుగా వుండి, మళ్లా ఇతగాణ్ణి వెళ్లగొట్టి సింహాసనం హరించాడు. విజయనగరఆస్థానంతో పరిచయమున్న కారణంగా అన్నమాచార్యులవారికి ఈ కిరాతమంతా తెలిసింది. ఇక అక్కడి రాజపురుషుల దౌర్జన్యమంతా ప్రత్యక్షంగా అవగతం చేసుకున్నారు. ఆ దుశ్చర్యలనన్నిటినీ ఈ క్రింది గేయం వివరిస్తోంది.

"దేహమిచ్చినవాని తొడరి చంపెడివాడు
ద్రోహిగాక నేడు దొరయటా—
తోడబుట్టినవాని తొడరిచంపెడివాడు
చూడ దుష్టుడుగాక సుకృతియటా—
కొడుకు నన్నతమతిం గోరి చంపెడివాడు
కడు పాతకుడు గాక ఘనుడటా—
తల్లి జంపెడువాడు తగ పాతకుడుగాక
యెల్లవారలకన్న యెక్కుడటా".—

1440 అనంతరం తురుష్కరాజులు ఈ తెలుగుగడ్డమీద నెరపిన పైశాచిక కాండంతా యీక్రింది గేయంలో, శోకాక్రోశంగా వినుపిస్తోంది.

"తుటుములై భూసురుల తుండెములు
మొండెములు, ఇటువలె బూతములు
యెట్టుమోచెనో-అట్టు బాలులారోదలు
ఆకాశమెట్టోర్చెనో, కటకటా ఇట్లా
యె కలికాలమహిమా - అంగలార్పె
కామినుల అంగభంగపునోళ్ళు, లింగి
తానమంట సూర్యుడెట్లు చూచెనో,
నిరపరాధులజంపి నెతురు వారించ
గాను, తెరల కట్టుండిరో దిక్పాలులు-
విరసపు రసులుండు విపరీత కాలమున,
గురువాలుం గపటాలె కలికాల మహి
మా- ఉపమించి దంపతులు ఒకరొక
తినింజూచ, చపల దుఃఖములతో సమ
యగాను-తలలువ తెట్టుడుగాను తల్లులు
బిడ్డలవేయ తలపెట్టుండెనో అంతర్యా
మికి-మలసి ముక్కులుగోయ మరు
డెట్టువోరిచెనో, కలకలే ఘనమాయె
కలికాలమహిమా - గూనపంచి తల్లి
జూడ కొడుకు మత్తుకగోయ, గాన
బడె నింతేసి కలికాలమహిమా-"

ఇలా ఎన్నో విషయాల్ని ఎత్తిచూపవచ్చు. అన్నమాచార్యులవారి రచనలు తెలుగుజాతి సంస్కృతికి నిధులు త్రవ్వకొన్నంత వసుసంపద.

మనరాష్ట్రం : మనదేశం

(౬ పేజీ తరువాయి)

కాశ్మీరంలో యుద్ధవిరమణ అనంతరం చిల్లర తగవులు వచ్చినా ఏదో రీతిగా ఉభయ పక్షాలు సరిపెట్టుకుంటున్నారు. సరిపెట్టుకోవడం అంటే సమాధానం కుదరడం కాదు. ఉభయులకీ అసంతృప్తి కలిగినా విధిలేక అంగీకరించడ మన్నమాట. ఇప్పుడు విధిలేక ఏదో సరిపెట్టుకుంటున్నారంటే ముందు ముందు పెద్దసమస్యలు పరిష్కరించవలసి వచ్చినప్పుడు కూడా సరిపెట్టుకుంటారనే నమ్మకం మధ్యవర్తి సంఘానికి కలగవచ్చును. కాని పాకిస్తాన్ వైఖరి గమనిస్తే కుదరదేమోననే అనుమానం అందరికీ కలుగుతుంది. ఏదేమయినా అడ్మిరల్ నిమిట్జ్ కర్తవ్యం చాలా దుష్కరమైనది.

రెండో ప్రపంచయుద్ధంలో జపాన్‌పైన అమెరికా యుద్ధతంత్రం అంతా నౌకాబలం పైనే ఆధారపడి ఉన్నప్పుడు, ఏటంబాంబు ప్రయోగించకముందు పసిఫిక్ దీవుల్లో విజయాల్ని సాధించిన నౌకాదళాధిపతి నిమిట్జ్.

సింధియా ఓడల కంపెనీ

సింధియా ఓడల కంపెనీవారు విశాఖపట్నంలో ఓడలనిర్మాణాన్ని నిలిపివేస్తున్నట్లు దాదాపు 350 మంది కార్మికుల్ని ఉద్యోగం నుంచి తొలగించనున్నట్లు ఒకసారి బెదిరించి ఇప్పుడు నిలపడం లేదంటున్నారు.

డచ్చి ఓడల్లో రవాణారేట్లు తగ్గించడంలో పోటీకి తట్టుకోలేక ఈ కంపెనీవారు భారత ప్రభుత్వాన్ని జోక్యం కలిగించుకోవలసిందని విజ్ఞప్తి చేశారు. భారత ప్రభుత్వం ఇంకా యోచిస్తోంది.

యూరప్‌కు రవానాలో అత్యధికభాగం తమకే కావాలని డచ్చి నౌకా యజమానులు పట్టుబట్టి, భారతదేశం ప్రాచ్యదేశాలకు యూరప్ నుంచి వచ్చే ఓడల యజమానుల సంఘంనుంచి నిష్క్రమించుకున్నారు. యూరప్ నుంచి భారతదేశానికి రవానా రేట్లు తగ్గించేశారు. మిగతా కంపెనీలు తగ్గించాయి. ఈ పోటీలో రేట్లు సగానికి పడిపోయాయి.

డచ్చి యజమానులికి ఓడరవానాలో నష్టం వస్తే డచ్చి ప్రభుత్వం భర్తీ చేసే ఏర్పాటుంది. మిగతా దేశాల్లో ఆ ఏర్పాటు లేదు. అందువల్ల డచ్చివారు రేట్లు తగ్గించినా అంత నష్టపోరు. ఓడవర్తకానికీ, ముఖ్యంగా ప్రాచ్యదేశాలలో వర్తకానికి ప్రాధాన్యత నిచ్చే డచ్చిప్రభుత్వం ఓడలకంపెనీవారిని ప్రోత్సహిస్తున్నారు.

దీనివల్ల ఇతరదేశాలనుంచి భారతదేశానికి తిన్నగా వచ్చే సరుకులన్నీ, యూరప్ వెళ్లి, అక్కడనుంచి ఇక్కడ రవానా చెయ్యడానికి యత్నిస్తారు.

భారతదేశం వర్తకానికి దెబ్బతీయగల అవకాశం కూడా ఉంది.

ఈ ఏప్రిల్ 2, 3, 4, తేదీలలో, తిరుపతి ప్రాచ్య పరిశోధనాలయమువారు శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యోత్సవము జరుపుతున్నారు. అన్నమాచార్యులవారు క్రీ శ 1424-1503 ల మధ్య జీవించిరి.

అన్నమాచార్యులవారి రచనలలో కొన్నిటిని శ్రీ అనంతకృష్ణశర్మగారు స్వరవిన్యాసాలతో సహా ఆంధ్ర వార పత్రికలో కొన్నిమాసాలుగా వారం వారం ప్రకటించుతున్నాము.

పై వ్యాసంలో ఉల్లేఖించిన అంశాలలో చాలాభాగం, శ్రీ వెంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాశాలవారు ప్రచురించిన 'అన్నమాచార్య చరిత్రపీఠిక' నుంచి సేకరించాం. ఆ గ్రంథానికి శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారు సంపాదకులు.

తాళ్ళపాకవారి పదములు

శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ

౨౦

అన్నమాచార్యుల రచన: (సంపు. 3; ప. 3౧౨)

నాటరాగం - మిశ్రచాపుతాళం

[రాగలక్షణం]

నాట, నాటా, నాటి, నట్ట, నట్టా - అనికూడా దీనిని పేర్కొన్నారు. చాలా ప్రాచీనమైన రాగం. ఇప్పు డిది ఘనరాగాలలో మొదటిదిగా పరిగణితమైనది. నాటకాలలో, హరికథలలో దీనికే అగ్రపూజ ఇచ్చేది ప్రాత పద్ధతి. పౌరుషప్రధానమై గంభీరభావాలు గలిగినది. వర్ణనాట, సాళంగనాట - ఇత్యాదులను దృష్టిలో నుంచుకొని దీనిని 'శుద్ధనాట' అనికూడా సోమనాథాదులు పేర్కొన్నారు.

36 వ మేళమైన చలనాటలో ఇది జన్యము. సంపూర్ణరాగం. ష-రి, అం-గా, శు-మ, ష-ధ, కా-ని స్వరములు గలది. ఆరోహణంలో సంపూర్ణంగా 'స రి గ మ ప ధ ని స' అనియు, అవరోహణంలో 'స ని ప మ రి స' అని ఔడవంగానూ సామాన్యప్రయోగం. స గ మ, స మ గ మ, ప స ని స - ఇత్యాదిప్రయోగాలే ఎక్కువగా వచ్చును. షడ్జమధ్యమ షడ్జ పంచమ స్వరాలు పరస్పరవాదసంవాదాలు గలిగి స్ఫురించును. రిషభము జీవస్వరమై న్యాసం చేసినప్పుడు రాగాన్ని ఎక్కువగా స్ఫురింపజేస్తుంది. స రీ, ప మ రి, ప మ రీ గ మ రి, స స రి రి స ని ప ప రి స రీ - ఇత్యాదులు రాగజీవాతుప్రయోగాలు. గ-ధ స్వరాలు రెండూ అనువాదాలుగామాత్రం ప్రవేశించును. గాంధారం మధ్యమాన్నీ నిషాదం షడ్జాన్నీ వన్నంటుకొనే నడుచును. కాబట్టే, దీని గాంధారం చ్యుతమధ్యమగాంధార మని, నిషాదం చ్యుతషడ్జనిషాద మనీ రామామాత్యుని లక్షణం. (స్వ. మే. క. మేళ ప్ర. 36.36) సోమనాథుడూ వాటిని మృదుమధ్యమ మని, మృదుషడ్జ మని అన్నాడు. (రాగవి. వివే. 3.౪౯) కనుక షడ్జంతో సంవాదంగల అంతరగాంధారాన్నిగాని, పంచమంతో సంవాదించే కాకలీనిషాదాన్నిగానీ శుద్ధంగా నిలిపితే రాగరక్తి చెడుతుంది. రిషభం దీర్ఘమైనప్పుడు కళి గమకంతోనూ, లఘువైనప్పుడు నొక్కుతోనూ నడుస్తుంది. అన్నిటికంటె దుర్బలస్వరం ధైవతం. ఇది లఘువుగానే నొక్కుతోనే వచ్చును.

కొందరు దీనిలో రి-ధ లను పూర్తిగా వర్జించి 'గంభీరనాట' అనే పేరుతో సులభీకరించుకొని పాడుతారు. కాని తచ్చూరివారు గాయకలోచనంలో 'స రి గ మ ప ధ ని స - స ని ధ ప మ గ రి స' అనే మేళాన్నే 'గంభీరనాట' అని పేర్కొన్నారు! (ప్ర. ౬౮) వెంకటమఖి చతుర్దండిప్రకాశికలోని 'అవరోహే నిధగరి వర్జ మేనం ప్రచక్షతే' (రాగ ప్ర. ౪౫) అన్నమాట సరియైన పాఠంగా తోపదు. నిధగరి స్వరాలు నాలుగూ వదలి, సపములతోనే అవరోహంలో సాము చేయవచ్చునుగాని అది రక్తికీ సంప్రదాయానికీ విరోధం. అనుబంధంలోని అతని రాగలక్షణంలో 'అవరోహే గధవర్జితః' అనే కలదు. (పు. ౯౬) సోమనాథు డతనికంటె పూర్వమే ఇచ్చిన లక్ష్యంలో ఇదే పద్ధతి స్పష్టంగా ఉన్నది. (రాగవి. వివే. ౫. ప. ౧౦౧) ఇదే రాగమే సులభీకరించుకొని, ష-ధను కైశికీనిషాదంగా మార్చి, అంతరగాంధారాన్ని శుద్ధంగా న్యాసస్వరం చేసుకొని, రిషభాన్ని పూర్తిగా తోసి, ఔత్తరాహులు 'తెలంగ్' అనే పేర ప్రీతితో పాడుతారు. పేరు కేమైనా అర్థముంటే హిందూస్తానీసంప్రదాయాని కది తెలుగువారి ప్రసాదంగా కానవస్తుంది. నా అనుభవంలో తెలుగుదేశంలో నాటరాగాని కున్నంత ఎక్కువ ప్రచారం ఇతరదేశాలలో కానరాదు.

[పల్లవి]

(౧) సా , రి స స ని సా , , , స ని | స సా మా గా గ ప మ రి స ని |
న ల్ల ని మే ని న గ వు జా పు ల వా డు

(౨) సా మ మ రి రి స సా ని ధ ని సా | స సా పా మ ప మ గా ప మ రి స ,
న ల్ల ని మే ని న గ వు జా పు ల వా డు

(౩) స గ ప మ మ రి రి స ని ప ని సా | స పా మ ప ధ ప మ గ రి రీ గ మ ప మ రి స ,
న ల్ల ని మే ని న గ వు జా పు ల వా డు

(౧) సా , రి రి స స మా గా మా | పా , మ గ ప మ రి , , , , ,
తె ల్ల ని క న్ను ల దే వు డు

(౨) సా , రి రి స మ గ మా పా | పా , ధ ధ ప మ ధ ప మ ప మ రి
తె ల్ల ని క న్ను ల దే వు డు

(౩) సా , ప మ మా మ రి సా ప మ మ గ మా పా | ప సా స ని ప మ ధ ప ప మ మ రి రి
తె ల్ల ని క న్ను ల దే వు డు

(౪) సా ప ప మ రీ గ మ ప ధ ని సా | ప ని స రీ , , గ స ని ప ప మ మ రి (నల్లని)
తె ల్ల ని క న్ను ల దే వు డు

[చరణం]

గ మా పా పా ప పా పా పా | పా ధ పా మా మ పా ప మ రీ
వి రు వై న ద ను జు ల పిం చ మ డ చి న ట్టి

గ మా ధ ప ప మ గ ప మ రి స ని | సా ప ప మ గ మ పా , , , ,
తి రు పు గై గు వు తో డి దే వు డు

గ మా పా ధ ప ప స ని సా సా | సా , రీ సా మ రీ సా నీ
చ ళి బ డ్డ జ గ మె ల్ల జ క్క జా య కు దె చ్చి

ప నీ స రీ సా ని ప మ గ మ ప ని | సా రీ స ని ప మ ధ ప ప మ మ రి రి (నల్లని)
తె రు వు చూ పి న ట్టి దే వుం డు

ఇట్లే ఈ క్రింది చరణాలు:

(౨) నీట గలిసినట్టి - నిండిన చదువులు, తేటపఱచినట్టి - దేవుండు,
పాటిమాలినట్టి - ప్రాణుల దురితపు, తీటవాపెనట్టి - దేవుండు (నల్లని)

(౩) గురుతుపట్టగరాని - గుణముల నెలకొన్న, తిరువెంకటాద్రిపై - దేవుండు,
తిరముగ ధ్రువునికి - దివ్యపదం బిచ్చి, తెఱచి రా జన్నట్టి - దేవుండు (నల్లని)

లఘుటీక : అధ్యాత్మసంపుటంలో చేరవలసిం దీ పదం శృంగారసంపుటంలో కలిసిపోయింది. తెల్లని కన్నులు=శుద్ధసత్వస్ఫోరకములైన చూపులు; పించము=మదము. పెచమని రూపాంతరము; తిరుపుగైదువు=చక్రాయుధం; చళిబడ్డ=కొండలోయలో బడిన - పతితములైన; చక్కజాయ=చక్కనిత్రోవ; నీటగలసినట్టి నిండిన చదువులు=సముద్రంలో సోమకాసురుడు ముంచిన వేదాలు; పాటిమాలిన=కొలతకు మించిన; తెఱచి రాజన్నట్టి=ఇది చదరంగపు మాట: ఎదుటి రాజు కడ్డంగా వున్న తన జంతువును ఎత్తివేసి మీ రాజును పట్టుకొంటా నని ఇంకొక కాయతో బెదిరించుట. దీనినే 'షహ' అని కూడా అంటారు. 'ధ్రువునికి దివ్యపద మిచ్చి నాడు. కా దనే వా రెవరో చూస్తాను' అని భగవంతుని స్వచ్ఛందభావం ఇప్పటి అర్థం

ముద్రిత పాఠములు : సరిబడ్డ; పాలుమాలినయట్టి; తీటవాసినట్టి; ధ్రువుని దివ్య; తెరచి రాజరా జన్నట్టి.

వ్యవసాయము మానవకల్పితమా? ప్రభుత్వప్రేరితమా?

శ్రీ యద్దనపూడి వెంకటరత్నం

సృష్టియొక్క ఉత్పత్తి, స్థితి, లయముల కారణము, ఏ మతసిద్ధాంతములనబట్టి చూచినా జీవికి, జీవినే జీవనాధారముగా కల్పించినట్లు కన్పించకమానదు. మానవులు సాధుమృగములను చంపి తినడము, ఘాతుకమృగములు తృణ, తరు, లతా, గుల్మాదుల నారగించి బ్రతికేవాటిని వేటాడి చంపి తినడం, జలచరములలో పెద్ద చేప, చిఱుచేపలను మ్రింగి జీవించడం, సరీసృపాదులలో కూడ పాము కప్పను మ్రింగడము, బల్లి ఈగలను గుటకవేయడము సాలీడు ఈగలను దోమలను పట్టుకొని భుజించడము ఆబాలగోపాల మెరంగినదే. ఇవి గాక, మన కంటికి కగోచరములగునట్టి చిత్రవిచిత్రములగు ప్రాణికోటిలయకారణములు, మానవుని వూహకు అతీతములగునవి వేనకువేలున్నవి —

ఈ సిద్ధాంతములను బైబిలు, ఖొరాను, జింద వస్తా మొదలగు యితర సిద్ధాంతములన్నియు సమర్థించుటకూడ కలదు. కాని ఆహార నిద్రా భయ మైథునములు ప్రాణికోటికి అన్నిటికి సర్వే సర్వత్రా సమానములే కాని, ధర్మమనేది మానవునియందు నిక్షిప్తము కాబడిన ప్రత్యేక విశిష్టత కావున, తనయందు లీనమైయుండు మానవత్వమును ప్రదర్శించుటకు జీవహింస వర్జనీయమని చెప్పుతూ "అహింసా పరమో ధర్మః" అనే నీతి నొకదానిని ప్రచారములోనికి దెచ్చినారు. ఈ హింసాస్వరూప నిర్ణయముగాని, దీని నిర్వచనముగాని దీని మోతాదు పరిమాణముగాని, యిదమిత్థమని యెక్కడను విపులముగా వివరింపబడిన ట్లగుపింపదు. కాని అహింసా పరమో ధర్మః అను సిద్ధాంతమును, తూ-చ-తప్పకుండ, పామర ప్రజాసముదాయమునందు వ్యాప్తి నొందించి, తదనుగుణ్యముగా వారిని ప్రవర్తింపజేయుటకు తీవ్రప్రయత్నము లేవైనా చేసి, వాటిని ఆచరణలో బెట్టి, ప్రజాసముదాయముయొక్క తత్వములందలి మార్పేదవజేసారా? అదీ కనుపించదు. ఈశ్వర ప్రేరితమగు పరస్పరహింసాభావ మంతరించలేదు. ఋషిప్రోక్తమగు అహింసా పరమో ధర్మమును ఆర్యోక్తి పూర్తిగా అమలులోనికి రాలేదు. నేటికి ప్రజాసముదాయ కొన్ని సంఘములవారు, తమతమ యిష్టదేవతారాధన సందర్భములలో సాధు మృగములను-అనగా కోళ్లు, గొర్రెలు, మేకలు మొదలగువాటిని బలి యిచ్చుచుండుట కలదు. జీవకారుణ్యదీక్షాపరులు, జంతువులను వధించుట హింసాత్మకమనియు బలియిచ్చు విధానమును మానుమని సత్యాగ్రహ మొనరించుచుండుటకూడ కలదు. కాని, నిరుపేదలగు వ్యవసాయదారుల దుక్కిటెడ్లను, తరిపె ఆవుపెయ్యలను ఘాతుకమృగములు బలిగొనకుండ నివారించి, వాటి తత్వమును సాధుత్వములోనికి మార్పొదవింపగల తరుణోపాయ మేదియును యింకను కన్పెట్టబడినట్లు కనుపించదు. మానవకోటి తమ జీవితములను పొడుగించుటకు, ఈశ్వరదత్తములగు సహజాహారములేగాని అన్యశరణ్యములేదని తృప్తిపడినంతకాలము, వ్యవసాయము తెలయెత్తలేదు. సృష్టియందలి ప్రజాసముదాయము దినదినాభివృద్ధిగాంచసాగినది. అంతవరకు వీ నారగించి జీవితములను గడుప జూచిన జలచర, వనచర, భూచర, ఖేచర సంతతులు క్షీణింపసాగినవి. ఇవి పన్నిగ్లుటకు కేవలము మానవులొక్కరే కారణభూతులు కారు. వాటిలో వాటికవే జీవనాధారంగా వుండటం ఒకటి, పిల్ల పుట్టగానే తల్లి చనిపోవునవి కొన్ని, వానిగ్రుడ్లనవే మ్రింగునవి కొన్ని, వానిని పిల్లలను అవే తినేసేవి కొన్ని వున్నవి.

ఇట్టి విచిత్రపరిణామము లన్నిటిని మానవులు విలోకించినారు. పరమేశ్వరుని చైదములకు అత్తు తగిలే స్థానము లేకపోయినది తమ జీవితములను పొడుగించే అన్యతర జోపాయముల వంకకు, తమ దృక్కులను మరల్పసాగారు. తొలుత సద్బీజములవంకకు చూచారు. వాటిలో ఆహారయోగ్యములగువాటి నేరుకొని తినుట మొదలిడినారు. ఆకాలమునాటికే, నేటివరకు మన ఆహారయోగ్యములుగా పరిగణించి స్వీకరించుచున్న, తోటకూర, గోంగూర, చిర్రిలికూర, వెల్లికూర, యిత్యాదులు. వాటికి తోడు దుంపలను త్రివ్వి తీసి తినసాగారంభించినారు. నేటి కంద, పెండలం చామ యిత్యాదులే కాలపు సాంప్రదాయము నాటికే. వృద్ధియగుచున్న సంఘమునకు యివి కూడ చాలినన్ని లభించుట దుర్లభము కాసాగినది తదాది ఫలవృక్షములవంక కనుమరలి, వాటినుండి ఫలించు ఫలముల నారగించి, క్షుత్పిపాసావిముక్తులు కాసాగిరి. కొంతకాలమునకు యివి కూడ ముదిరేకి ఫలహీనములగుటయో, లేక కాపులేకపోవుటయో తటస్థించి రెండడి సంభవించేది. వీటిమీద ఆధారపడియుండుట కూడ ప్రమాదహేతు వనుకున్నారో యేమిటో. తృణధాన్యాదులవంకకు తమ దృష్టుల నిగుడ్చసాగారు. ఆకాలపు ఫలవృక్షములే నేటి మామిడి, పనస, రేగు, వెలగ, నేరేడు మొదలగునవి. తృణధాన్యాదులు అనగా, నివ్వారి, యవ, గంటి, కొర్ర, చామ, జొన్న మొదలగునవి తొలుత, మన్నకుండా విత్తకుండా వాటంతటవి పడి మొలిచి ఫలించినవాటి నేరి తెచ్చుకొనేవారు. అవికూడ చాలినన్ని లభించేవి కావు. ఈవిధముగ వీరి అన్వేషణాఫలితమే, దైవప్రేరితములగు సహజాహారములుగాక, మానవకల్పితములగు తినుబండారముల ప్రత్యేకతకు ప్రాతిపదికము.

కొంతకాలమునకు మానవ సంఘమువందలి విశ్వమానవ సౌభ్రాతృత్వమునకు చేటు వాటిల్లినది. వ్యక్తిగత స్వాతంత్ర్యము మితి మీరినది. ప్రజల మానసకములందు స్వార్థపరత్వము తాండవింపసాగినది. ఆయాచితముగా లభించినదానిని సమిష్టిగ పంచుకొని వినియోగించు విధానమునకు స్వస్తిజెప్పి, యెవరిమట్టుకు వారు, ప్రత్యేక నివాసముల నేర్పర్చుకొని, వారికి వారి కుటుంబములకు, వానిమీద ఆధారపడియుండే వారి జీవనాధారమునకు కావలసిన తినుబండారములు, రేపటంతటి వారే సేకరించుకోవలెననే చింత తలయెత్తినది. తదాది వ్యవసాయమునకు దోహదము కలిగినది. కాని ప్రభుత్వప్రేరితము గాదు. మానవులు, సాధుమృగములను సంఘమునకు దనుట, తమకు తమ సంఘమునకు, పరిశ్రమకు సహాయకరులగువాటి సంతతి అంతరించకుండుటకు గాని, వాటిపై నిర్హేతుకజాతమాన కరుణాకటాక్షము చేత కాదు. పరమేశ్వరుడైనను, పుట్టినవాటి నన్నిటిని బ్రతికించి వృద్ధి పొందించుటలో అంతరాయములు కల్పించుటనునది, ఆ జాతియొక్క నిర్ణీతపుసంఖ్య మితిమీరకుండ, అవస్థలో నుంచుటకై యుండవచ్చును.

కాబట్టి, మానవుని స్వీయానుభవముపై కన్పెట్టబడిన వ్యవసాయమును తీర్చిదిద్దుకొనుటకు, మానవుడే అర్హుడు కాని, ప్రభుత్వముల ప్రోత్సాహ మంతగా సహకారి కాజాలదు. కాని ప్రభుత్వములు చేయవలసిన కర్తవ్యము, చేతోడు వాతోడు. అంతేకాని అదమాయింపు కాదు. కష్టపడి పండించినవానికి, వాని బిడ్డలకు మిగులకుండా, పన్ను, సెస్సు, ఫీజు, డ్యూటీ మొదలగు పేరులతో పీలున్నంతవరకు పంజుకోకూడదు.

అనపోతు

(6 వ పేజీ తరువాయి)

అన. (సంతోషంతో) నిజమేనా, ఆ, ఎక్కడ! అయితే మాడచీ, మరి నాకు కత్తి తిప్పడం సరిగా రాకపోయినా పర్వాలేదుగా.

మాడచి: ఉష్ రామా. ఇల్లాంటివాడవే ఒక్కడివీ మిగిలావా?

అన ఏమిటి మాడచీ, భయపడి అంటున్నావా?

మాడచి (నిట్టూర్చి) కాదులే. సరే విను. ఆడవాళ్ల మందిరానికి రక్షలేదు. ఈ చిట్టడవిలో నాయకురాలి మనుష్యులు పొంచి ఉండి ఒక్కొక్కళ్లే ఇటు కదలి వస్తున్నారు.

శిబిరం తలుపులు గెడలు వేయించి వచ్చాను. ఆడవాళ్లు జాగ్రత్తలోనే ఉన్నారు. కాని వీళ్ల నిక్కడే అటకాయిస్తే తప్ప దిక్కు లేదు. నువ్వో అర్భకుడివై పోయావు. ఏది గతి అని ఆలోచిస్తున్నాను. పోనీలే, నేను కత్తితో కొంత యుద్ధం చెయ్యగలను. నువ్వుకూడా తోడు నిలూ.

అన: రక్షిద్దాం, మాడచీ. ఇక్కడే నిలిచి యుద్ధం చేద్దాం!

మాడచి. హుష్, మాట్లాడకు. ఎవడో తప్పుకుంటూ తారుతూ వస్తున్నాడు. నేను ఈ చెట్టు చాటున నిల్చుంటాను ఆగు.

అన (గట్టిగా ధైర్యం తెచ్చుకుంటూ) ఎవరురా వాడు? పిరికి పందా! దొంగతనంగా వస్తున్నావ్.

సైనికుడు (హఠాత్తుగా ఎగిరిపడి) హుష్ నో రెత్తావంటే చంపుతా ఇదిగో కత్తి చూశావా? పారిపో ముందు.

అన: ఎవడ్రా, పారిపోయేది. దొంగపోటుగా వచ్చిన నువ్వా, నేనా? నేను కత్తి తీస్తాను. ఆగు.

సైనికుడు (ఖంగారుగా) ఎవరూ ఇదేమిటి విడిచి, వదలు.

(మాడచి వెనుకనుంచి సైనికుని రెండు రెక్కలు విరిచి కత్తి బర్రని లాగి అనపోతు ముందర పడేసి)

మాడచి: అనపోతూ అనపోతూ, త్వరగా త్వరగా పొడిచెయ్, వీడిని.

అన (పకపక నవ్వుతూ) భలే, భలే, మాడచీ, భలేపని చేశావ్, పట్టి వెధవని పొడిచెయ్యటం ఎందుకులే, చేతులు కాళ్లు కట్టి పడేస్తానుండు. (అని కండువాతో వాడిని కట్టాడు.)

మాడచి: (రొప్పుతూ కోపంతో) అనపోతూ అందుకే పిరికిపంద అన్నారు నిన్ను జాలి చూస్తావేం పొడి చేయక......

అన (అనుమానంగా) పొడిచెయ్యాలంటావా"

సైని. (ఏడుస్తూ) బాబూ, బాబూ, రక్షించు, నీ జోలికి రాను పోతా, నా పానం కాయి వాటు కాదు.

అన: చేతులు రావటం లేదు మాడచీ.

మాడచి · ఛీ పిరికిపందా, (కోపంతో సైనికుణ్ని పొడిచేస్తుంది.) (సైనికుడు) అమ్మో (అంటూ చచ్చిపోతాడు.)

అన: కళ్లు మూసుకొని (జాలిగా) అబ్బా మాడచీ, పాపం ఎంతబాధపడుతున్నాడో, కత్తిచేయిజారిన వాడిని ఎందుకు పొడిచావ్.

మాడచి: అనపోతూ ఇది యుద్ధం, సాహసానికి జాలి తోడుకాదు. ఇల్లా అయితేనే పిరికిపంద వవుతావు. ఈ కాసేపు జాలి పనికిరాదు. అదుగో మళ్లీ సైనికులు వస్తున్నారు. ఆ కత్తి తీసుకో.

అన. నిజమే మాడచి, నిజమే.

సైని: (సైనికులు ఇద్దరు ప్రవేశిస్తారు) యెవరూ ఒక ఆడదీ ఈ పిరికిపందానా, వీర నాథుడని పంపారు. ఏయ్ అమ్మో తల కాచుకో (అంటూ కత్తి ఝుడిపిస్తాడు.)

అన: మాడచీ నువ్వు ఆగు, (అనపోతు కత్తితో కలియబడతాడు.)

(కత్తుల చప్పుడు: రెండవసైనికుడు) నువ్వా మాడచివి, ఉహుహుహు, హరహర మహాదేవ్.

అన: మాడచీ మాడచీ కత్తి కత్తి, తప్పుకో.

మాడచి: నాకేం పర్వాలే, వీడిని చంపుతాను, వాడి విషయం చూడు.

సైని: ఇద్దరిపని పట్టిస్తా నుండండి.

అన: వెధవ మళ్లీ వీడు కిందబడ్డాడు. కాలికింద తొక్కావులే. మాడచీ వాడు చచ్చాడా? ఇల్లా రా. వీడిని కట్టి లాక్కుపోదాం. (పరధ్యాన్నంగా కేకలు వేస్తుంటాడు.)

మాడచి · అరెరె. వెనకనుంచి పొడవబోతున్నాడు చూసుకో. నేను వస్తున్నా. (కదులుతాడు కింద సైనికుడు ఎగిరి అనపోతును గుండెల్లో పొడిచి పారిపోతాడు.)

మాడచి వీడిని చంపేశాను. కదలకు, వాణ్ణి పొడిచేయ్.

అన అబ్బా. మాడచీ గుండెల్లో పొడిచాడు.

మాడచి అరె. రె. ఎక్కడి జాలి నాయనా. పొడిచేయమంటే వాణ్ణి వదిలేసి నీ ప్రాణాలు కూడా వదిలావు, యుద్ధంలో జాలి ఏమిటోయ్ తండ్రీ. అనపోతూ. అనపోతూ. ! (అని ఏడుస్తుంది.)

అన: (రొప్పుతూ) పోనీలే మాడచీ. ఇం దొకవాడి బాధ చూసి వీడిని చంపలేకపోయాను. అయినా యుద్ధంలో చంపటంకంటే చావటమే ఉత్తమం. (ఎగశ్వాస పీలుస్తూ) మాడచీ అమ్మతో, అన్నతో, స్నేహితులతో అనపోతు పిరికిపంద కాడని చెప్పవ్.

మాడచి: నాయనా ఇంత సాహస ముండీ సాహసానికి పొత్తు లేని, జాలిగల బ్రాహ్మడివై పోయావ్. నువ్వు పిరికి పందవా. శత్రు సైనికులంతా పారిపోయారు. స్త్రీ శిబిరాన్ని రక్షించావ్ అనపోతూ!

గం: (ప్రవేశిస్తూ) అనపోతూ, ఒరె వెధవా, తిండి ఏడవకుండా ఎక్కడికి పోయావురా. పోనీ ఈ మినపసున్ని పట్టికెళ్లరా.

మాడచి: (ఏడుస్తూ) గంగమ్మా అనపోతు చచ్చిపోయాడు.

గం · (దిగాలుపడి) ఏమిటి! ఎల్లా చచ్చిపోయాడు! (మనిషి దగ్గరకు వచ్చి) అనపోతూ నాయనా!

మాడచి: స్త్రీశిబిర రక్షణకై సైనికులతో యుద్ధం చేస్తూ, క్రిందపడ్డవాడిని జాలి తలచి వదిలాడు. వీరాడుగా చండెగా వాడు పొడిచేశాడు గంగమ్మా నీ కొడుకు వీరస్వర్గమందుకొన్నాడు. నువ్వు వీరమాతవయ్యావ్!

గం. హా! వీరస్వర్గం. వీరమాతనా. మాడచీ.

మాడచి ఏడవకు గంగమ్మా. వీరపుత్రుణ్ణి కన్న దానివి.

గం (వైరాశ్య కంఠంతో) ఏడుస్తున్నానా, మాడచీ. ఏడవటం లేదు. ఒక్క విషయం చెప్పనా. అనపోతు తండ్రి యుద్ధంలో ప్రాణం వదిలాడు. ఆనాడు వీరపత్నిని కాలేకపోయాను. ఆయనకోసం అహోరాత్రాలు ఏడ్చాను. ఆ విరక్తిలో ఈ రందరికీ వెర్రిగంగమ్మనూ గయ్యాళిగంగమ్మనూ అయాను. నా కొడుకుకూడా వెళ్తాడేమో నని పిరికిపందను చేస్తూ పెంచుకువచ్చాను. కాని తండ్రి రక్తం తప్పలేదు శిక్ష ఇయ్యలేదు గాని, సాహసాన్ని తుడిచిపెట్టలేక పోయాను. మాడచీ, కన్నకడుపు కాలిపోయిన వీరమాతృత్వం ఎందుకు? వీరస్వర్గం ఎందుకూ? స్త్రీ లోకాన్నంతా యావజ్జీవం కట్టికుడిపే ఈ సాహసాలెందుకు! కర్మ తప్పదు.

మాడచి: గంగమ్మా, నీ కొడుకు మహాత్యాగం చేశాడు. వీరమాతవయి విసుగుతో ఆ త్యాగాన్ని పాడుచేయకు. అమ్మతో, అన్నతో పిరికిపందను కానని చెప్ప మన్నాడు.

గంగ: లేదు మాడచీ పాడు చేయను. నా కొడుకు..... ఇంతటి తల్లినీ పిరికిపందను చెయ్యలేక పోయాను. అదీ మంచికే అయిందిలే. నా ఒక్కతెకే కాదు కొడుకు. ఈ త్యాగంతో పల్నాటిసీమే అతన్ని తల్లిగా అంకాన్ని చేర్చుకుంది. మాడచీ, నేను నా కొడుకును పతినీ చేరుకుంటున్నాను. (పొడుచుకుంటుంది.)


మాడచి · అనపోతూ, తల్లి గంగమ్మా, పుట్టుకతో ధన్యులు మీరు! మీ త్యాగాలు తెలుగు వీరగీతాలై వెలుస్తాయి, ఓ అనపోతూ. హా!

(ఆలిండియా రేడియోవారి సౌజన్యంతో)

అమెరికాలో గృహాలంకారం



ఇంటిముఖ్య చావడి : సోఫాలు, అలమార్లు, మెదలైన సామానులన్నీ అందమైనవే.



వంట యిల్లు : ఎలక్ట్రిక్ వంట సౌకర్యాలతో శుభ్రంగా ఉంటుంది వంట యిల్లు.



స్నేహితులూ, బంధువులూ కూర్చొని కాలక్షేపం చేసే చావడి.




అందంగా అమర్చి ఉన్న పడక గది.


★ వార్తా చిత్రాలు ★



మార్చి 15 వ తేదీన గుడివాడతాలూకా కనుమూరు గ్రామంలో శ్రీ వేంకటేశ్వర, శ్రీ వేణుగోపాల, శ్రీ సోమేశ్వరస్వామి వార్ల ఆలయములో కాంగ్రెసు సేవాసంఘమువారిచే శ్రీ కాశీనాథుని పూర్ణ మల్లికార్జునుడు ఎం. ఏ., బి. యల్. గారి అధ్యక్షతను జరిగిన హరిజన దేవాలయ ప్రవేశ మహోత్సవ దృశ్యం.



రాయిటర్ సహృద్భావ రాయబార వర్గమునకు మంత్రి ఆర్. ఆర్. దివాకర్ గారు మార్చి 18 వ తేదీన విందు చేసిరి. ఆ సందర్భంలో ప్రధానమంత్రి, పండిట్ నెహ్రూ, ఉపప్రధానమంత్రి సర్దార్ పటేల్, పరిశ్రమలమంత్రి డాక్టర్ ముఖర్జీ రాయబారవర్గనాయకుడు లార్డ్ లేటన్‌లు ఇష్టాగోష్ఠి జరుపుతున్నారు.



ఆంధ్రరాష్ట్ర వర్తక సంఘ మహాసభా సందర్భపు ఛాయాచిత్రం.

Regd. M. No. 4479

కళాప్రపూర్ణ

శ్రీ॥ శే॥ కాశీనాథుని నాగేశ్వరరావుగారి

ఉత్కృష్టరచన

ఆంధ్రవాఙ్మయచరిత్ర

సరికొత్త పద్ధతిని. సంగ్రహ రూపంలో విడివిడిగా సమగ్రసమీక్ష. వేల్యేండ్ల వాఙ్మయచరిత్రకు విస్పష్టరూపాన్ని చారిత్రిలనన్నిటిని ఒకచోట చేసి, సమన్వయించి ప్రోత్సహించిన నిసలయిన చరిత్ర

శాసనాలలోను వాటిలోనూ అక్కడక్కడా ఉండి ఉండి, నన్నయభట్టు అని ఒక్క ఊపుగా వ్యాకరణంతో బైటపడి, నానాటికీ సమున్నతంగా వికసించిన మన వాఙ్మయం పోయిన పలుపోకడలన్నీ పోలికలతో చూపెట్టజాలిన ఉత్తమ గ్రంథం.



వెల రు 2-0-0 లు, తపాలాఖర్చు ప్రత్యేకము.

ఆంధ్రగ్రంథమాల

పోస్టు బాక్సు నం. 212, మదరాసు 1.

ఆంధ్రపత్రిక

శ్రీ విరోధినామ సంవత్సర

పంచాంగం

శుభానికిగాని, అశుభానికిగాని పంచాంగము చూడని హిందువు ఉండడు. ప్రతి హిందూగృహానికి తప్పనిసరి వస్తువు పంచాంగము.

దైవజ్ఞభూషణ

బ్రహ్మశ్రీ పిడపర్తి కృష్ణమూర్తిశాస్త్రులు

గారిచే గుణింపబడినది

1000 కి రు. 175/- 100 కి రు. 20/- వెల

1-కి రు. 0-4-0.

ప్యాకింగు, పోస్టేజి ప్రత్యేకము ఆర్డరుతోపాటు, సగం పైకం అడ్వాన్సుగా పంపవలెను

వివరములకు

మేనేజరు.

ఆంధ్రపత్రికా కార్యాలయం, మద్రాసు 1.

ఆంధ్రవిజ్ఞానసర్వస్వము

ప్రథమ ద్వితీయ సంపుటములు

ప్రథమ సంపుటమునందు డిమ్మీ ౮-వ ఆకృతియందు ౬౦౦ పుటలు గలవు ఇందు 'అ' నుండి "అధ్వర్యు" వరకును గల విషయములు గలవు. త్రివర్ణ పటములు ౮, ఇతరపటములు ౧౩౫, వివిధ విషయములు ౯౦౦ కలవు.

రెండవ సంపుటమునందు డిమ్మీ ౮-వ ఆకృతియందు ౬౦౦ లకు మించిన పుటలు కలవు. "అగ" మొదలుకొని "అశ్వినీ" వరకు గల విషయము గలదు. త్రివర్ణపటములు ౧౦. వానిలో ౨ అమరావతి స్తూపమునకును ౨ అనాహతమునకును చెందినవియు, ౬ దేశచిత్రపటములును గలవు ఇవిగాక మరి ౫ సాదా దేశపటములు కలవు. ప్రాచీనాంధ్రుల కళాసంపదను వ్యక్తముచేయు అమరావతీస్తూపమును గురించిన గొప్ప వ్యాసమునందు అమరావతీ శిల్పమునకు సంబంధించిన హాఫ్‌టోన్ బొమ్మలు రమారమి ౧౧౦ ను, దేశభాషాదుల వెల్లడించు బొమ్మలు ౫౦ వఱకును గలవు. మరియు అభినయమను వ్యాసమున భరతశాస్త్రమునందలి వేలువేలుహస్తములను సూచించు బొమ్మలు ౫౭ ను, 'అనాహతము' నందుమట్చ్రాదుల చిత్రములును గలవు ఇట్లు ఆ యా వ్యాసములకు చెందిన చిత్రములు మొత్తముమీద ౨౫౦కి పైగా నున్నవి. వివిధ విషయముల సంఖ్య ౯౦౦ వరకు నుండును. సంపుటము చక్కని స్వదేశీచర్మముతోడను బంగారు రేఖలతోడను సంపుటీకృతము ప్రతిసంపుటమునకు ౬౦౦ పుట లుండును

ప్రతి సంపుటము వెల రూ. ౧౦.

పోస్టుఖర్చులు రూ ౧-౮-౦

రైలు ద్వారా దగ్గర చోట్లకు ఖర్చులు అ. ౧౨

మేనేజరు,

ఆంధ్రవిజ్ఞానసర్వస్వ కార్యాలయము.

నం 7, తంబుశెట్టివీథి, మదరాసు

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., G. T. Madras.